www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
11-11-2024
సంపుటి : 01 | సంచిక : 189 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS



డా॥ కాచం సత్యనారాయణ
CMD



## 51వ సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

- ముగిసిన జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలం..
- నేడు బాధ్యతలు స్వీకరించనున్న సంజీవ్ ఖన్నా
- ప్రమాణ స్వీకారం చేయించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము


**ఢిల్లీ:** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం నేటితో ముగిసింది. దీంతో సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. 51వ భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు మిగతా2లో...

### నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై
## రైతుల నిరసన



### కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

**విశ్వంభర, నల్గొండ:** జిల్లాలోని వేములపల్లి వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు. ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఓ రైతు రోడ్డుపై పడుకొని ఆందోళన చేశాడు. అన్నదాతల నిరసనలతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ వారు ఆరోపించారు. వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



# పాలమూరు రుణం తీర్చుకుంటాం

### కురుమూర్తి స్వామి దయతోనే సీఎం అయ్యాను



- గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తి కాలేదు
- పాలమూరు అభివృద్ధిని కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారు
- కేసీఆర్ హయాంలో ఇక్కడికి పరిశ్రమలు, ప్రాజెక్టులు రాలేదు
- ఇంకా వలసలు కొనసాగుతూనే ఉన్నాయి
- మక్తల్, నారాయణపేట్, కొడంగల్ ప్రాజెక్టులను పూర్తిచేస్తాం
- అమ్మాపూర్‌లో కురుమూర్తి స్వామిని దర్శించుకున్న అనంతరం సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, చిన్న చింతకుంట:** పాలమూరు బిడ్డకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందంటే కురుమూర్తి స్వామి దయేనని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అమ్మాపూర్‌లో కురుమూర్తి స్వామిని దర్శించుకున్న అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల తిరుపతిగా కురుమూర్తిస్వామిని కొలుస్తారని చెప్పారు. ఇక్కడ దర్శించుకుంటే తిరుమల వేంకటేశ్వరస్వామిని మిగతా2లో...

## ఓబీసీలను విభజించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది

- కాంగ్రెస్, జేఎంఎంలు పన్నే కుట్రల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
- అధికారాన్ని చేజిక్కించుకోవడానికి అవి ఎంతకైనా దిగజారుతాయి
- ప్రజల్లో ఐక్యత ఉంటేనే భద్రత ఉంటుంది
- జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని పునరుద్ధరణ జరిగితే మళ్లీ మన సైనికులు ఉగ్రవాద దాడులను ఎదుర్కోవాల్సి వస్తుంది
- హేమంత్ సోరెన్ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోంది
- అధికారంలోకి వస్తే అవినీతిపరులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటాం: ప్రధాని నరేంద్ర మోదీ



**రాంచీ:** ఓబీసీలను విభజించడానికి కాంగ్రెస్- జేఎంఎం ప్రయత్నిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించకూడదు అంటే ప్రజలు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఐక్యత ఉన్నప్పుడే భద్రత ఉంటుందని పేర్కొన్నారు. గతంలో ఓబీసీలు, గిరిజనులు, దళితుల మధ్య ఐక్యత ఏర్పడనంత వరకు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తూనే ఉందని పేర్కొన్నారు. ''కాంగ్రెస్, జేఎంఎంలు పన్నే కుట్రల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. అధికారాన్ని మిగతా2లో...

## భారత్ పర్యటనకు రష్యా మొదటి ఉపప్రధాని

- ప్రకటించిన ఆ దేశ రాయబార కార్యాలయం
- రష్యన్-ఇండియన్ బిజినెస్ ఫోరమ్ ప్లీనరీ సెషన్ లో పాల్గొననున్న డెనిస్ మంటూరోవ్



2

### ఐపీఎస్‌లకు వార్నింగ్ ఇస్తే
## సుమోటోగా కేసులు

- అధికారులపై చిన్న గాటు పడినా చూస్తూ ఊరుకోం..
- అటవీ శాఖకు నా సంపూర్ణ మద్దతు ఉంటుంది
- స్మగ్లర్ల నుంచి అడవుల రక్షణకు ఎలాంటి సహాయమైనా అందిస్తాం
- మహిళా భద్రత విషయంలో సమాజంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి
- గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

10

## అమరావతి అభివృద్ధికి ముందడుగు

- రూ.15వేల కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం
- అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలు అమలు చేయాలని సీఆర్‌డీఏను ఆదేశిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు



**విశ్వంభర, అమరావతి:** రాజధాని అమరావతి నగరం సుస్థిరాభివృద్ధి, నగర నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులు ఇచ్చే నిధుల వినియోగంపై ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సంయుక్తంగా రూ.15 వేల కోట్ల రుణ సహకారాన్ని అందించనున్నట్టు స్పష్టం చేసింది. ఈ నిధులతో రాజధాని అమరావతిలో అత్యున్నత ప్రమాణాలతో మిగతా2లో...

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచన కేంద్రానికి లేదు

నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది: కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

2

## పరిశ్రమల స్థాపనకు తెలంగాణ అనుకూలం

- పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలి
- మలేసియా- భారత్‌ల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడాలి
- పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు



**కౌలాలంపూర్:** దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సులభతర వాణిజ్య విధానాలతో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మలేసియాలో జరిగిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు హాజరైన మంత్రి.. మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

## ఆందోళన చెందవద్దు..

- సర్వే చేసిన సమాచారం అంతా గోప్యంగా ఉంటుంది
- అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలి
- సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన మంత్రి పొన్నం



2



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 110 | రిటైల్ ₹ 132 |
| స్కిన్ ₹ 191 | స్కిన్ లెస్ ₹ 218 |



2

## కాంగ్రెస్ హామీలు ఎక్కడ అమలవుతున్నాయి?

- ఇక్కడ హామీలు అమలు చేయకుండా మహారాష్ట్రలో రేవంత్ అబద్ధాలు
- 6 గ్యారంటీలు పూర్తిగా అమలు చేయలేదు
- తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు

### బీసీల ఓట్ల కోసమే..
## కాంగ్రెస్ కులగణన జపం

### బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

- చేతి గుర్తుకు ఓటేసిన పాపానికి చేతివృత్తిదారుల గొంతు కోశారు
- కొత్త పథకాల మాట దేవుడెరుగు.. ఉన్న పథకాలనే పాతరేశారు
- రేవంత్ ప్రభుత్వం రాగానే.. బీసీ బంధు, రైతు బంధును బంద్ చేశారు
- హనుమకొండ బీఆర్ఎస్ నేతల సమావేశంలో కేటీఆర్



**విశ్వంభర, హనుమకొండ:** కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ప్రకటించి ఏడాది అయిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. బీసీ డిక్లరేషన్ పేరుతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు? హనుమకొండలో నిర్వహించిన బీఆర్ఎస్ నేతల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. చేతి గుర్తుకు ఓటేసిన పాపానికి చేతివృత్తిదారుల గొంతు కోశారని విమర్శించారు. ''కొత్త పథకాల మాట దేవుడెరుగు.. ఉన్న పథకాలకే పాతరేశారు. మిగతా2లో...

# 51వ సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

(మొదటి పేజీ తరువాయి)
స్వీకరించేందుకు సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన తో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. రాష్ట్రపతి భవన్ ఇందుకు వేదిక కానుంది. ఎన్నికల బాండ్లు, ఆర్టికల్ 370 రద్దు వంటి చరిత్రాత్మక తీర్పులు వెలువరించిన ధర్మాసనాల్లో జస్టిస్ సంజీవ్ ఖన్నా కీలక భూమిక పోషించారు. దిల్లీలోని ప్రముఖ కుటుంబానికి చెందిన జస్టిస్ ఖన్నా.. దిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి దేవ్‌రాజ్ ఖన్నా కుమారుడు. దివంగత మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా సమీప బంధువు. 1960 మే 14న జన్మించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. దిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయవిద్యను అభ్యసించారు. నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీకు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా పనిచేశారు.దిల్లీ బార్ కౌన్సిల్‌లో 1983లో న్యాయవాదిగా నమోదు చేసుకున్న జస్టిస్ ఖన్నా.. తొలిరోజుల్లో తీస్‌హజారీ కాంప్లెక్సులోని జిల్లా కోర్టుల్లో ప్రాక్టీసు చేశారు.ఆదాయపన్ను శాఖ సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సుదీర్ఘకాలం కొనసాగారు. 2004లో దిల్లీ నేషనల్ క్యాపిటల్ టెర్రిటరీ స్టాండింగ్ కౌన్సిల్ (సివిల్)గా నియమితులయ్యారు.2005లో దిల్లీ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులయ్యారు. ఆ మరుసటి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు అందుకున్నారు.2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.నవంబర్ 11న సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ ఖన్నా.. 2025 మే 13 వరకు ఆ పదవిలో కొనసాగుతారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమంటూ ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం ఇచ్చిన తీర్పులో జస్టిస్ ఖన్నా కూడా ఒకరు.కేంద్ర ప్రభుత్వం 370వ రాజ్యాంగ అధికరణం రద్దు చేయడాన్ని జస్టిస్ ఖన్నా సమర్థించారు.ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లు సురక్షితమైనవని, బోగస్ ఓట్ల నిర్మూలనలో కీలక పాత్ర పోషించాయని జస్టిస్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం గతంలో తీర్పు వెలువరించింది. లోక్‌సభ ఎన్నికల వేళ దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు జస్టిస్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం తొలిసారి మధ్యంతర బెయిల్ ఇచ్చింది.పెండింగ్ కేసులు తగ్గించడం, సాధ్యమైనంత త్వరగా తీర్పులు ఇస్తారని పేరుంది.



## భారత్ పర్యటనకు రష్యా మొదటి ఉపప్రధాని

**దిల్లీ:** రష్యా మొదటి ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ భారత్‌లో పర్యటించనున్నట్లుగా ఆ దేశ రాయబార కార్యాలయం ఆదివారం పేర్కొంది. ఇందులో భాగంగా నవంబర్ 11న ముంబయిలో జరగనున్న రష్యన్-ఇండియన్ బిజినెస్ ఫోరమ్ ప్లీనరీ సెషన్‌లో ఆయన పాల్గొననున్నారని తెలిపింది. ఇరు దేశాల పారిశ్రామికవేత్తల మధ్య సహకారం, రవాణా లాజిస్టిక్స్, ఫైనాన్స్, డిజిటల్ టెక్నాలజీలు సంబంధాలను విస్తరించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని వెల్లడించింది. దీనిని బిజినెస్ కౌన్సిల్ ఫర్ కోఆపరేషన్ విత్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహిస్తోందని రాయబార కార్యాలయం పేర్కొంది. ఈ సమావేశాల వల్ల ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది.నవంబర్ 12న ఇంటర్‌గవర్నమెంటల్ రష్యన్-ఇండియన్ కమిషన్ నిర్వహించే కీలక సమావేశంలో డెనిస్ మంటురోవ్ భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో సమావేశం అవుతారని వెల్లడించింది. ఇందులో భాగంగా వాణిజ్య, ఆర్థిక, శాస్త్రీయ, సాంకేతిక, సాంస్కృతిక సహకారానికి సంబంధించిన విషయాలపై చర్చలు జరుగుతాయని తెలిపింది. భారత పర్యటనలో భాగంగా రష్యా ఉప ప్రధాని ఇతర ద్వైపాక్షిక సమావేశాల్లోనూ పాల్గొంటారని రాయబార కార్యాలయం పేర్కొంది.

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచన కేంద్రానికి లేదు



**విశ్వంభర, జంగారెడ్డిగూడెం:** విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు. ఆదివారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు రాకుండా కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గుర్తు చేశారు. భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణం సత్తుపల్లి వరకు పూర్తయిందని, మిగతాది త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. రెండు నెలలుగా పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.15వేల కోట్లు విడుదల చేసిందని, అవసరమైన నిధులు విడుదల చేసేందుకు కేంద్రం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. సాధ్యమైనంత తొందరగా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని శ్రీనివాస్‌వర్మ తెలిపారు.

## ఆందోళన చెందవద్దు..

**విశ్వంభర, హుస్నాబాద్:** సమగ్ర కుటుంబ సర్వే తెలంగాణలో చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేటలోని హుస్నాబాద్‌లో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. 87 వేల మంది ఎన్యుమరేటర్లతో ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. దీని వల్ల సంక్షేమ పథకాల్లో కోత ఉండదని, ఆందోళన చెందవద్దని చెప్పారు. సమాచారం అంతా గోప్యంగా ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కొన్నిచోట్ల సర్వేకు ఇబ్బందులు కలిగిస్తున్నారని.. ఇది సరికాదని చెప్పారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని పొన్నం ప్రభాకర్ కోరారు.

## కాంగ్రెస్ హామీలు ఎక్కడ అమలవుతున్నాయి?

**విశ్వంభర, హైదరాబాద్:** మహారాష్ట్ర ప్రజలను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఇక్కడి మోసాలు చాలవన్నట్లు అక్కడ కూడా ఇదే తరహాలో కొనసాగిస్తున్నారన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 రోజుల్లో చేస్తామన్న కాంగ్రెస్ హామీలు ఎక్కడ అమలవుతున్నాయని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికి 11 నెలలు అవుతోందని.. మహిళలకు డబ్బులు ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. మహారాష్ట్రకు వెళ్లి మాత్రం తెలంగాణలో హామీలు అమలు చేసినట్లు చెబుతున్నారన్నారు. ''అధికారంలోకి వచ్చిన వారంలోనే రుణమాఫీ చేస్తామన్నారు.. చేశారా? కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు పూర్తిగా అమలు చేయలేదు. 20 లక్షల మంది రైతులకే రుణమాఫీ చేశారు. ఇంకా 22 లక్షల మందికి చేయాల్సి ఉంది. ఆలస్యంగా చేసిన రుణమాఫీ వల్ల రైతులు వడ్డీ కట్టాల్సి వచ్చింది. హామీలు అమలు చేయకుండా మహారాష్ట్రలో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఇచ్చిన హామీలు తప్పామని అక్కడ చెప్పాలి. రైతు భరోసా లేదు.. రైతు కూలీలకు రూ.12 వేలు ఇవ్వలేదు. వరి పంటకు రూ.500 బోనస్ ఇస్తున్నామని మహారాష్ట్రలో చెప్పారు. అన్నదాతలకు ఎవరికైనా బోనస్ వచ్చిందా? 11 నెలల్లో రేవంత్ రెడ్డి ఒక్క ఇల్లూ కట్టలేదు.. కానీ కూలుస్తున్నారు. పింఛన్లు పెంచి ఇస్తామని చెప్పారు.. ఇచ్చారా? 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని ప్రచారం చేసుకుంటున్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇవ్వలేదు. మీరు ఇచ్చిన 50 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చింది ఎవరు? ఇప్పటి వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు'' అని హరీశ్‌రావు విమర్శించారు.

## పరిశ్రమల స్థాపనకు తెలంగాణ అనుకూలం

(మొదటి పేజీ తరువాయి)
ఆదివారం కౌలాలంపూర్‌లో అక్కడి పారిశ్రామిక వేత్తలతో సమావేశమయ్యారు. స్థానిక తెలంగాణ ఎన్ఆర్ఐలు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. మలేసియా- భారత్‌ల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పెట్టుబడులతో వచ్చే వారందరికి హైదరాబాద్ ఎంట్రీ పాయింట్‌గా ఆహ్వానం పలుకుతోందన్నారు. డిసెంబరులో తెలంగాణలో పర్యటించేందుకు తాము అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పారిశ్రామిక వేత్తలకు వివరించారు. ప్రజా ప్రతినిధిగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న తనకు అభినందనలు తెలిపిన వారందరికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. రెండున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో పార్టీలో ఎంతో ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహిస్తూ వచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గేలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. నలుగురు సీఎంల వద్ద మంత్రిగా పనిచేశానని, వారు తన పట్ల ఎంతో ఆదరాభిమానాలు కనబరిచారని మంత్రి తెలిపారు.

## అమరావతి అభివృద్ధికి ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)
మౌలిక వసతులు, హరిత నిర్మాణాలు, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండేలా కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేసింది. ప్రజా రాజధానిగా అమరావతి అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలు అమలు చేయాలని సీఆర్‌డీఏను ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రధాన రహదారులు, డక్ట్‌లు, డ్రెయిన్‌లు, వరద నీటి ప్రవాహానికి అనుగుణంగా కాలువలు, నీటి రిజర్వాయర్‌లు, సురక్షిత తాగునీరు లాంటి సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులు చేపట్టాలని ఆదేశించారు. అమరావతి రాజధాని సుస్థిరాభివృద్ధికి ఏపీ సీఆర్‌డీఏ ప్రతిపాదనలు సమర్పించగా.. కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదించిందని వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులు కూడా ఆమోదం తెలిపి అమరావతి నగర నిర్మాణం అభివృద్ధికి చెరో 800 మిలియన్



డాలర్ల మేర ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చినట్టు వెల్లడించారు. మిగతా నిధులను కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకుంటుందని స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం పొందేందుకు ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అభివృద్ధి, నిర్మాణ ప్రణాళికల ఆధారంగా దశల వారీగా బ్యాంకుల నుంచి నిధులు పొందేందుకు ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాజధాని అమరావతి నిర్మాణ ప్రణాళికల కోసం బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులతో పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ అధీనంలోనే ఈ అభివృద్ధి, నిర్మాణ ప్రణాళికలు అమలు చేయనున్నట్టు స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేపు, ఎల్లుండి దిల్లీలో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి రుణ సహకారంపై సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఒప్పందం కుదుర్చుకోనున్నారు.

## ఓబీసీలను విభజించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది

(మొదటి పేజీ తరువాయి)
చేజిక్కించుకోవడానికి అవి ఎంతకైనా దిగజారుతాయి. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఐక్యతకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతూ దేశాన్ని దోచుకుంది. ఛోటానాగ్‌పూర్ ప్రాంతంలో 125 కంటే ఎక్కువ ఉపకులాలు ఓబీసీ(లుగా పరిగణించబడుతున్నాయి. ఉపకులాలను ఒకదానితో ఒకటి ఇరకాటంలో పెట్టడం ద్వారా కాంగ్రెస్, జేఎంఎంలు ఓబీసీల ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని అనుకుంటున్నాయి. కాబట్టి ప్రజల్లో ఐక్యత ఉంటేనే భద్రత ఉంటుంది'' అని ప్రధాని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని కాంగ్రెస్ దాని మిత్ర పక్షాలు కోరుతున్నాయని..అది కానీ జరిగితే మళ్లీ మన సైనికులు ఉగ్రవాద దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని తీసుకువచ్చారని, ఏడు దశాబ్దాలుగా అక్కడ రాజ్యాంగం అమలులో లేదని ఆయన అన్నారు. భారత రాజ్యాంగం పేరుతో తొలిసారిగా జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం చేశారని, ఇదే అంబేద్కర్‌కు ఆయన అర్పిస్తున్న నివాళి అని మోదీ అన్నారు. చొరబాటుదారులను తరిమికొట్టేందుకు, అవినీతి నిర్మూలనకు ఝార్ఖండ్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం అవసరమని ప్రధాని పేర్కొన్నారు. అధికార జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణం సృష్టించిన రిక్రూట్‌మెంట్ మాఫియా, పేపర్ లీక్ మాఫియాలను జైలుకు పంపుతామని, యువత భవిష్యత్తుతో ఆడుకున్న వారిని వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. రాష్ట్రంలోని హేమంత్ సోరెన్ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోందని ప్రధాని ఆరోపించారు. ఇండియా కూటమి ప్రజలను దోచుకుందని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం అవినీతికి పాల్పడిన వారికి కఠిన శిక్ష విధించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ దశాబ్ద కాలంగా ఝార్ఖండ్‌కు రూ.80,000 కోట్లు కేటాయించడానికి ఇబ్బందులు పడ్డారని..తమ ప్రభుత్వం గత పదేళ్లలో రాష్ట్రానికి రూ.3లక్షల కోట్లకుపైగా నిధులు మంజూరు చేసిందని ప్రధాని వెల్లడించారు.

## ఉగ్రవాదులతో ఎదురుకాల్పులు.. అమరుడైన ఆర్మీ అధికారి

**కిశ్త్ వాడ్:** జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ జిల్లాలో ఉగ్రవాదులకు, భద్రత బలగాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ ఆర్మీ అధికారి అమరుడయ్యాడు. మరో ముగ్గురు జవాన్లకు గాయాలయ్యాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కిశ్త్‌వాడ్ జిల్లాలో ఇద్దరు గ్రామ రక్షక భటులను (విలేజ్ డిఫెన్స్ గార్డ్స్) ఉగ్రవాదులు కిడ్నాప్ చేసి హతమార్చారు. దీంతో వారిని పట్టుకునేందుకు బలగాలు స్థానికంగా పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలోనే కేశ్వాన్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులకు, భద్రత సిబ్బందికి మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ''ఉగ్రవాదుల కదలికలకు సంబంధించి అందిన నిఘా సమాచారం ఆధారంగా బలగాలు సంయుక్త ఆపరేషన్ ప్రారంభించాయి. ఇటీవల ఇద్దరు గ్రామ రక్షక భటులను హతమార్చిన ఉగ్రవాదులు కూడా వీరే. ఎన్‌కౌంటర్‌లో తొలుత జేసీవో సహా నలుగురు ఆర్మీ సిబ్బంది గాయపడ్డారు. చికిత్స పొందుతూ జేసీవో ప్రాణాలు కోల్పోయారు'' అని సైన్యానికి చెందిన వైట్ నైట్ కోర్ ట్వీట్ చేసింది. ఆ జేసీవోను ఆర్మీ స్పెషల్ ఫోర్సెస్‌కు చెందిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీవో) నాయబ్ సుబేదార్ రాకేశ్ కుమార్‌గా గుర్తించారు. విధి నిర్వహణలో అమరుడైన రాకేశ్ త్యాగానికి సెల్యూట్ అని వైట్ నైట్ కోర్ తెలిపింది. ఈ ప్రాంతంలో ముగ్గురు లేదా నలుగురు ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు భావిస్తున్నామని, ఆపరేషన్ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.



## ప్రేమ వివాహానికి అడ్డొస్తున్నాడని.. ప్రియురాలి తండ్రిపై కాల్పులు



**విశ్వంభర, హైదరాబాద్:**
ప్రేమ వివాహానికి అడ్డొస్తున్నాడని ప్రియురాలి తండ్రిపై ఓ యువకుడు కాల్పులు జరిపిన ఘటన హైదరాబాద్ సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అంబర్‌పేటకు చెదిన బల్వీందర్‌సింగ్ (25), సరూర్‌నగర్ పీఎస్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీకి చెందిన ఓ యువతి (23) కొంతకాలంగా ప్రేమించుకున్నారు.ఈ విషయం ఇంట్లో తెలియడంతో యువతిని ఆమె తండ్రి ఇటీవలే అమెరికా పంపించారు. ఈ క్రమంలో ఆదివారం యువతి ఇంటికి వచ్చిన బల్వీందర్‌సింగ్ యువతి తండ్రి రేవంత్ ఆనంద్‌తో వాగ్వాదానికి దిగాడు. ఆగ్రహంతో ఊగిపోయిన నిందితుడు తన వెంట తెచ్చుకున్న ఎయిర్ గన్‌తో రేవంత్ ఆనంద్‌పై ఒక రౌండ్ కాల్చాడు. తూటా కంట్లో నుంచి దూసుకెళ్లడంతో తీవ్ర గాయమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన యువతి తండ్రిని ఆసుపత్రికి తరలించారు.

## బీసీల ఓట్ల కోసమే.. కాంగ్రెస్ కులగణన జపం

(మొదటి పేజీ తరువాయి)
రేవంత్ ప్రభుత్వం రాగానే.. బీసీ బంధు, రైతు బంధును బంద్ చేశారు. బీసీల ఓట్ల కోసమే కాంగ్రెస్ కులగణన జపం ఎత్తుకుంది. కులగణనలో 175 ప్రశ్నలు అడుగుతున్నారు. బ్యాంకుల్లో డబ్బెంత ఉంది? ఏసీ ఉందా? ఫ్రిజ్ ఉందా? అని అడుగుతున్నారు. కులగణన కోసం వెళ్లిన అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బీసీల ఓట్ల కోసం అధికారులను బలిపశువులను చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అవి ఇచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలి. కేంద్రంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్నా.. కాంగ్రెస్ ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయలేదు. కేంద్రంలో ఓబీసీలకు మంత్రిత్వశాఖ ఉండాలని గతంలో కేసీఆర్ కోరారు. కాంగ్రెస్ నేతల చిత్తశుద్ధిని ప్రజలు అనుమానిస్తున్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే కులగణన ప్రస్తావన తీసుకొచ్చారు'' అని కేటీఆర్ విమర్శించారు.

## పాలమూరు రుణం తీర్చుకుంటాం..



(మొదటి పేజీ తరువాయి)
దర్శించుకున్నట్లేనన్నారు.

**పాలమూరు రుణం తీర్చుకుంటాం..**

''ఇప్పటికీ కురుమూర్తి స్వామి ఆలయంలో మౌలిక సదుపాయాలు లేవు. అందుకే రూ.110 కోట్లతో ఘాట్‌రోడ్డు కారిడార్ నిర్మిస్తున్నాం. ఆలయానికి ఏం కావాలో కలెక్టర్ నివేదిక ఇస్తే నిధులు విడుదల చేస్తాం. దేశంలో ఏ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలోనైనా పాలమూరు ప్రజల కృషి ఉంది. మన రాష్ట్రంలో మాత్రం గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టులు పూర్తి కాలేదు. కేసీఆర్ హయాంలో ఇక్కడికి పరిశ్రమలు, ప్రాజెక్టులు రాలేదు. ఇంకా వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలో పచ్చని పంటలు పండాలి. మక్తల్, నారాయణపేట్, కొడంగల్ ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. పాలమూరు అభివృద్ధిని కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారు. ఇక్కడి బిడ్డనై ఉండి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే ప్రజలు క్షమించరు. పాలమూరు ప్రజలు ఓట్లు వేస్తేనే కేసీఆర్ రెండు సార్లు సీఎం అయ్యారు. 12 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక సీఎంను ఈ ప్రాంతం ఇచ్చింది. పాలమూరు రుణం తీర్చుకుంటాం. యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు వచ్చేలా చూస్తాం. గ్రామగ్రామానికి, తండాలకు బీటీ రోడ్లు వేసే బాధ్యత నాది. విద్య, వైద్యం, ఉపాధి కోసం నిరంతర కృషి చేస్తాం'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. అంతకు ముందు కురుమూర్తి ఆలయ సమీపంలోని ఘాట్ రోడ్డు కారిడార్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం కురుమూర్తి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం రేవంత్‌రెడ్డికి అర్చకులు వేదాశీర్వచనాలిచ్చారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఇతర నేతలు పాల్గొన్నారు.

## తెలంగాణలో గ్రూప్-3 పరీక్షల హాల్ టికెట్లు విడుదల

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో గ్రూప్-3 పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 పరీక్ష జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 పరీక్ష ఉండనుంది. ఈ పోస్టులకు 5.36 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం జరిగే పరీక్షలకు 9.30 తర్వాత, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2.30 అనంతరం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని ఇటీవల టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ కాపీని భద్రంగా పెట్టుకోవాలని, తొలిరోజు పేపర్-1 పరీక్షకు హాజరైన హాల్‌టికెట్‌ను మిగతా పరీక్షలకు ఉపయోగించాలని పేర్కొంది. ప్రశ్నపత్రాలు, హాల్‌టికెట్లను నియామక ప్రక్రియ ముగిసేవరకు భద్రంగా పెట్టుకోవాలని సూచించింది.





కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన అవోపా హైద్రాబాద్ వారు ఏర్పాటు చేసిన కార్తీక వన భోజనాల కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వి3 న్యూస్ ఛానల్ , విశ్వంభర దిన పత్రిక పత్రికల అధినేత డా. కాచం సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. అనంతరం అవోపా కమిటీ వారి చేతుల మీదుగా డా. కాచం సత్యనారాయణ కు సత్కారం చేసారు. ఈ కార్యక్రమంలో అవోపా హైద్రాబాద్ అధ్యక్షుడు నమశ్శివాయ , బాదం కృష్ణ రావు, బచ్చు శ్రీనివాస్, ఇమ్మడి రమేష్, లక్ష్మయ్య , తదితరులు పాల్గొన్నారు.
- విశ్వంభర, సైదాబాద్



తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మి నారాయణ జన్మదినం సందర్భంగా ఆయన నివాసంలో వి3 న్యూస్ ఛానల్ , విశ్వంభర దిన పత్రిక పత్రికల అధినేత డా. కాచం సత్యనారాయణ, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ ప్రధాన కార్యదర్శి కాచం సుష్మ దంపతులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు కొదుమూరి దయాకర్ రావు , కూర రమేష్ , పెండ్యాల విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. - విశ్వంభర, చంపాపేట్ ..



# బెస్ట్ సేవా సొసైటి ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణి

విశ్వంభర, స్థానిక చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ లో గల బాల, బాలికలకు బెస్ట్ సేవా సొసైటి వ్యవస్థాపకులు బుక్కా ఈశ్వరయ్య దుప్పట్లు పంపిణి చేసారు. గత 8 సంవత్సరాలనుండి ఈ సంస్థ పేరున వివిధ ప్రాంతాలలో, రకరకాల సేవలందిస్తున్నారు. ఈశ్వరయ్య ప్రతి చలికాలంలో అనాధలకు దుప్పట్ల పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. కుగ్రామాలలో, గల దివ్యంగులకు, వృద్దులకు అనాధలపై ఎక్కువ శ్రద్ద చూపి ఆదుకోవాలనే తపన తో బచ్చు విక్రమ్ సహకారం తో 300 మందికి దుప్పట్లు పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుక్కా సువర్ణ, ఉప్పల కోటయ్య, ఎకె బిస్వాస్, తదితరులు పాల్గోన్నారు.

## కొవిడ్ 'స్కామ్'పై.. కర్ణాటక
# సర్కార్ నజర్!

**బెంగళూరు:** కొవిడ్-19 సమయంలో వైద్య పరికరాలు, ఔషధాల కొనుగోలు వ్యవహారం కర్ణాటకలో చర్చనీయాంశంగా మారింది. వీటికి సంబంధించి బీజేపీ ప్రభుత్వ హయాంలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. ఇందుకు సంబంధించి జస్టిస్ మైఖేల్ డీ కున్హా కమిషన్ నివేదికను పరిశీలిస్తున్నామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు.''ఈ నివేదిక క్యాబినెట్ ముందుకు రాలేదు. ప్రస్తుతం దాన్ని సబ్ కమిటీ పరిశీలిస్తోంది. సబ్ కమిటీ నివేదిక అందిన తర్వాత క్యాబినెట్‌లో చర్చిస్తాం'' అని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడే



ప్రసక్తే లేదన్న భాజపా సీనియర్ నేత, మాజీ సీఎం యడియూరప్ప వ్యాఖ్యలపై స్పందిస్తూ.. కమిషన్ నివేదిక ఆధారంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చర్యలు ప్రారంభించిన తర్వాత ఆయన (యడియూరప్ప) ఏం చేస్తారో చూద్దామన్నారు. కొవిడ్ సమయంలో అవకతవకలకు సంబంధించి యడియూరప్పతోపాటు మాజీ మంత్రి బి.శ్రీరాములును విచారించాలని కమిషన్ సిఫార్సు చేసినట్లు కర్ణాటక ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు ఇటీవల పేర్కొన్నారు. యడియూరప్పతోపాటు ఇతరులను విచారించే అవకాశం ఉందంటూ హోంమంత్రి పరమేశ్వర కూడా సంకేతాలిచ్చారు. ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే కూడా స్పందిస్తూ.. ఒక్కో పీపీఈ కిట్ స్థానికంగా రూ.334లకు లభ్యమవుతున్నప్పటికీ చైనా, హాంకాంగ్ సంస్థల నుంచి రూ.2100కు కొనుగోలు చేశారని ఆరోపించారు.కొవిడ్ సమయంలో రూ.7,223 కోట్ల ఖర్చుల వివరాలను జస్టిస్ కున్హా కమిషన్ పరిశీలించింది. వీటికి సంబంధించి ఆగస్టు 31న మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక దర్యాప్తుతోపాటు క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ అక్టోబర్ 11న కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



# వధూవరులను ఆశీర్వదించిన టీఎన్జీవోస్ నేత రాజ్ కుమార్

**విశ్వంభర, బషీర్ బాగ్ :** నూతన వధూవరులు లాహ్నవి, రాహుల్ రాజ్ లా వివాహ మహోత్సవానికి టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కే .ఆర్ రాజ్ కుమార్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పి.నరేష్, బాలాజీ గోస్వామి, హనుమంతు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# డబ్ల్యూజెఐ రాష్ట్ర సహ నిర్వహణ కార్యదర్శిగా బెజ్జంకి నరేష్

**విశ్వంభర, హైదరాబాద్:** వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజెఐ) రాష్ట్ర సహ నిర్వహణ కార్యదర్శిగా పెద్దపల్లి జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ బెజ్జంకి నరేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, అనేక యేళ్ళుగా జర్నలిజంలో తనదైన ముద్రవేసుకుంటూ, జాతీయవాద ఆలోచనలతో జర్నలిస్టుల సమస్యలను, సంక్షేమాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడంలో నరేష్ కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. జర్నలిస్టులకు మరిన్ని సేవలు అందించి, డబ్ల్యూజెఐని బలోపేతం చేయడంలో ముఖ్యం భూమిక వహించాలని నరేశును కోరారు. జాతీయవాద ఆలోచన విధానం గల జర్నలిస్టులను ఏకం చేసి, బలమైన సంఘంగా డబ్ల్యూజెఐ ఆవిర్భవించబోతున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ సంఘాలకు చెందిన అనేకమంది జర్నలిస్టులు నాయకులు డబ్ల్యూజెఐ లోకి రాబోతున్నారని శ్రీనివాస్ తెలిపారు. అనంతరం నూతన రాష్ట్ర సహ నిర్వహణ కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్, రావికంటి శ్రీనివాస్, అక్రెడిటేషన్ సమస్యల పరిష్కార కమిటీ రాష్ట్ర



కన్వీనర్ తాడూరి కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.










# లౌకికవాదం, ఏకత్వ భావనలకు ప్రతీకగా నిలిచిన అబుల్ కలాం ఆజాద్

## నేడు ఆయన జయంతి..(జాతీయ విద్యాదినోత్సవం)

ప్రతి సంవత్సరం నవంబర్ 11న దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవం (రాష్ట్రీయ శిక్షా దివస్) జరుపుకుంటున్నాం. దేశానికి స్వాతంత్రం సిద్ధించిన తర్వాత విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవం గా పాటిస్తున్నారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని 2008 నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. విద్యారంగంలో మౌలానా ఆజాద్ చేసిన విశేషమైన సేవలను గౌరవించేందుకు ఈ రోజును జరుపుకుంటారు. స్వతంత్ర భారతదేశంలో తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసి దేశ విద్యా విధానాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. ఈరోజున విద్య, జాతీయాభివృద్ధికి, సంస్థల బలోపేతానికి ఆయన చేసిన సేవలను నేడు స్మరించుకుంటారు. ఈ రోజున విద్యావ్యవస్థ గురించి, చదువు విలువ గురించి అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తద్వారా ప్రజలకు విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించి, తమ పిల్లలను చదువుకునేందుకు ప్రోత్సహించేలా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు చేస్తాయి. ఎక్కువ మంది పిల్లలను స్కూళ్లకు రప్పించే ఏర్పాట్లు చేస్తారు.



**అబుల్ కలాం ఆజాద్ గురించి..**

భారత దేశాన్ని బ్రిటిషు వారి దాస్య శృంఖలాల నుండి విడిపించడానికి ఎందరో మహానుభావులు తమ జీవితాలను త్యాగం చేశారు. బ్రిటిష్ పాలన నుంచి బానిస విముక్తి పొందటానికి ఎందరో ఎన్నోవిధాల కృషి చేశారు. జాతి, మత, కులాలకతీతంగా అందరూ భారత జాతి స్వేచ్ఛకై పోరాడారు. వారిలో హిందువులు, ముస్లిములు మొదలైనవారు ఎందరో ఉన్నారు. గాంధీకన్నా ముందుగానే భారతదేశానికి స్వాతంత్ర్యం రావటానికి సత్యం, అహింసలను ప్రబోధించి భారతీయులలో హిందూ, ముస్లింలు అందరూ భాయీ భాయీ అనే సోదర భావంతో మెలగాలని చెప్పిన మొదటివారు మౌలానా అబుల్ కలాం ఆజాద్. ఈ క్రమంలో జాతిపిత మహాత్మాగాంధీకి ముఖ్య అనుచరుడైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని కీలక పాత్ర పోషించారు. అయితే ఇక్కడ విశేషం ఏమంటే ఆజాద్ జన్మత: భారతీయుడు కానప్పటికీ మహాత్మాగాంధీ స్ఫూర్తితో భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించాలన్న కాంక్ష ఈయనలో బలీయంగా నాటుకోవడం ప్రపంచ నాయకులను సయితం అబ్బురపరచింది. ఆజాద్ 1888 నవంబర్ 11 వ తేదీన అరేబియా దేశంలోని మక్కా నగరంలో ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ దంపతులకు జన్మించారు. ఆజాద్ అసలు పేరు మొహిద్దీన్ అహ్మద్. ఆజాద్ అనునది కలం పేరు. మౌలానా చిన్నతనం నుండే కవిత్వం రాసేవారు. ఆ విధంగా ఆయన పేరులో ఆజాద్ చేరింది. మౌలానా తండ్రి పేరు మహమ్మద్ ఖైరుద్దీన్. కాగా వీరి పూర్వీకులు భారతీయులు. మౌలానా పూర్వీకుల్లో కొంత మంది అరబ్బీ, పారశీక భాషల్లో గొప్ప పండితులు కావడం వల్ల మొగల్ చక్రవర్తి అక్బర్ తన పరిపాలనా కాలంలో వీరిని ఘనంగా సత్కరించారు. మౌలానా తండ్రి 1857 లో జరిగిన సిపాయిల తిరుగుబాటు అనంతరం అరేబియా దేశానికి వలస వెళ్లడం జరిగింది. మౌలానా 10 సంవత్సరాల వయస్సులో తన తండ్రితో కలిసి భారత దేశానికి తిరిగి వచ్చాడు. మౌలానా కోల్‌కటా (కలకత్తా)లో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. కాగా 1905 లో ఈజిప్టు రాజధాని కైరోలోని అజహస్ విశ్వ విద్యాలయానికి వెళ్లి ఉన్నత విద్యను పూర్తి చేసుకొని 1908 లో భారత దేశానికి తిరిగి వచ్చారు.

**మౌలానా గొప్ప పండితుడు..**

మౌలానా మాతృభాష అరబ్బీ అయినప్పటికీ అరబ్బీతో పాటు పారశీక భాషలో కూడా సాటి లేని మేటి పాండిత్యాన్ని సంపాదించి మత, ధర్మ శాస్త్రాల్లో మంచి పట్టు సాధించారు. ఆయన హిందీ, పర్షియన్, బెంగాలీ, అరబిక్, ఇంగ్లీష్, ఉర్దు మొదలగు భాషలలో ప్రావీణ్యుడు.ఇతని పాండిత్యం వల్ల మౌలానా అనే బిరుదును పొందారు. మౌలానా అనగా పండితుడు అని, అబుల్ కలాం అనగా భాషా జనకుడు అని అర్థం. ఈ విధంగా మొహిద్దీన్ అహ్మద్ కాస్తా మౌలానా అబుల్ కలాం ఆజాద్‌గా మారారు. చదువుకొనే రోజుల్లోనే 'నరాంగ్ అలం' అనే సాహితీ పత్రికను నడపటం, ఉర్దూ కవుల ముషాయిరాలు (కవి సమ్మేళనం) నిర్వహించేవారు. మౌలానా తన పదహారవ ఏట లిసానస్ సిదిక్ ( సత్యవాణి ) అనే పత్రికను స్థాపించారు. ఆ పత్రికలో ధార్మిక, సారస్వత విషయాలకు సంబంధించిన సంపాదకీయాలు రాసేవారు. వాటిని చదివిన పాఠకులు ఆ పత్రిక సంపాదకుడు వయో వృద్ధుడైన గొప్ప విద్వాంసుడేమోనని భావించారు. ఈ నేపథ్యంలో ఒక సాహిత్య సభకు మౌలానాను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. సభా నిర్వాహకుల్లో కొంతమంది ముఖ్య అతిథి రాక కోసం ప్రవేశద్వారం వద్ద ఎదురుచూస్తూ ఉన్నారు. ఒక యువకుడు నిరాటంకంగా వేదిక వద్దకు చేరుకొనగా నిర్వాహకులు అతనిని ఆపి అతడే ఆజాద్ అని తెలుసుకొని సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఆ రోజుల్లో ఖాజీ అల్తాఫ్ హుస్సేన్ అలీ గొప్ప విద్వాంసుడుగా పేరు గాంచాడు. అయితే ఆయన రచనలను ఆజాద్ తన పత్రికలో నిశితంగా విమర్శించారు. దీంతో అతడు ఆజాద్‌ను కలిసి మాట్లాడి ఆయన పాండిత్యానికి అలీ మంత్రముగ్ధుడయ్యాడు. కాగా 1912 లో ఆజాద్ అల్ హిలాల్ ( చంద్రరేఖ ) అనే ఉర్దూ వార పత్రికను స్థాపించారు. ఈ పత్రిక ఉర్దూ సాహిత్యంలో ఒక నూతన శకానికి నాంది పలికింది.

**హిందూ, ముస్లింల సఖ్యత కోసం కృషి..**

స్వాతంత్ర్య సమరంలో ముస్లింలు సంపూర్ణ సహకారము అందించాలనే లక్ష్యంతో హిందూ, ముస్లిమ్ ల సఖ్యత కోసం, చైతన్యం కోసం 'అల్ హిలాల్' ఆ నే పత్రికను స్థాపించారు. హిందూ ముస్లింల సమైక్యతను ప్రోత్సహిస్తూ మౌలానా తన పత్రికలో అనేక వ్యాసాలు రాశారు. విప్లవాత్మకమైన రచనలతో చైతన్యపరుస్తుంటే ముస్లిం సంఘాల వాళ్ళకు, ప్రభుత్వంవారికి 'అల్ హిలాల్' పత్రిక విషమ సమస్యగా తయారైనది. ఎలాగైనా అణగదొక్కాలనే దురుద్దేశంతో పత్రిక నడవాలంటే రెండు వేల రూపాయల డిపాజిట్ కట్టమన్నారు ప్రభుత్వం వారు.అందులో బ్రిటిషు వారి అక్రమాలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించడం జరిగింది. దీంతో బ్రిటిషు ప్రభుత్వం అల్ హిలాల్ పత్రికను నిషేధించడమే కాకుండా మౌలానాను నాటి బీహార్ లోని రాంచీలో నిర్బంధించింది. జైలు శిక్ష అనుభవించి వచ్చాక బ్రిటిషు వారి బెదిరింపులకు ఏమాత్రం భయపడని మౌలానా అల్ బలాగ్ ( సందేశం ) అనే మరొక పత్రికను స్థాపించి తన రచనా పరంపరను కొనసాగించారు. బ్రిటిషు ప్రభుత్వం ఆ పత్రికపై కూడా నిషేధాన్ని విధించి పత్రికా స్వాతంత్ర్యాన్ని హరించింది. 'అల్ బలాగ్' పేరుతో పత్రికను నడిపినందుకుగాను 'మౌలానా' ను జైలులో ఉంచింది ప్రభుత్వం. ఆతర్వాత మౌలానా అరెస్టై బెయిల్‌పై విడుదల అయ్యారు.

**గాంధీ మార్గంలో నడిచిన మౌలానా ఆజాద్..**

మౌలానా ఆజాద్.. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కీలకపాత్ర పోషించారు. గాంధీజీ సిద్ధాంతాలను నమ్మిన ఆయన 1920లో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. మౌలానా మహాత్మాగాంధీని మొదటిసారిగా ఢిల్లీలో కలుసుకున్నారు. గాంధీ మార్గంలో నడచి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమ ప్రచారానికై దేశ సంచారం చేసి నాయకుల్లోని భేదాభిప్రాయాలను నిర్మూలించడానికి ఎంతో కృషి చేశారు.ఇరాక్, ఈజిప్టు, సిరియా, టర్కీ, ఫ్రాన్స్, లండన్ తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో గాంధీజీకి ముఖ్య అనుచరుడుగా మారారు. కాగా 1923 లో మౌలానాఢిల్లీలో జరిగిన సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు35 సంవత్సరాల వయసులో 1923 లో కాంగ్రెస్ అధ్యక్ష పదవిని అతి సమర్థవంతంగా పోషించటం మౌలానాకే చెల్లింది.. జమియత్ ఉల్ ఉలేమాకు 1924 లో అలాగే 1929 లో జాతీయ వాద ముస్లిం సదస్సుకు అధ్యక్షత వహించారు. 1930 లో ఉప్పు చట్టాల ఉల్లంఘనంలో ఆజాద్ ను అరెస్ట్ చేసి ప్రభుత్వం ఒక సంవత్సరంపాటు జైలులో ఉంచింది. 1937 లో పార్లమెంటరీ బోర్డ్ సభ్యుడుగా కాంగ్రెస్ మంత్రిత్వ శాఖల పనితీరును నిర్దేశించారు. కాగా 1940 నుండి 1946 వరకు తిరిగి భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడుగా వ్యవహరించారు. 1946 లో రాజ్యాంగ సభకు సభ్యుడుగా ఎన్నికయ్యారు. 1946 లో కాంగ్రెస్ పక్షాన కేబినెట్ మిషన్ తో రాజీ సంప్రదింపులు సాగించాడు. ఇండియా విన్స్ ఫ్రీడం అనే గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథంలో భారత దేశం తప్పక స్వాతంత్ర్యాన్ని సాధించితీరుతుందని మౌలానా గట్టిగా అభిప్రాయపడ్డారు. కాగా సుదీర్ఘ పోరాటాల ఫలితంగా 1947 ఆగష్టు 15 వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. మొట్ట మొదటి భారత ప్రధానిగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం ఏర్పడింది. నెహ్రూ తన మంత్రి మండలిలో ఆజాద్‌కు విద్యాశాఖామంత్రిగా స్థానం కల్పించి గౌరవించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖతో పాటు సహజ వనరులు, శాస్త్ర పరిశోధన శాఖలను కూడా నిర్వహించారు.1951, 1952-55 సంవత్సరాల్లోనూ కాంగ్రెస్ పార్లమెంట్ పార్టీకి ఉప నాయకుడిగా ఎన్నికయ్యాడు.

**ఆధునిక విద్యకు ఆద్యుడు..**

ఆజాద్ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ క్యాబినెట్‌లో మొదటి విద్యా మంత్రి (మానవ వనరుల అభివృద్ధి మంత్రి) అయ్యారు.స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన మొదటి ప్రభుత్వంలో సుదీర్ఘంగా 11 సంవత్సరాలపాటు విద్యాశాఖామంత్రిగా పనిచేసి దేశంలో విద్యా సంస్కరణలకు విశిష్టమైన కృషిచేశారు. దేశంలో సమగ్ర విద్యా విధాన రూపకల్పనకు పునాదులు వేశారు. బ్రిటిష్ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, సంగీతం, సాహిత్యాల వికాసానికి చేయూతనిచ్చారు. ఇక దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత.. 1948లో ప్రాథమిక, ఉన్నత విద్యకు, 1952లో సెకండరీ విద్యకు ప్రత్యేక కమిషన్‌లు ఏర్పాటు చేశారు. విద్య ద్వారా స్వతంత్ర భారతదేశ నిర్మాణానికి కట్టుబడి గ్రామీణ పేదలు మరియు బాలికల విద్యను ప్రోత్సహించారు. 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత మరియు నిర్బంధ విద్య ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. 16 జనవరి 1948న అఖిల భారత విద్యా సదస్సులో ప్రసంగిస్తూ మౌలానా ఆజాద్ ఇలా అన్నారు. దేశంలో విద్యావ్యవస్థను రూపుమాపడంలో ఆజాద్ ప్రముఖ పాత్ర పోషించారు.

ఆయన విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన తొలి ఐదేళ్ల కాలంలోనేయూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఏఐసీటీఈ, ఖరగ్‌పూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్ మరియు సెకండరీ ఎడ్యుకేషన్ కమిషన్‌లు ఏర్పాటయ్యాయి. వీటితోపాటు సంగీత, సాహిత్య, లలితకళల సర్వతోముఖాభివృద్ధికి అకాడమీలను ఏర్పాటు చేశారు. స్వయం ప్రతిపత్తి సంస్థలైన భారతీయ సాంస్కృతిక సంబంధాల మండలి, సంగీత నాటక అకాడమీ, సాహిత్య అకాడమీ, ఆరట్స్ అకాడమీలను ఆయన స్థాపించారు.అంతేకాకుండా దేశంలో ప్రస్తుతం ఉన్న జామియా మిలియా ఇస్లామియా మరియు ఐఐటి ఖరగ్‌పూర్ వంటి విద్యాసంస్థల స్థాపనకు కూడా ఆయన ఎంతో సహకరించారు.మొదటి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ 1947 నుంచి 1958 వరకు తన బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించారు. భారతదేశానికి మొదటి ఉప రాష్ట్రపతిగా కూడా ఆయన సేవలందించారు. 1958 ఫిబ్రవరి 22న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ కన్నుమూశారు. భారత విద్యారంగానికి మౌలానా చేసిన సేవలకు గుర్తుగా 1992లో భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న' ఇచ్చి గౌరవించింది. అంతేకాకుండా భారత విద్యారంగాన్ని పరిపుష్టం చేసి.. విద్యావిధానంలో కొత్త పోకడలు సృష్టించి దేశాభివృద్ధికి దారులు వేసిన ఆ మహానుభావుడి జన్మదినమైన నవంబరు 11ను జాతీయ విద్యా దినోత్సవంగా 2008 నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

గొప్ప వక్త, విద్యావేత్త, రచయిత, దూరదృష్టి గల రాజనీతిజ్ఞుడైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత జాతీయ జీవనంలో లౌకికవాదం, ఏకత్వ భావనలకు ప్రతీకగా నిలచారు. కాగా విద్యా రంగానికి మౌలానా చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించి గౌరవించడం ఎంతో ముదావహం.



- ఏలే మహేష్ నేత
సీనియర్ జర్నలిస్ట్, కరస్పాండెంట్
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర దిన పత్రిక
సెల్ .9705646377

## నవభారత నిర్మాణమునకు పునాది వేసిన గొప్ప మేధావి ఆజాద్

ఆది లాహోర్ లో 'అంజుమన్ హిమా యత్ ఇస్లామ్' అనే సాంస్కృతిక సంఘం వార్షికోత్సవ సభ ఆ రోజుల్లో 'లిసానస్ సిదిక్' (సత్యవాణి) అనే పత్రిక బహుళ ప్రచారంలో ఉంది. అందులోని రచనలు, సారస్వత విషయాలు, సంపాదకీయ వ్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అందువలన 'అంజుమన్' సంఘం వార్షికోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడవలసిందిగా ఆ పత్రికా సంపాదకుడిని కోరారు నిర్వాహకులు. అందరూ పత్రికా సంపాదకుని రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఇంతలో నూనుగు మీసాల నూత్న యువకుడు ఒకరు నిరాటంకంగా వారిని దాటుకొంటూ పోతుంటే ద్వార పాలకులు, నిర్వాహకులు ఆ పిల్లవాడి వివరాలు తెలుసుకొని ఎంతో ఆశ్చర్యపడి వేదిక మీదకు తీసుకువెళ్ళారు. ఆ సభలో అప్పటికే ప్రసిద్ధులైన కవి పండితులు ఎందరో ఆసీనులై ఉన్నారు. వారిలో 'క్వాజా అల్తాఫ్ హసన్ అలీ' అనే ఉర్దూ మహాకవి, నజీర్ అహమ్మద్, కవి సార్వభౌముడు షేక్ మొహమద్ ఇక్బాల్ మొదలైనవారెందరో ఉన్నారు. అంతలో నిర్వాహకులు ఈ యువకుడే 'లిసానస్ సిదిక్' పత్రికా సంపాదకుడు, ఈనాటి ముఖ్య అతిథి అయిన 'మౌలానా అబుల్ కలాం అజాద్' అని పరిచయం చేసి 'ధర్మ మీమాంస' అనే విషయంపై ఉపన్యసిస్తారు అని చెప్పారు. మౌలానా తన అనర్గళ ప్రసంగంతో ఆనాటి పండితులను మంత్ర ముగ్ధులను చేశారు.ఆనాడే ప్రముఖులు, పెద్దలు, పండితులు అందరూ కలిసి భారత ముస్లింలకు ఇతడు ఆశాజ్యోతి' అని మౌలానాకు బ్రహ్మరథం పట్టారు.

**తత్త్వవేత్తల కోవలోకి చెందినవాడని కీర్తి..**

ఆయన మరణించినప్పుడు నేపాల్, సిలోన్, బర్మా, థాయ్ లాండ్, ఇండోనేషియా మొదలగు దేశాలు, ఇంగ్లాండ్, జర్మనీ, స్వీడన్ వంటి రాజ్యాలు, అమెరికా, ఆఫ్రికా ఖండములు 'మౌలానా ఆజాద్'' ప్లేట్, అరిస్టాటిల్ వంటి తత్త్వవేత్తల కోవలోకి చెందినవాడు' అని తమ సందేశాలను మన దేశానికి పంపాయి.

**'ఇండియా విన్స్ ఫ్రీడమ్ అనే పేరుతో ఆత్మకథ..**

మౌలానా అరబ్బీ, పార్శీ, ఉర్దూ, ఆంగ్లం మొదలైన ఎన్నో భాషలు నేర్చుకొన్నారు. మౌలానా మాట్లాడే ఉర్దూకే గాంధీ 'హిందూస్థానీ' అని పేరిడినారు. మౌలానా రాజకీయవేత్త గానే కాక పండితునిగా,రచయిత గా, పత్రికా రంగ నిర్వాహకునిగా ఎన్నో విజయాలు సాధించాడు. ముస్లిమ్ ప్రపంచమున విప్ల వాత్మకమైన చైతన్యం వెలిగించినది అని ప్రశంసలందుకొన్నారు. మౌలానా తత్వశాస్త్రం మీద, సాహిత్యం మీద ఎన్నో గ్రంథాలు రచించాడు. తన ఆత్మకథను ఇంగ్లీష్ లో 'ఇండియా విన్స్ ఫ్రీడమ్ అనే పేరుతో రాశారు.

**ఖురాన్కు కొత్త భాష్యము చెప్పిన తత్వవేత్త..**

ప్రపంచ మతములను క్షుణ్ణంగా మధించి ఖురాను కు కొత్త దృక్పథంతో భాష్యము చెప్పిన గొప్ప తత్త్వవేత్తగా పేరొందిన మౌలానా మతం గురించి, స్వాతంత్ర్యము గురించి భారత స్వాతంత్ర్యం ప్రధానమునకు మత విధానమే అడ్డు తగులుతున్నదట. తాము వ్రేలు పెట్టకున్నచో మతము లేదు, వివాదము లేదు, మనలో మనకు కొట్లాటలు లేవు అంటూ బ్రిటీష్ వారిని విమర్శిస్తూ మానవుని ప్రధాన స్వత్వము స్వాతంత్ర్యము. ఈశ్వరుడు ఇచ్చిన వరమది. ఒరులు యిచ్చెడి వయా ధర్మము బిచ్చము కాదు. దురాక్రమణ, పాపము, దాక్షణ్యము హరింపజాలదు. యావద్భారత దేశము నా మాతృభూమిగా భావించుకొను జన్మ హక్కును నేను జాడవిడువజాలను. దాని ఆర్థిక, సాంఘిక, రాజకీయ భవిష్యత్ ను రూపొందించుకునే స్వతసిద్ధమైన హక్కును వదులుకోజాలను' అంటూ నిశితమైన అభిప్రాయాలను వెలిబుచ్చినాడు మౌలానా.

**నెహ్రూతో కీర్తించబడ్డ ఆజాద్..**

భారతదేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రు 'ఆజాద్ ఒక తేజోవంతమైన మహా వ్యక్తి' అని ' ఆజాద్ వ్యక్తి జీవితంలో కరుణా సముద్రుడనీ, ప్రజాహిత జీవితంలో అకుంఠిత దీక్షాపరుడని శ్లాఘించారు. హిందూ, ముస్లిమ్ సమైక్యతకు జీవితం మీదు కట్టిన నిష్కామయోగి అని కొనియాడారు. స్వా తంత్ర్య సమరమున ముందు పీఠాన నడ చిన గొప్ప వీరుడు అబుల్ కలామ్ ఆజాద్ , నవభారత నిర్మాణమునకు పునాది వేసిన రాజకీయవేత్త అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య భారతానికి మొదటి విద్యా శాఖ మంత్రిగా పని చెయ్యటం మన భారతీయులందరీ గర్వకారణం అదృష్టంగా భావిస్తూ ఆయన పుట్టిన రోజును "జాతీయ విద్యా దినోత్సవం"గా పాటించటం నిజంగా ఆయనకు మనం అర్పించే నిజమైన జో హార్లు. ఈ రోజున దేశవ్యాప్తంగా ఆ మహనీయుని స్మరియించుకొంటూ విద్యారంగంలో నిష్ణాతులైన గురువులను గౌరవించుకొంటూ, తరాలను తీర్చిదిద్దే పనిలో అహరహమూ కష్టించే గురువులందరికీ శ్రీ గురుభ్యోనమః..



-అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు
పశ్చిమ గోదావరి జిల్లా
సెల్: 8247433432

# స్త్రీ "స్వేచ్ఛగా" ఎదగడానికి అన్ని అవకాశాలను కల్పిద్దాం

"స్త్రీకి కూడా శరీరం ఉంది, దానికి వ్యాయామం ఇవ్వాలి ఆమెకి మెదడు వుంది, దానికి జ్ఞానం ఇవ్వాలి, ఆమెకి హృదయం ఉంది దానికి అనుభవం ఇవ్వాలి" అంటాడు స్త్రీవాద రచయిత గుడిపాటి వెంకటాచలం. అనలు నమస్యల్లా స్త్రీని సమాజంలో భాగస్వామిగా, నాగరికత నిర్మాణంలో పాత్రధారురాలిగా గుర్తించకపోవటమే. పురుషాదిక్య భావజాలం స్త్రీని కేవలం "వరాన్నజీవిగా" చూడటం మూలంగానే ఓ వర్గం మరో వర్గంపై శారీరక, మానసిక అజమాయిషీ చెలాయించాలనుకోవటం మూలంగా వచ్చిన సంఘర్షణ ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా మహిళలు హక్కుల కోసం, స్వేచ్ఛ కోసం, లైంగిక హింసకు వ్యతిరేకంగా ఆయాదేశాల్లో ఉద్యమాలు చేశారు. ఇక ముందు చేస్తారు కూడా.పుట్టుకతోనే పురుషులతో పాటే స్త్రీలు కూడా "స్వేచ్ఛాజీవులే" కాని వారి స్వేచ్ఛను పురుష భావజాలం లాక్కొని వారిపై క్రమంగా అజామాయిషి చెలాయించడం మొదలుపెట్టారు. "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అని మనుస్మృతి పేర్కొంటే ఇక స్త్రీకి స్వేఛ్ఛ ఎక్కడుంటుంది? కడుపులో పిండం నిర్ధారణ జరిగితే చాలు గర్భస్థ దశలోనే "జీవితకాలం" ముగుస్తున్నప్పుడు లేదా పుట్టిన తర్వాత ఎదుర్కోబోయే దశలవారి హింసను జీవితాంతం ఎదుర్కోవాల్సిందే. చట్టాలుమారినా సమాజం వేగంగా ఆధునీకతను సంతరించుకుంటున్నా స్త్రీల పట్ల పురుషుల ఆలోచన ధోరణి మారకపోవడం బాధకల్గించే అంశం.

స్త్రీల పట్ల హింస, ఇతిహాసాలలోను, వేద కాలంలోను, జరిగినట్లు మనం చరిత్రలో చదువుకున్నామ్. అంతెందుకు వేదకాలంలో విద్యను అభ్యసించిన స్త్రీలు ఇద్దరే గార్గేయి, మైత్రేయి వారు కూడా అగ్రవర్ణాల వారే కావడం గమనార్హం.మన దేశంలో 19వ శతాబ్ధంలోనే ఈ సనాతమైన ఆచారాలపట్ల రాజారామ్, మోహన్రాయ్ కందుకూరి వీరేశలింగం, గురజాడ, పూలే దవంతులు మొదలైన వారు స్త్రీలపట్ల జరుగుతున్న సాంఘిక దురాచారాలపై తన కలం గళం ఎత్తి, స్త్రీలకు బాసటగా నిలిచారు. మరి ఇన్ని లక్షల సంవత్సరాల నాగరికతా పరిణామ క్రమంలో, మానవుడు సాధించిన పురోగతి, స్త్రీల పట్ల జరుగుతున్న హింసను అరికట్టడానికి ఎన్ని చట్టాలు చేసిన అవి స్త్రీల పట్ల జరుగుతున్నహింసను నివారించలేకపోయాయి.ఏ సంబంధమైన మనం వ్యవస్థపట్ల, వ్యక్తుల పట్ల జాతిపట్ల మనం చూయించే సానుకూల దృక్పథమే ఆ "జాతి" లేదా ఆ "వ్యవస్థ" ఎలాంటి అంతరాయం లేకుండా మనుగడ కొనసాగించగలదు. అంతరాయాలు, అవాంతరాలు కల్పిస్తే అది దాని యొక్క ప్రత్యామ్నాయాలను కూడా వెతుక్కుంటుంది". అని వసంత కన్నాబిరాన్ అన్నట్లు. స్త్రీల పట్ల జరుగుతున్న హింసను నివారించడానికి



ప్రత్యామ్నాయాలు ఏంటనేది కూడా ప్రశ్నే.?
స్త్రీ లేని సమాజాన్ని, స్త్రీకి భాగస్వామ్యం కల్పించని నాగరికతను ఎక్కడైనా చూశామా చదివామా? అన్నది మనం తెలుసుకోవాలి. స్త్రీని దేవతగా (లక్ష్మీ, పార్వతి, సరస్వతి) పూజించిన భారతీయ సమాజం, ఆచరణలో స్త్రీ స్వేచ్ఛకు ఆటంకాలు కల్గిస్తున్నది. లేకపోతే కోల్కత్తలో ఇటీవలే "ఆర్జీకర్" ఆనువత్రిలో మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య దానికి నిదర్శనం కాదా? అదేవిధంగా మణిపూర్ లో మహిళల్ని నగ్నంగా ఊరేగించే విధానం సభ్యసమాజం తలదించుకునేలా చేయలేదా? అలాగే గతంలో జరిగిన "బిల్కిన్బానో" ఉదంతం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో "ఆయేషామీరా" అత్యాచారం, హత్య అనంతరం 'దిశ' అత్యాచారం హత్య, దేశ రాజధానిలో "నిర్భయ" పై జరిగిన అత్యాచారం మొదలైనవి సమాజాన్ని, స్త్రీల మనుగడను ఆలోచింవచేశాయి. వెరసి స్త్రీని పురుషుడు కేవలం "విలాస వస్తువుగానో" కోరికలను తీర్చే వ్యక్తిగానో చూడటం అనంతరం వారి స్వేచ్ఛను, హక్కులను కాలరాయటం ఫలితంగా జరిగే సంఘటనలు కావా అవి? ఇక పాశ్చాత్య సమాజం స్త్రీని కేవలం అందాల ప్రదర్శనకు, జీవిత భాగస్వామిని తృప్తి పరచడానికే అన్నట్లుగా చూసింది. కాలక్రమేణ అక్కడ కొంతమార్పు వచ్చిందని చెప్పాలి అక్కడ స్త్రీకి స్వేఛ్ఛ వున్నట్లుగానే భావించాలి. ఇక స్త్రీలు రాజకీయాలు అనే అంశానికి వస్తే జర్మనీకి అధ్యక్షురాలిగా ఏంజెలా మోర్కెల్, పాకిస్థాన్ ప్రధానిగా బెనజీర్ భుట్టో, భారత్లో ఇందిరా గాంధీ, బంగ్లాదేశ్లో ప్రధానిగా షేక్ హసీన, బేగం ఖలీదాజియా, శ్రీలంకలో సిరిమావో బండారు నాయకే, బ్రిటన్లో లో మార్గరేట్ థాచర్ లాంటి వారు ప్రత్యక్ష రాజకీయాలలోపాల్గొని ప్రజలకు సేవ చేయడం గమనార్హం. కానీ అగ్రరాజ్యంగా పిలువబడే అమెరికా దేశంలో మాత్రం నేటికి మహిళను అధ్యక్షురాలిగా ఎన్నుకోలేకపోతున్నారంటే మహిళల పట్ల అమెరికా సమాజంలో ఇంకా సరియైన దృక్పథం రాలేదనే భావించాలి. ఇక ఆఫ్రికా సమాజం విషయానికి వస్తే స్త్రీని కేవలం కుటుంబ బానినగానే వరిగణించింది నేటికి కూడా. అక్కడ స్త్రీలకు సరైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవు అంటే నమ్మశక్యం కాని విషయం. గతంలో వున్న బాల్యవివాహాలు, సతీ సహగమనం కన్యాశుల్కం, వర విక్రయం, బాల్య వితంతు వివాహాలను, దాటి నేడు స్త్రీలకు స్వేచ్ఛా, స్వాంతంత్ర్యం లభించిన మాట వాస్తవం. కాని స్త్రీలపై జరుగుతున్న వ్యవస్థీకృతమైన నేరాలు మాత్రం ప్రపంచవ్యాప్తంగా జరుగుతూనే వున్నాయ్. వీటికి అడ్డుకట్ట పడేదెన్నడు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న!

చూడటానికి మాత్రం అంతా సమాన అవకాశం. ఆలోచిస్తే అసలు అవకాశమే లేదు. స్త్రీ పురుషుల మధ్య నిజమైన సమానత్వం ఏర్పడాలంటే ప్రతీ దశలోను... స్త్రీలు ఎప్పటికప్పుడు తమస్థితిని గ్రహించుకొంటూ తమకు తక్కువ స్థాయిలో ఉండే వరిస్థితులు అంతమయ్యేలా చూసుకోవాలి. అప్పుడే స్త్రీ స్వేఛ్ఛ పట్ల సరిగ్గా స్పందించిన వారమవుతామ్. స్త్రీలు "స్వేచ్ఛ" అని గొంతు చించుకోవడం, పోరాటాలు చేయటం, పురుషులు తమ ఆధివత్య భావజాలాన్ని తగ్గించుకోవటానికి ఇష్టవడకపోవడం వల్ల తలెత్తిన "మర్షణ" వల్లనే ఇన్ని ఉద్యమాలు జరుగుతున్నాయ్. కాబట్టి ఎవరి వరిధిలో వారు స్వేచ్ఛను అనుభవిస్తూనే వరస్పరం గౌరవించుకుంటే సమాజంలో స్త్రీ, పురుష సంబంధాలు "మర్షణాత్మకంగా" కాకుండా ఆరోగ్యకరంగా వుంటాయనేది నా అభిప్రాయం. అలాంటి వాతావరణం మున్ముందు కల్పించి "స్త్రీ స్వేచ్ఛకు" ఆటంకాలు కల్పించకుండా వారికి నమాజ నవ నిర్మాణంలో భాగస్వామ్యులుగా చేసి ఇంకాస్త పురోగతిని సాధించడానికి వారి సహకారం కూడా తీసుకొని ముందుకు వెళితే ఏ వైపు నుండి ఏ సమస్య రాదు. స్త్రీ స్వేఛ్ఛ, స్త్రీ మనుగడ ఇంతగా ప్రశ్నార్థకం ఐతే భవిష్యత్లో చాలా పరిణామాలు ఎదురొవాల్సి వస్తుంది. సమాజంలో నగభాగమైన స్త్రీలను మరొక సగభాగమైన పురుషులు తమఅజమాయిషిలో వుంచుకోవాలనుకోవటం అవివేకవు ఆలోచన. పురుషులుగా మనం స్త్రీలను గౌరవిస్తే వారి నుండి కూడా అధేవిధమైన గౌరవంపొందినవారమవుతాం. "ప్రేమ వచ్చిన ప్రేమ వచ్చును" అన్న గురజాడ వారి మాటలనుఅచరణలో పెట్టి వారిని మనతో పాటే "స్వేచ్ఛగా" ఎదగడానికి అన్ని అవకాశాలను కల్పిద్దాం.



-డాక్టర్ మహ్మద్ హసన్
సాహిత్య విమర్శకుడు
9908059234.

## ఘనంగా రాపోలు రాములు జన్మదిన వేడుకలు

.హాజరైన తోటకూర వజ్రేష్ యాదవ్ , మల్లిపెద్ది సుధీర్ రెడ్డి

.రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంపు ఏర్పాటు





**విశ్వంభర, బోడుప్పల్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాలనీ సంక్షేమ సంఘాల చైర్మన్ రాపోలు రాములు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి హాజరై పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత యాభై సంవత్సరాల రాజకీయ జీవిత ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదురుకొని పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు. బోడుప్పల్ లో ఏ సమస్య వచ్చిన, ఈ ప్రాంతానికి ఏ కష్టం వచ్చిన తాను ముందున్నానని అన్నారు. తానూ పదవుల కోసం ఆరాట పడే వ్యక్తిని కానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని అన్నారు. అంతేకాకుండా రాపోలు రాములు జన్మదినం సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంపును ప్రారంభించారు. మెడికల్ క్యాంపులో దాదాపు 150 మంది పైగా ఉచిత బిపి షుగర్ సీజనల్గా ఏర్పడే వ్యాధులపై చికిత్స తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాన గళ్ళ యాదగిరి, గౌతమ్ నగర్ కాలనీ అధ్యక్షులు భూపతి సారయ్య ప్రధాన కార్యదర్శి ఈ. ముత్యాలు, గఫర్, గోపాల్, ఉపేందర్ ,వెంకటేష్ ,భాస్కర్, ఆంజనేయులు ,పాల్గొన్నారు. అంతేకాకుండా రక్తదాన శిబిరంలో దాదాపు 50 కి పైగా రక్తదానం చేశారు. భూపతి సారయ్య కుమారుడు భూపతి సూరజ్ , ముత్యాలు కుమారుడు పవన్ కళ్యాణ్ రాపోలు రాములు పై ఉన్న అభిమానంతో ఆయన జన్మదినం సందర్భంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొని శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఎక్కడున్నవాళ్లు అక్కడే వివరాలు నమోదు చేయించుకోవచ్చు

### మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజ్జల మహేష్



**విశ్వంభర, తలకొండపల్లి:** ఎక్కడ నివాసం ఉన్నవాళ్లు అక్కడే సమగ్ర సర్వే లో పాల్గొనవచ్చని తలకొండపల్లి మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జల మహేష్ తెలిపారు. ప్రభుత్వం రెండు రోజులుగా ఇళ్లకు స్టిక్కర్లు అంటించిన అధికారులు శనివారం నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభించారు. వివిధ కారణాల రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు ప్రస్తుతం ఎక్కడ ఉంటే అక్కడే వివారాలు నమోదు చేయించుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసిందని తెలిపారు. ఆధార్లో అడ్రస్తో సంబంధం లేదని పేర్కొన్నారు. అయితే సిబ్బంది వచ్చినప్పుడు ఆధార్, రేషన్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ పాసుపుస్తకం సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమాచారం ఇతరులకు ఇవ్వబడదని ఎవరు భయపడవద్దని కేవలం సమన్యాయం కోసమే సర్వే నిర్వహిస్తున్నారని ఎటువంటి అపోహలకు తావు లేదని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందుబాటులో ఉందని, సేవలను కొనసాగిస్తుందని, భరోసా ఇస్తుందని మహేష్ తెలిపారు.

## శంఖారావం పుస్తక ఆవిష్కరణ

### మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్



విశ్వంభరం, మహబూబాబాద్: మహబూబాద్ జిల్లా పట్టణ కేంద్రంలో ఎస్ఎస్సీఎల్ ఫంక్షన్ హాల్ కంకర బోర్డ్ లో సంకేపల్లి శ్రీనివాస్ రెడ్డి రచించిన "శంఖారావం" పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ భూక్య మురళి నాయక్ పాల్గొన్నారు. శంఖారావం పుస్తకాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ సంకెపల్లి శ్రీనివాస్ రచనలు సమాజానికి ఎంతో మేలు కలిగేలా ఉన్నాయన్నారు. గతంలో సమాజం ఎలా ఉండేది ప్రస్తుతం ఎలా ఉన్నారు, ఇప్పుడు ఉన్నటువంటి కాలంలో ఉన్న పరిస్థితులను చాలా చక్కగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో తన రచన ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. రచయితలు ఇలాంటి కవితలు మరెన్నో రాసి సమాజంలో మార్పులు తీసుకురావాలన్నారు. ఈ రచనలు అందరూ చదివి సమాజంలో మార్పు కోసం తోడ్పడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామదేవతల మందిర నిర్మాణానికి విరాళం అందజేత



**విశ్వంభర, మర్పల్లి:** మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామ దేవతల మందిర నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలోని గ్రామ దేవతల మందిర నిర్మాణానికి జోగిని పాండూ, జోగిని గోపాల్ రూ. 11 వేల నగదు విరాళం అందజేసినట్లు తెలిపారు. గ్రామంలోని వ్యాపారస్తులు, ప్రజల సహకారంతో హనుమాన్ మందిరం నిర్మించామని, దుర్గామాత, దుర్గారెడ్డి ఆలయాలతో పాటు గ్రామదేవతల ఆలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిరిపురం శ్రీశైలం, ఉపాధ్యక్షులు దేవరదేశి అశోక్ , కోశాధికారి మంగలి బాబురావు, కార్యదర్శి చాట్ల రాకేష్, కార్యవర్గ సభ్యులు గొల్లముసలి అశోక్, సలహాదారులు దేవరదేశి లక్ష్మీనారాయణ, సలహాదారులు, పెద్దోళ్ల పాపయ్య, ఆగమయ్య, డి. ప్రభాకర్, జి. మల్లేశం, గడ్డపు రాజు, వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

## వర్కింగ్ ప్రెసిడెంట్గా అభిలాష్ నియామకం



**విశ్వంభర, హనుమకొండ:** ఎన్.హెచ్.ఆర్సీ అండ్ డబ్యూ.ఈ.ఓ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా అడ్డూరి అభిలాషను నియమించినట్లు సంస్థ చైర్మన్ మహ్మద్ మొయినుద్దీన్ తెలిపారు. ఆదివారం హనుమకొండ లోని ఓ ఫంక్షన్ హాల్ సంస్థ ఐడీ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మహ్మద్ మొయినుద్దీన్ సంస్థ సభ్యుల నుద్దేశించి మాట్లాడారు. సంస్థ అభివృద్ధికి పాటుపడాలని అదేవిధంగా మహిళల పట్ల చిన్న పిల్లల పట్ల జరుగుతున్నటువంటి అత్యాచారాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కాసగాని వేణుగౌడ్, కోశాధికారి, రాష్ట్ర అధ్యక్షుడు సంపేట సుధాకర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గనిపాక కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు విన్నకోట గోవర్ధన్, హసన్పర్తి మండల అధ్యక్షుడు నద్దునూరి బాబు, శ్యామ్, కోటి, ఆనంద్ కుమార్, నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు యాదగిరి, యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాలకు బోనస్ జమ



**హనుమకొండ:** సన్న రకం ధాన్యం కొనుగోలు అనంతరం ఆన్లైన్ అయిన వెంటనే రైతుల ఖాతాకు ధాన్యం డబ్బులతో పాటు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ డబ్బులు కూడా జమ అవుతాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం రాంనగర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ ధాన్యం కేంద్రం వద్ద తూకానికి వచ్చిన ధాన్యపు రాశులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఏ రకం ధాన్యం వస్తుందని, కొనుగోలు చేస్తున్న ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీ ఎలా చేస్తున్నారని, ఇప్పటివరకు ఎన్ని నమోదు చేశారని, గన్ని సంచులు సరిపోను ఉన్నాయా అని, ఎంతమంది రైతులు ధాన్యం అమ్మినారు, ఏ మిల్లుకు ధాన్యాన్ని తరలిస్తున్నారనే వివరాలను అధికారులను, నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు ధాన్యం తీసుకువచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ రైతులు తీసుకువచ్చిన ధాన్యంలో తేమ శాతం పూర్తయిన వెంటనే కాంటాలను పెట్టాలని అన్నారు. సన్న రకం ధాన్యానికి బోనస్ డబ్బుల విషయంలో రైతులు ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దన్నారు. సన్నరకం ధాన్యానికి డబ్బులతో పాటు బోనస్ డబ్బులు కూడా జమవుతాయని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ధాన్యం కొనుగోలుకు త్వరగా కాంటాలు పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి నీరజ, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీనారాయణ పుట్టినరోజు వేడుకలు



**విశ్వంభర, కడ్తాల్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి తమిళనాడు గవర్నర్ కీర్తిశేషులు కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ ఛైర్మన్ అమరావతి లక్ష్మి నారాయణ చేసిన సేవలు అభినందనీయమని డీసీసీబీ డైరెక్టర్ ఆమనగల్లు, కడ్తాల్ సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా కొనియాడారు. ఆదివారం హైదరాబాదులోని కర్మన్ ఘాట్ లో లక్ష్మీనారాయణ 62వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కేక్ కట్ చేసి శాలువా పూలమాలలతో లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు గణేష్ గుప్తా, అర్థం లక్ష్మయ్య గుప్తా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఊరే లక్ష్మణ్ గుప్తా, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గందె సురేష్ గుప్తా, ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్ గుప్తా, పద్మ నారాయణ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## మండల సాధనే చిరకాల ఆకాంక్ష



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి చుట్టుపక్కల ఉన్న గ్రామపంచాయతీలకు కేంద్ర బిందువు ఉంటున్నది. కల్వకుర్తి నియోజకవర్గం లో తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలంటూ 150వ రోజు రిలే నిరాహార దీక్ష కొనసాగుతున్నది. చుట్టుపక్కల గ్రామ పంచాయతీలకు గట్టు ఇప్పలపల్లి అన్ని విధాలుగా కేంద్ర బిందువుగా ఉన్నది కాబట్టి, అన్ని గ్రామ పంచాయతీలకు అనుకూలంగా రైతులకు కావలసిన అన్ని వసతులు ఉన్నందున గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలంటూ జేఏసీ చైర్మన్ మోకురాల అశోక్ గౌడ్ అన్నారు. ఈ దీక్షలో రామాంజనేయులు, రాములు, నరసింహ, పెద్ద నరసింహబుగ్ర, జంగయ్య, నరసింహులు, బాల్య నాయక్, బొబ్బిలి రామచంద్రయ్య, దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శరత్చంద్ర, ఆంజనేయులు, మండల అంజు, ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతక్క పార్థివ దేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే




**విశ్వంభర, మెట్పల్లి:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతక్క పార్థివ దేహానికి జగిత్యాల జిల్లా బి.ఆర్.ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారితోపాటు మెట్ పల్లి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు డాక్టర్ రణవేణి సత్యనారాయణ బీఆర్ఎస్ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు అల్పాహారం



**విశ్వంభర, హైద్రాబాద్ :** మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో శాంతినికేతన్ మానసిక వికలాంగులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. సామాజిక కార్యకర్త చేపూరి శంకర్ మాట్లాడుతూ మన భారతదేశంలో ఎంతోమంది అనాధలు, వృద్ధులు, మానసిక వికలాంగులు పేద విద్యార్థుల ను స్వచ్ఛందంగా సామాజిక బాధ్యత తీసుకొని ప్రతి ఒక్కరు వారిని ఆదుకోవాలని ఉద్దేశంతో చారిటబుల్ నడిపిస్తున్నామని అన్నారు. ఈ అల్పాహారానికి సహకరించిన జగడం రామకృష్ణ సుజాత లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్, శాంతినికేతన్ నిర్వాహకులు బాలేశ్వర్, సిద్ధార్థ కుమార్, సంధ్య, చంద్రశేఖర్, సందీప్, సూర్య, నారాయణ, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



విశ్వంభ, మహబూబాబాద్: స్పెషల్ సమ్మరీ రివిజన్ -25, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమంలో భాగంగా, చేపట్టిన సర్వేలను మహబూబాబాద్ పట్టణం కంకర బోర్డ్ లో ఎస్ ఎస్ ఆర్, సమగ్ర కుటుంబ సర్వే లను జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

## శ్రీకాంత్ రెడ్డిని పరామర్శించిన నీలం మధు ముదిరాజ్



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం జిన్నారం మండలం బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ దాసరి శ్రీకాంత్ రెడ్డి భుజం శస్త్ర చికిత్స చేసుకుని సోలక్పల్లి లో తన స్వగృహంలో ఉండగా మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అతని ఇంటికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను అన్ని విధాలా అండగా ఉంటామని తెలియజేశారు. శస్త్ర చికిత్స చేసుకుని వచ్చిన శ్రీకాంత్ రెడ్డి తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ, మాజీ వైస్ ఎంపిపీ గంగు రమేష్, రాజు గౌడ్, సత్తన్న, శ్రీరామ్, శివరాజ్, మల్లేష్, శ్రీను, శ్రీనివాస్, మహేష్, సత్యా నారాయణ, వెంకటేశ్, మల్లేష్, రఘు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన రామన్నపేట విద్యార్థి




**విశ్వంభర, రామన్నపేట:** స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి చెస్ పోటీలకు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన ఆకుల వీరేష్ కుమారుడు ఆకుల ఆదిత్య అండర్ 17లో ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికయ్యాడు. ఈనెల 9న మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదిత్య మంచి ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు. మధ్యప్రదేశ్ నర్మదాపురంలో ఈనెల 17 నుంచి 21 వరకు జరగనున్న జాతీయ స్థాయి చెస్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఆదిత్య గతంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు బహుమతులు అందుకున్నాడు. ప్రస్తుతం బొమ్మలరామారం మండల కేంద్రంలోని టీఎస్ మోడల్ స్కూల్ లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదిత్య జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం పట్ల మునిపంపుల గ్రామస్తులు, బొమ్మలరామారం టీఎస్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా అమరవాది జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్ రావు



**విశ్వంభర, హైద్రాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, మాజీ తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి మండలి చైర్మన్ అమరవాది లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు హైదరాబాదులోని చంపాపేట్ లో ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్ రావు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు పెండ్యాల విజయభాస్కర్ పాల్గొన్నారు.

## మాల మహానాడు నూతన కమిటీ ఎన్నిక



**విశ్వాంభర, నాగారం:** తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశానుసారంగా తిరుమలగిరి మున్సిపాలిటీ అధ్యక్షులు గంట లక్ష్మణ్, ఉపాధ్యక్షులు గంట సందీప్, మాల మహానాడు నాయకులు మద్దెల ప్రభుదాస్, గంట యాకూబ్, వేరుపుల వెంకన్న, చింటూ ఆధ్వర్యంలో నాగారం మండలంలోని వర్తమానుకోట గ్రామంలో నూతన మాల మహానాడు కమిటీ ఎన్నిక జరిగిందని వారు తెలిపారు. గౌరవ సలహాదారునిగా ఎడ్ల బాబు, గ్రామ మాల మహానాడు అధ్యక్షునిగా జాజుల సామేలు, ఉపాధ్యక్షులుగా సంగి శెట్టి మదర్, ప్రధాన కార్యదర్శి గండమల్ల శాతయ్య, కార్యదర్శి ఉయ్యాల యాకోబు, కోశాధికారి ఉయ్యాల కరుణాకర్, కార్యవర్గ సభ్యులుగా మేడే రాజు, ఇయ్యాల బిక్షం, రాములు, కట్ట వెంకన్న, ఎడ్ల శీను లు ఎన్నుకోబడినట్టు తెలిపారు.

## హరీష్ కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర,నాగారం:** నాగారం మండలం పసునూరు గ్రామానికి చెందిన చిత్తలూరి హరీష్ కానిస్టేబుల్ గా అబ్దుల్లాపూర్మెట్ పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. హరీష్ కొద్దిరోజుల క్రితం గుండెపోటుతో మరణించారు. ఆదివారం సూర్యాపేటలోని పోలీస్ జిల్లా కార్యాలయంలో 2012 బ్యాచ్ కి చెందిన కానిస్టేబుల్ బృందం తమ వంతు సహాయంగా హరీష్ భార్య ప్రియాంకకు 2,55,500 నగదును అందజేశారు. హరీష్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో 2012 కానిస్టేబుల్ బృందం, పాల్గొన్నారు.

విశ్వంభర V3 NEWS

# సమగ్ర సర్వేతో ప్రగతి ప్రణాళికల రూపకల్పన



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రగతి ప్రణాళికల రూపకల్పనకు జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సమగ్ర సర్వే ఉపయోగపడుతుందని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆదివారం రేగొండ మండలం, తిరుమలగిరి గ్రామంలో కూర్మాచలం వెంకటేశ్వర్లు కుటుంబ సమాచార సేకరణ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుమలగిరి గ్రామంలో మొత్తం 1,185 గృహాలున్నాయని, 7 ఎన్యూమరేషన్ బ్లాకులుగా విభజించి 7 మంది సర్వే సిబ్బందిని, 7 మంది సూపర్ వైజర్లు ను నియమించినట్లు తెలిపారు. సర్వేలో ఎన్యూమరేటర్లు సేకరించిన డేటాను ఎంట్రీ చేసేందుకు 65 మంది డేటా ఎంట్రీ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. సర్వే మెటీరియల్ పటిష్ఠ భద్రతకై ట్రంక్ పెట్టెల్లో భద్రపరచాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ నమోదు చాలా సీక్రెట్ గా జరగాలని, నమోదు చేసే సమయంలో ఇతరులను అనుమతించొద్దని పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. సర్వే టైం బాండ్ ప్రోగ్రామని వేగం పెంచాలని స్పష్టం చేశారు. ఎలాంటి పొరపాటుకు తావులేకుండా కుటుంబం యొక్క సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే సమగ్రాభివృద్ధికి తొలి మెట్టు అని, దీని ద్వారా ఆరులైన ప్రజలకు ఏది అవసరమో, ఎలా అమలు చేయాలనే అంశాలపై ప్రణాళికలు రూపకల్పన జరుగుతుందని అన్నారు. ప్రణాళికలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని ప్రజలు సర్వే సిబ్బందికి కుటుంబ సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో కుటుం బాల వారీగా ప్రజల ఆర్థిక స్థితిగతులు తదితర అంశాలన్నింటినీ సమగ్రంగా సేకరించే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎంతో ఆలోచన చేసి ప్రతిష్ఠాత్మకంగా సర్వే చేపట్టినట్లు తెలిపారు. జిల్లా తద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఈ సర్వే ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని 242 గ్రామపంచాయతీలు, ఒక మున్సిపాలిటీలో ముమ్మరంగా సర్వే జరుగుతున్నట్లు తెలిపారు. కుటుంబాల వారీగా ఇళ్లను గుర్తించి స్టిక్కర్ వేశారని, 8వ తేదీ రానున్న 15 రోజుల పాటు జరగనున్న సర్వేలో ప్రజల వివరాలు సేకరిస్తామని అన్నారు. సర్వే నిర్వహణ తీరును సూపర్ వైజర్లు, మండల నోడల్ అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, జిల్లా నోడల్ అధికారి పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు పది ఇళ్లను సర్వే చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. సర్వే కొరకు 150 కుటుంబాలను ఒక ఎన్యుమరేషన్ బ్లాకుగా కేటాయించామని తెలిపారు. సర్వేకు ముందు రోజు ఆయా గ్రామాలు, వార్డులలో ప్రజలకు సమాచారం చేరవేస్తున్నామని అన్నారు. ఎన్యుమరేటరుకు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా సర్వే కిట్లు అందించామని బుక్ లెట్ లో ఇచ్చిన కోడ్స్ నమోదులో ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా పకడ్బందీగా వ్రాయాలని సూచించారు. రోజువారీగా జరిగిన సర్వే వివరాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్లైన్ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రతి మండలానికి అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామని తెలిపారు. ప్రజలు ఇచ్చిన వివరాలను ఇతరులెవరికీ ఇవ్వమని, ఆధారాలు చూపించాలని, ఎన్యుమరేటర్లు ప్రజలు పట్ల భాద్యతగా వ్యవహరిస్తారని ప్రజలు స్వచ్ఛందంగా తమ సమాచారమందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీనివాసరావు, తహసిల్దారు శ్వేత, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, సూపర్ వైజర్ రజాక్, ఎన్యూమరేటర్ శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ పర్యటన ముగించి వచ్చిన కసిరెడ్డికి ఘన స్వాగతం



**విశ్వంభర, వెల్దండ:** లండన్ పర్యటన ముగించిన కల్వకుర్తి ఎమ్మెల్యేకు శంషాబాద్ విమానాశ్రయంలో వెల్దండ కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం పక్షాన టూరిజం అండ్ డెవలప్మెంట్ సమావేశంలో లండన్ పర్యటనకు వెళ్లి పాల్గొని తిరిగి వచ్చిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి వెల్దండ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సింగిల్ విండో వైస్ ఛైర్మన్ సంజీవ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి పూలమాలలు శాలువాలతో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి రెడ్డి, రషీద్, మారేపల్లి శ్రీను, రాజశేఖర్, నిజాం, భరత్ గౌడ్, అప్రోజూ తదితరులు ఉన్నారు.

## మృతుల కుటుంబానికి అండగా వెంకటయ్య గౌడ్



**విశ్వంభర, వెల్దండ:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన కాలే వెంకటయ్య ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ మృతుని కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యల పుల్లయ్య, ఎండి రషీద్, గుద్దటి కిష్టాలు, మారేపల్లి శ్రీను, కొండిగాడి శ్రీను, గంగపు సాయిబాబు, పుట్ట యాదయ్య, అన్యపు రామస్వామి, దాసరి మహేష్, గంగపోగు ఆంజనేయులు, అశోక్, పుట్ట శివ, ఎండి సమీర్, భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రవీణ్ గౌడ్ దంపతులను ఆశీర్వదించిన జర్నలిస్టులు



**విశ్వంభర, వరంగల్:** వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వ్యక్తిగత సహాయకులు ప్రవీణ్ గౌడ్ హసన్పర్తి మండలంలోని అనంతసాగర్ ఫంక్షన్ హాల్ లో వివాహానికి వీజీ24 న్యూస్ ఛానల్ చైర్మన్ కాసగాని వేణు గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా వీ3 స్టాఫ్ రిపోర్టర్ గణిపాక కుమార్, మన తెలంగాణ హనుమకొండ జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నద్దునూరి బాబు, ఫ్రేమ్ వన్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాప్ రిపోర్టర్, ఎండి ఖాదర్ పాషా, ఆదివారం హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# సీపీఎం మండల కార్యవర్గ సభ్యులుగా హనుమంతు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సీపీఎం 8వ మండల మహాసభ జరిగింది. రామన్నపేట మండల కేంద్రంలో జరిగిన మహాసభల్లో సీపీఎం మండల కార్యవర్గ సభ్యులుగా కందుల హనుమంతును ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల ఆశయాల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని ఆయన అన్నారు. ధర్మారెడ్డిపల్లి కాలువకు ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేసి కొమ్మాయిగూడెం పెద్దచెరువు, రామన్నపేట వెంకట్రామయ్య చెరువుకు ఫీడరు ఛానల్ ఏర్పాటుచేసి, చెరువులు, కుంటలను నింపాలని, రైతులను మత్స్యకార కార్మికులకు జీవనాధారమైన చెరువులను నింపకుండా కింది మండలాలకు నీళ్లను తరలించడం సరికాదని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఫీడర్ ఛానల్ ని ఏర్పాటు చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందించాలని కోరారు. అదే విధంగా అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని తలపెట్టిన వైఖరిని వెనక్కి తీసుకోవాలని గత నెల 23న జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణ పదివేల మందికి పైగా వ్యతిరేకించిన తీరును దృష్టిలో పెట్టుకొని కాలుష్య నియంత్రణ మండలి, ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని, ప్రభుత్వపరంగా అంబుజా సిమెంటు ఫ్యాక్టరీ వద్దంటూ పత్రికా ప్రకటన వచ్చేంత వరకు ఉద్యమిస్తామని వారు కోరారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా నాయకత్వానికి మండల నాయకత్వానికి కందుల హనుమంతు కృతజ్ఞతలు తెలిపారు.

## ఓరుగల్లు హోమియోపతి డాక్టర్లచే ఉచిత వైద్య శిబిరం



**విశ్వంభర, వరంగల్:** ఓరుగల్లు హోమియోపతి అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. నేడు ఉచిత వైద్య శిబిరంలో హోమియోపతిక్ డాక్టర్లు లక్ష్మీనారాయణ, పవన్, శ్రీధర్, గీతా, రేవతి, సాయికృష్ణ పేషెంట్లను పరీక్షించి హోమియో వైద్యాన్ని అందించారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి పక్షాన ప్రధాన బాధ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస స్వామి, సూర్య, చిదర అంజనీ దేవి, బోయినపల్లి పార్వతి, పడిదల అనిత, లక్ష్మీరావు తదితరులు పాల్గొన్నారు. ఇలాగే ప్రతి నెల రెండవ, నాలుగవ ఆదివారాలు ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించబడుతుందని ఓరుగల్లు హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ డాక్టర్లు, సేవా సమితి అధ్యక్షులు కటంగూరు సత్యనారాయణ రెడ్డి తెలియజేశారు.

## 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

- తహసిల్దార్ వేణు గోపాల్



విశ్వంభర, ఎల్బీనగర్: 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని తహసిల్దార్ వేణు గోపాల్ అన్నారు. సరూర్ నగర్ మండల పరిధిలో ఆర్కే పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ మండల పరిషత్ పాఠశాలలో చిత్రా లే అవుట్ పోలింగ్ స్టేషన్ 101, 102, 103, 105, 106 ఓటర్ నమోదు కేంద్రాలను ఆయన ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఫారం 6, 7 ,8 ఏ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సహదేవరెడ్డి, పోలింగ్ బూత్ సూపర్వైజర్ శ్యాంసుందర్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారంలోకి వస్తామని కేసీఆర్ పగటి కలలు కంటుండు



**విశ్వంభర, కడ్తాల్:** అవినీతి, కుంభకోణాలతో ప్రజల తిరస్కరణ కు గురై అధికారం కోల్పోయిన మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమిత మై పగటి కలలు కంటున్నారని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ్మ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కడ్తాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యనాయక్ లు అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ కు మళ్ళీ అధికారం కల్ల అని వారు పేర్కొన్నారు. కడ్తాల్ మండలం మక్త మాదారం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, బిచ్చ నాయక్ లు మాట్లాడుతూ నాలుగు నెలలుగా ఫామ్ హౌస్ లో ఉన్న కేసీఅర్ కు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకుంటున్న సహసోపేత నిర్ణయాలు ఎలా కనబడతాయని అన్నారు. రాష్ట్రంలో మళ్ళీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో మరో 10 ఏళ్లకాలం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, బీచ్యా నాయక్ నాయకులు ఉద్ఘాటించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వ్యవస్థలు విధ్వంసం అయ్యాయని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో దారి తప్పిన ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం గాడిలో పెడు తుంది అన్నారు. రాష్ట్రంలో ప్రజా రంజక పాలన చూసి జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు ప్రతిదీ రాజకీయం చేస్తూ ప్రగతి నిరోధకులుగా మారారని వారు మండిపడ్డారు. ప్రజలు తిరస్కరించిన బీఆర్ఎస్ నేతల్లో ఇంకా మార్పు రాలేదని వారు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ కోషన్స్ సభ్యులు జాంగిర్ బాబా, నాయకుడు కృష్ణ, వెంకన్న, బాలరాజు తదితరు ఉన్నారు.

## ఆర్కే పురంలో రక్తదాన శిబిరం



విశ్వంభర, ఎల్బీనగర్: శైవ క్షేత్ర పీఠాధిపతులు భారత ధర్మ దేవత బిరుదాంకితులు శివ స్వామీజీ వారి జయంతోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీ శైవ క్షేత్రం కార్యనిర్వాహక అధ్యక్షులు ఎల్ వి కుమార్, నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ అయిత హైమ, మేనేజర్ కోటేశ్వరరావు ల నేతృత్వంలో వాసవి ఇంటర్నేషనల్ పరివార్ తెలంగాణ, శ్రీ శైవ క్షేత్ర వనితాశక్తి ఇంటర్నేషనల్ తెలంగాణ, దేవి దేవతల చిత్రపటాల పరిరక్షణ సమితి, ధర్మో రక్షతి రక్షితః ట్రస్ట్ తెలంగాణ, హిందూ ధర్మ దీక్ష సేవక్ తెలంగాణ సంస్థల ఆధ్వర్యంలో ఆర్కే పురంలోని శ్రీ శైవ క్షేత్ర పీఠములో జ్యోతి ప్రజ్వలన, గణపతి పూజ, బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి ఇంటర్నేషనల్ పరివార్ రాష్ట్ర అధ్యక్షులు జగిని శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ శివస్వామి జయంతోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రక్తదానం చేసారని తెలిపారు. ఆదివారం 216 ఆలయాల్లో అమ్మవార్లకు వడి బియ్యం సమర్పణ కార్యక్రమం, సోమవారం శైవ క్షేత్రంలో ఉచిత హెల్త్ క్యాంపు, ఉచిత కంటి, దంత పరీక్షలు, పేదలకు దుప్పట్లు, మహిళలకు చీరలు, పంచభూత శివలింగాలకు అభిషేకం, ఆయుష్ హోమం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చిలుక ఉపేందర్ రెడ్డి, శ్యాంసుందర్ గౌడ్, మంచుకొండ శ్రీను, ప్రసాద్, నాంపల్లి శ్రీనివాస్, మాదూరి వాసు గుప్తా, గోపాల్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ప్రియాంక ఆకస్మిక తనిఖీ



విశ్వంభర, ఎల్బీనగర్ ఎల్బీనగర్ నియోజకవర్గం లో కుటుంబ సర్వే ను ఎల్బీనగర్ జోనల్ నోడల్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి (ఐఏఎస్) ప్రియాంక ఆకస్మికంగా ఆదివారం తనిఖీ చేపట్టారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే ను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఎల్బీనగర్ జోన్ లోని హయత్ నగర్ శారద నగర్ కాలనీ, వనస్థలిపురం, అభ్యుదయ నగర్, భగత్ సింగ్ నగర్ పరిధిలో సర్వే ప్రక్రియను జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో కలిసి ఆమె పరిశీలించారు. కుటుంబ సర్వేలో ఎనిమినేటర్లు వివరాలు జాగ్రత్తగా మార్గదర్శక పుస్తకాలలో సూచించిన ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్, ఎల్బీనగర్ సరూర్నగర్ డీసీల తిప్పర్తి యాదయ్య, సేవా, ఇస్లావత్ సుజాత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను కలిసిన సంగాల విక్టరీ బాబు



**విశ్వంభర, హసన్‌పర్తి:** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం భీమారం గ్రామానికి చెందిన వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంగాల విక్టరీ బాబు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత, గజ్వేల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ను సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని వారి ఫామ్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంగాల విక్టరీ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం వర్ధన్నపేట ఇన్చార్జి పదవిలో ఎవరూ లేనందున ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన వర్ధన్నపేట ఇన్చార్జి పదవిని తనకు కేటాయించాలని కేసీఆర్‌కి వినతి పత్రం అందజేశారు. తను ఉద్యమం నుండి క్రియాశీలకంగా రాజకీయాలలో ఉన్నానని తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పని చేసిన వాడిగా గుర్తింపు ఉందని తెలిపాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులు ప్రతి ఒక్క ప్రజలకు చెరవేరేందుకు తన వంతుగా కృషి చేశానని తెలిపారు. సాధారణ, ఉప ఎన్నికల్లో లో ఇన్చార్జి గా వ్యవహరించిన ప్రతీ చోటా విజయానికి తోడ్పడుతూ, తన మార్క్ చూపించినట్టుగా తెలిపారు. ఈ విషయాలు విన్న కేసీఆర్ సానుకూలంగా స్పందించి తొందర్లో నిర్ణస్తామని తెలిపారు.

## సమగ్ర సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటీలో అన్ని బ్లాకుల్లోని ఎన్యుమరేటర్స్ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మున్సిపాలిటీ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు. ఎన్యుమరేటర్స్ సమగ్రంగా ఫారం లోని జాబితా పరిశీలించి తప్పులు లేకుండా నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి నియోజకవర్గం మొగుళ్లపల్లి మండలంలోని ఆకినపల్లి, పర్లపల్లి, పెద్దకోమటిపల్లి, పోతుగల్, వేములపల్లి గ్రామాలల్లో పీఏసీఎస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాలల్లో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో విక్రయించాలని రైతులకు సూచించారు.

## కసిరెడ్డికి స్వాగతం పలికిన కేఎన్ఆర్ యువసేన




**విశ్వంభర, ఆమనగల్లు:** కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లండన్ విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకొని ఆదివారం హైదరాబాద్ కు చేరుకోగా శంషాబాద్ ఎయిర్ పార్ట్ లో కె.ఎన్.ఆర్ యూవసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్ ఘన స్వాగతం పలికారు. ఈ నెల 4న ఆయన విదేశీ పర్యటన ప్రారంభమైంది. 6 రోజుల పాటు లండన్ లో పర్యటించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ నాయకులు ఎయిర్ పోర్ట్ కి వెళ్ళి ఎమ్మెల్యే స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జగన్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతక్క అంతిమయాత్ర



**విశ్వంభర, మెట్‌పల్లి:** మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతక్క అంతిమయాత్ర కొమిరెడ్డి రాములు ఇంటి వద్ద నుండి కొత్త బస్టాండ్, పోలీస్ స్టేషన్, అయ్యప్ప స్వామి దేవాలయం మీదుగా కొమిరెడ్డి రాములు స్వగ్రామమైన వెంకట్రావుపేట గ్రామంలోని స్మశాన వాటిక వరకు అంతిమయాత్ర కొనసాగింది. వెంకట్రావుపేట స్మశాన వాటికలో కొమిరెడ్డి జ్యోతక్కకు పలువురు కాంగ్రెస్ నాయకులు, కొమిరెడ్డి అభిమానులు, అధికారులు వెంకట్రావుపేట్ గ్రామ ప్రజలు ఘన నివాళి అర్పించి, తుది వీడ్కోలు పలికారు.

## కొనుగోలు కేంద్రాలను సందర్శించిన డీ ఆర్ డీ ఓ



**విశ్వంభర, మేడిపల్లి:** మేడిపల్లి మండలంలోని సేర్ఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేడిపల్లి వల్లంపల్లి దమ్మన్నపేట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీ ఆర్ డీ ఓ రఘువరన్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా డీ ఆర్ డీ ఓ రఘువరన్ మాట్లాడుతూ ప్యాడ్ క్లీనర్ ద్వారా శుద్ధి చేసిన నాణ్యమైన దాన్యాన్ని మాత్రమే తూకం వేసి మిల్లుకు పంపించాలని తెలిపారు. రికార్డులను పూర్తిస్థాయిలో సక్రమంగా రాయాలని తెలిపారు. రైతుల వివరాలను ఆన్లైన్లో వెను వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా వారి వెంట మేడిపల్లి మండల ఏపీఎం, సీసీ లు, వివోఏ లు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు ఉన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ గ్రామానికి చెందిన సల్ల గంగరాజు కుమారుడు సల్ల నవీన్ వివాహం రామన్నపేట పట్టణ కేంద్రంలోని గరిక వేదశ్రీ ఫంక్షన్ హాలులో జరగగా, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, నాయకులు కన్నెబోయిన బలరాం, సాల్వేర్ అశోక్, ఎండి అమీర్, జడ సంతోష్, నాంపల్లి లింగయ్య, లవణం రాము, ఎండి. అజాజ్, కళ్లెం స్వామి, బొడ్డుపల్లి రాజు, శివరాత్రి కుమార్, ఎండి మోసబ్, వినయ్, సాయి, మత్స్యగిరి, అజయ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు కు అంతరాయం

**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీ అంకుషాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం చెట్ల కొమ్మల ట్రిమ్మింగ్ కారణంగా ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు, అంకుషాపూర్ చందుపట్ల, మరి పెల్లి, ఎదులాబాద్, పోతరాజు గూడెం, శ్రీరామ్ పౌల్ట్రీ ఫామ్, మదర్ తెరిసా కాలేజ్, కొత్తగూడలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు.

# రైతుల ధాన్యాన్ని తిరస్కరిస్తే మిల్లులపై తగిన చర్యలు

### ఎమ్మెల్యే. బి.ఎల్.ఆర్



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం ధాన్యం కొనుగోలు చేయడం లేదని, రైతులు నిరసన చేయడంతో స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి వెంటనే స్పందించి మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రైస్ మిల్లులను సందర్శించారు. ప్రతి మిల్లులో ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని హెచ్చరించారు. రైతులతో కలసి ధాన్యం ధరల గురించి అడిగి తెలుసుకున్నారు.వెంటనే స్పందించిన రైస్ మిల్లర్స్ ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. రైస్ మిల్ ఒనర్స్ తో, గుమస్థాలతో మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసిన రైస్ మిల్ పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం రకాన్ని, మరియు తేమ శాతాన్ని బట్టి మద్దతు ధర కంటే ఒక్క రూపాయి కూడా తగ్గకుండా ధరలను నిర్ణయించాలని మిల్లర్స్ కి సూచించారు. అలాగే రైతులు కూడా ధాన్యం తేమ విషయంలో గానీ ధర విషయంలో గానీ ఎలాంటి సందేహాలు ఉన్నా, మిల్లర్లు కొనమని చెప్పినా కూడా మీకు అందుబాటులో అగ్రికల్చర్ అధికారులు, మేము ఉంటాము మాకు తెలియజేయండి అన్నారు. మేము మీ తరుపున మిల్లుకు వచ్చి చెక్ చేస్తామని అన్నారు. రైతులు కూడా ఎవ్వరూ తొందర పడకండి ధాన్యం మిల్లర్స్ కొనుగోలు చేయకపోతే ఐకేపీ సెంటర్స్ లో తీసుకెళ్ళండి. అక్కడ అన్ని రకాల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో పాటు సన్న రకం వోడ్లకు 500 రూపాయల బోనస్ కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో మీడియటర్స్ నీ నమ్మి రైతులు మోసపోకండి నేరుగా మిల్లర్ తో గాని ఐకేపీ సెంటర్ లో గాని అమ్ముకోవాలని అన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు విషయంలో ఎవరు ఎలాంటి అసత్య ప్రచారాలు చేసి రైతులను బయందోనలకు గురి చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా సహనంతో ఉంటూ ధాన్యానికి తగిన ధర ఇవ్వకపోయినా, కొనను అని చెప్పినా నేరుగా నాకే కాల్ చేయండి అని ఫోన్ నెంబర్ రైతులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరీ దేవాలయ పునర్నిర్మాణ సమావేశం

- 350 సంవత్సరాల చరిత్ర కలిగిన చింతపల్లి శివాలయం
- ఆలయ పునర్నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి



**విశ్వంభర చింతపల్లి:** శివాలయ పుననిర్మాణానికి చింతపల్లి గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలని శివాలయం కమిటీ ఛైర్మన్ కొమిరిశెట్టి వెంకటయ్య అన్నారు. మండలం కేంద్రంలోని శివాలయ పునర్నిర్మాణ సమావేశానికి ఆలయ పూజారులు ఆదిత్యని సత్యనారాయణ శర్మ, ఆదిత్య మహేందర్ శర్మ, ఆదిత్య భాస్కర శర్మ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ మాట్లాడుతూ350 ఏళ్ల చరిత్ర కలిగిన శివాలయం ఆ రోజుల్లో ఆలంపల్లి వైశ్య కుటుంబానికి సంబంధించిన వారు శాస్త్రోక్తంగా నిర్మించారని గ్రామ వయో వృద్దుల ద్వారా తెలుస్తోంది. కోరిన భక్తులకు కొంగులు బంగారమై వెలసిల్లుతున్న శివాలయం దినదినాభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో ఆలయ ప్రహరీ గోడ, ప్రాకారాలు, ఆలయ గాలిగోపురానికి నగిషీలు, నూతనంగా నిర్మిస్తున్న కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంతో ఆలయ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. ఆలయ పునర్నిర్మాణం కోసం అనేక దఫాలుగా అందరితో చర్చించి ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి కులాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతిపాదనలు సిద్ధం చేయించి, నిధుల సేకరణ చేసి నిర్మాణంతో పాటు మౌలిక వసతులు కల్పించి నిర్మాణాన్ని చేపట్టాలని సమావేశంలో పేర్కొన్నారు. డిసెంబర్ 10వ తేదీ వరకు ప్రతి ఒక్కరు సమావేశంలో పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో శివాలయం పాలకవర్గం తో పాటు గ్రామ పెద్దలు, హైందవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ది నైబర్ హుడ్ గేటెడ్ కమ్యూనిటీ పదో వార్షికోత్సవం

### పాల్గొన్న ఎం.పీ ఈటల రాజేందర్



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని ది నైబర్ హుడ్ గేటెడ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ వార్షిక క్రీడా పోటీలను ఎంపీ ఈటల రాజేందర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో ఉదయం లేచినప్పటినుంచి కెరీర్‌కోసం ఉరుకుల పరుగులే. దీని వల్ల ఒత్తిడి సహజంగానే కలుగుతుంది. అయితే ఈ ఒత్తిడి నుండి బయట పడేందుకు ఇలాంటి క్రీడలు ఉపయోగ పడతాయన్నారు. తను ఆరోగ్య ఉండటమే కాకుండా తన తోటి వారు కూడా ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో నైబర్ హుడ్ కమ్యూనిటీ వారు గత 10 సంవత్సరాలుగా ఇలాంటి క్రీడా పోటీలు చేపట్టడం మంచి ఆలోచన అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా భాజపా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్, కమ్యూనిటీ సభ్యులు మహేష్ రాజు, సందీప్, అభిషేక్, హేమా శంకర్, పాపారావు, శరద్దీ, బాబు రావు, సుభ, కె.నాగరాజు, రవికాంత్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం ప్రజావాణి కార్యక్రమం రద్దు

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్:** సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో తేది.11 నవంబర్ 2024 సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదివారం తెలిపారు. జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే - సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేయడం జరిగిందనీ అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేయడం జరిగిందనీ, ప్రజలు దీనిని గమనించి కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని ఆయన ఒక ప్రకటన లో తెలిపారు.

## కాళేశ్వరంలో భక్తుల రద్దీ



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం లో భక్తుల సందడి నెలకొంది. కార్తీకమాసం ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు గోదావరిలో స్నానమాచరించి శివునికి అభిషేకం నిర్వహించారు. గోదావరి వద్ద పడవలు ఎక్కి త్రివేణి సంగమం వద్దకు వెళ్లి స్నానం చేసి గోదావరి జలాలను తీసుకొని వచ్చి కాళేశ్వర ముక్తేశ్వర స్వామికి పూజలు జరిపారు. గ్రామంలో భక్తుల వాహనాలతో సందడి నెలకొంది. ఉదయం 5 గంటల నుండే ఆలయం లో అభిషేకాలకు భక్తులు బారులు తీరారు. మంథని కి చెందిన కొందరు భక్తులు ఆలయం లో గణపతి అధర్వణ శీర్షం నిర్వహించి నమక చమకాల తో శివునికి రుద్రాభిషేకం జరిపారు. కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ఆలయంలో విశేష పూజలు జరిపారు. కార్తీక మాస ఆదివారం 150 అభిషేకాలు జరిగినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయానికి 4,30,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈ వో మారుతి తెలిపారు.

## మీసేవా కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే చర్యలు



**విశ్వంభర, భూపాలపల్లి:** మీ సేవ కేంద్రాల ద్వారా రాబోయే నూతన సర్వీసులపై మీ సేవా నిర్వాహకులు అవగాహన కలిగి ఉండాలని భూపాలపల్లి ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. ఈఎస్డీ కమిషనర్ ఆదేశాల మేరకు అదివారం ఐడీవోసీ కార్యాలయంలో జిల్లా పరిధిలోని అన్ని మీ సేవా కేంద్రాల ఆపరేటర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీయం మాట్లాడుతూ మీ సేవా కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం సేవలకు ప్రజల నుండి రుసుము తీసుకోవాలని, అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డీఎం రమేష్, రాకేష్, జిల్లాలోని అన్ని మీ సేవా కేంద్రాల ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కడ్లేకర్ పరమేశ్




విశ్వంభర, బషీర్ బాగ్: ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి కడ్లేకర్ పరమేశ్ ను నియమిస్తూ ఓబీసీ సెంట్రల్ కమిటీ ఛైర్పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కే పరమేష్ మాట్లాడుతూ వెనుకబడిన కులాలకు అండగా ప్రభుత్వం ఉండాలి అన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగంలో ఓబీసీ కోటలో అత్యధిక రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సంఘం బలోపేతం కోసం తన వంతుగా నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో జాతీయ ప్రధాన కార్యదర్శి నియమించిన ఛైర్మన్ భాగ్యలక్ష్మి కి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రారంభమైన ఇంటింటి సర్వే

### తనిఖీ చేసిన మండల అభివృద్ధి ప్రత్యేక అధికారి, ఎంపీడీవో



విశ్వంభర, కేశంపేట: సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం అయ్యింది. ఇందులో భాగంగా మండల పరిధిలోని అల్వాల, కేశంపేట, సంగెం, పోల్కొనుగుట్ట తండా, బైర్ ఖాన్ పల్లి గ్రామాలలో ప్రారంభించారు. ఈ సర్వేను మండల ప్రత్యేక అధికారి చల్లపల్లి, ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి సందర్శించి, పరిశీలించడం జరిగిందని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ సందర్బంగా ఎంపీడీవో మాట్లాడుతూ, మండలంలోని అన్ని బ్లాక్లలలో సర్వే ప్రారంభించడం జరిగిందని, గ్రామాల్లో అందరూ ప్రజలు సంబంధిత పత్రాలతో సర్వేకు వచ్చే అధికారులకు సహకరించాలని కోరారు.

# సీఎం రేవంత్ రెడ్డి పై జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**విశ్వంభర, జగిత్యాల:** బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని మూసి ప్రక్షాళన పేరుతో అసభ్య పదజాలంతో దూషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులతో కలిసి ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు జిల్లా పరిషత్ తొలి ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్ పిర్యాదు చేశారు. విద్యాసాగర్ రావు మాట్లాడుతూ తెలంగాణ కోసం పోరాడి ప్రాణాలు పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని ఉద్దేశించి ఇటీవల మూసి పాదయాత్ర సందర్భంగా సీఎం రేవంతరెడ్డి ఇష్టం వచ్చినట్లు, నోటికొచ్చినట్లు మాట్లాడుతూ, బుల్డోజార్లతో తొక్కిస్తామని మాట్లాడిన మాటలు ప్రజలందరూ గమనిస్తున్నారని స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఏ ప్రధానమంత్రి, ఏ ముఖ్యమంత్రి ఇటువంటి మాటలు మాట్లాడిన వారు లేరని, మూసి ప్రక్షాళన ఎవరు వద్దు అంట లేరు. అక్కడ నివసించే వారికి న్యాయం చేయాలనీ, హైడ్రా పేరుతో ఇళ్ళు కులగొట్టడం పేద ప్రజలు అప్పు చేసి కొనుకున్న ఇళ్లను కులగొట్టి ఇబ్బందులు పెడుతున్నారని, మూసి సుందరికరణ కోసం లక్ష యాభై వేల కోట్ల బడ్జెట్ పెట్టారు. అసలు మీ దగ్గర డబ్బులే లేవు. ఇంత వరకు రైతు బందుకు దిక్కు లేదు. ఎదో విధంగా డైవర్ట్ చేసుకుంటా రాజకీయాలు చేస్తున్నారు. దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి నీచ రాజకీయాలు చేస్తున్నారని మాజీ సీఎం కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి పై జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. ప్రజాస్వామ్య దేశంలో న్యాయం ఇంకా బ్రతికే ఉందనిపిస్తే సీఎం రేవంత్ రెడ్డి పై వెంటనే పోలీస్ వారు చర్యలు తీసుకోవాలని కోరారు. దావ వసంత సురేష్ మాట్లాడుతూ చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ లేకుంటే పీసీసీ అధ్యక్షునిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఆయ్యేవారేనా? కేసీఆర్ అంటే రేవంత్ రెడ్డి కి భయం, వణుకు తెలంగాణ స్వరాష్ట్రం కోసం ఉద్యమ సమయంలో పదవులకు రాజీనామా చేయకుండా అప్పటి పాలకులకు భయపడి పారిపోయిన ప్రస్తుత చీఫ్ మినిస్టర్ రేవంత్ రెడ్డి కి కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లు ప్రజలకు సంక్షేమం, ఆరు గ్యారెంటీలు అమలు పై, మూసి ప్రక్షాళన ఎ విధంగా చేస్తారో తమ భాషలో చెప్పకుండా, కేసీఆర్ ని సంస్కారం లేని భాష, అసభ్య పదజాలంతో మాట్లాడినట్టు గల్లి రౌడీలు కూడా మాట్లాడారని అన్నారు. సాధించుకున్న రాష్ట్రాన్ని పది సంవత్సరాల కాలంలో బంగారు తెలంగాణ గా చేస్తే, మీ పాలనలో విధ్వంస రాష్ట్రంగా మారింది. మీ అబద్ధపు హామీలు అమలు చేయలేక, పని చేయటం చేతగాక మీ చేతులారా ప్రజలందరి నోట కేసీఆర్ రే తెలంగాణకు శ్రీరామ రక్షగా, మళ్ళీ కేసీఆర్ రే రావాలని కోరుకునే విధంగా చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై ఇష్టానుసారంగా పదజాలం వాడటం పట్ల రేవంత్ రెడ్డి ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఒక ముఖ్యమంత్రి, మంత్రి స్థాయిలో ఉన్న మీరే ఈ విధంగా మాట్లాడితే రాష్ట్రంలో ఉన్న ప్రజల పరిస్థితి ఎలా? మీ ఆధ్వర్యంలో పని చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు కూడా గుండాలు లాగ చెలాయిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్వయంగా రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువైనాయని అని మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్ లు మన రాష్ట్రం హైద్రాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచితే మీరు మన రాష్ట్ర స్థాయిని దిగజరుస్తున్నారు. రికార్డ్స్ లో ఉన్న కేసీఆర్ పై మాట్లాడిన మాటలు పరిగణనలోకి తీసుకొని చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో జిల్లా బీఆర్ఎస్ పార్టీపక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో జగిత్యాల బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గట్టు సతీష్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ శీలం ప్రియాంక, జగిత్యాల రూరల్ అధ్యక్షులు ఆయిల్నేని ఆనంద్ రావు, జగిత్యాల అర్బన్ అధ్యక్షులు తుమ్మ గంగాధర్, సారంగాపూర్ అధ్యక్షులు తెలు రాజు, రాయికల్ అధ్యక్షులు బర్క మల్లేశం, రాయికల్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, అర్బన్ యూత్ అధ్యక్షులు సన్నిత్ రావు, రూరల్ మండల సమన్వయ కమిటీ నాయకులు గంగారాం, మైనారిటీ నాయకులు రిజ్వాన్, నాయకులు నీలి ప్రతాప్, గాజుల శ్రీనివాస్, వీరవేణి సాయి, కోటగిరి సుమన్, రెహ్మాన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసర వస్తువులు పంపిణీ



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ లోని స్థానిక సీపీఐ (ఎం) కాలని లో బియ్యం, కూరగాయలు, నిత్యవసర వస్తువులను పంపిణీ చేయడం జరిగింది. గ్లోబల్ పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెషనల్ మల్టీ పర్పస్ ఇంటర్నేషనల్ సోషల్ వర్కర్ వివిధ సేవా రంగాలలో అవార్డులను అందుకున్న ప్రముఖ సామాజిక వేత్త భూక్య బాలు నాయక్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి, ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అనే నినాదంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ ఆఫీస్ సమీపంలో సీపీఐ (ఎం) నూతన కాలనీలోని నిరుపేదలకు, అనాధలకు, వితంతువులకు, వృద్ధులకు, వికలాంగులకు, వలసదారులకు బియ్యం కూరగాయలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఇలాంటి కార్యక్రమాలు చేసినప్పుడే సమాజం మనుగడ పురోగతి సాధిస్తుందన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు దాతలు ముందుకు వచ్చి ఇలాంటి నిరుపేదలను అక్కున చేర్చుకొని ఆదుకోవాలని అన్నారు. వీరి కొరకు ప్రభుత్వం నివాస గృహాలు కట్టించి వీరి పిల్లలకు ఉచిత విద్యను అందించి సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ వేణు గోపాల్ నాయక్, విష్ణు నాయక్, సోమాజి నాయక్, సురేందర్ నాయక్, సురేష్ నాయక్, రూపి రెడ్డి నవిన్ రెడ్డి, యస్.కె బషీరుద్దీన్, భూక్య స్వర్ణలత, భూక్య భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామిని దర్శించుకున్న మొగుళ్ల రాజి రెడ్డి



విశ్వంభర, జనగాం: టీపీసీసీ అధికార ప్రతినిధి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ల రాజి రెడ్డి కుటుంబ సమేతంగా, కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకోవడం జరిగినది. ఈ సందర్భంగా గౌరవ సీఎం రేవంత్ రెడ్డి తలపెట్టిన కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జనగామ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయుటకు నా వంతు సాయంగా అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. జనగామ నియోజకవర్గానికి నిధుల కోసం సీఎం రేవంత్ రెడ్డి ని కలవనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కాటం మల్లేశం మద్దూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్ బెక్కల్ మాజీ సర్పంచ్ కూకట్ల బాలరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## భువి వాటర్ ప్లాంట్ ను సందర్శించిన వినయ్ రెడ్డి



విశ్వంభర, హైదరాబాద్: ఆర్మూర్ పట్టణ కేంద్రం మామిడిపల్లి లో భువి వాటర్ ప్లాంట్ ను ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఇంత పెద్ద మొత్తంలో భువి వాటర్ ప్లాంట్ ఇండస్ట్రీని స్థాపించిన వ్యవస్థాపకులు మైలారం బాలుని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ ఛైర్మన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునుభాయ్ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ సాయిబాబా గౌడ్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ పండిత్ పవన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్జు భాయ్, జిమ్మి రవి, రవీందర్ రెడ్డి, రాజు భాయ్, భుపెందర్, ఫాయీమ్ భాయ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బుస ముత్యం తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభ్యున్నతికి రేవంత్ సర్కార్ మరో ముందడుగు



**విశ్వంభర, హైదరాబాద్:** చేపల పెంపకం, విక్రయాల అధ్యయనం కోసం తెలంగాణ ప్రభుత్వం స్టడీ టూర్ లో భాగంగా మూడు రోజుల పాటు కర్ణాటకకు తెలంగాణ అధికారులు వెళ్ళనున్నారు. తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో నవంబర్ 11 నుండి 13 వరకు బెంగుళూరు, మైసూరు తదితర ప్రాంతాల్లో మూడు రోజుల క్షేత్రస్థాయి ఈ బృందం పర్యటించనున్నారు. అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలో అదర్శవంతమైన పాలసీ ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ స్టడీ టూర్ కు వెళుతున్నట్టు తెలిపారు. గత పదేండ్లలో చేపల పెంపకం పేరుతో బీఆర్ఎస్ నాయకులు కోట్లాది రూపాయలు లూటీ చేసినట్లు ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పలు రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత రాష్ట్రంలో నూతన పాలసీ తేనున్నట్టు తెలిపారు.

## ఎల్ ఓ సీ అందజేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం పరిధిలోని సుభాన్ పూర్ గ్రామానికి చెందిన షేక్ యూసుఫ్ కుమారుడు షేక్ సమీద్ గత కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. సమీద్ మెరుగైన చికిత్స కోసం పంజాగుట్టలోని నిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతున్నడు. ఆర్థిక పరిస్థితులు బాగోలేదని స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని కలిసి విన్నవించగా ఎల్ ఓ సీ ద్వారా 2,00,000 రెండు లక్షల రూపాయలు మంజూరు చేయించి లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారు మాట్లాడుతూ పిలిస్తే పలికే అమ్మ లాంటి మనసున్న మహారాణి మా సబితమ్మ మాకు ఇలా సమస్య ఉందని చెప్పిన వెనువెంటనే సంబంధిత డాక్టర్లకు ఫోన్ చేసి సమీద్ కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే రెండులక్షల రూపాయలు మంజూరు చేశారు వారికి మేము జన్మాంతం రుణపడి ఉంటామన్నారు.

# పేదల తిరుపతిగా కురుమూర్తి దేవస్థానం : సీఎం



**విశ్వంభర, మూసాపేట:** మహబూబ్ నగర్ జిల్లా సీసీ కుంట మండలంలోని కురుమూర్తి స్వామిని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి కురుమూర్తి స్వామి వారి దర్శనానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని, దేవస్థానం వద్ద ఎలివేటేడ్ కారిడార్ ఘాట్ రోడ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఆలయ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే సీత దయాకర్ రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ లు, తదితర ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులకు పూర్ణ కుంభం తో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జీయంఆర్ మాట్లాడుతూ దేవస్థానం వద్ద ఎలివేటేడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్ మంజూరు చేసి, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ కురుమూర్తి స్వామి దర్శనానికి విచ్చేసిన పాలమూరు ముద్దు బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కురుమూర్తి స్వామి భక్తుల తరుపున ధన్యవాదాలు తెలియజేసారు. పేదల తిరుపతిగా ప్రసిద్ధ గాంచిన శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు జాతర లో కళ్యాణ మండపం, కాటేజేస్, ఆలయ అభివృద్ధి కొరకు మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. తదనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌ను పాలమూరు ప్రజలు పార్లమెంట్‌కు పంపింతే పదేళ్లు సీఎంగాఉన్న కేసీఆర్ మహబూబ్ నగర్ జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, పరిశ్రమలు రాలేదని, దాంతో జిల్లాలో వలసలు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు మీ నియోజకవర్గాలకు నిధులు తీసుకుపోయినప్పుడు మేం అడ్డుపడలేదు. ఇప్పుడు మాకు అవకాశం వచ్చింది మా జిల్లా అభివృద్ధిని అడ్డుకోవద్దు, ఒకవేళ అడ్డుపడితే మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు మిమ్మల్ని క్షమించరని అన్నారు. నాపై కోపం ఉంటే వేరే రకంగా రాజకీయంగా కక్ష్య తీర్చుకోండని తెలియజేశారు. ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నామని, ప్రతినెలా జిల్లా ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. అపర భగీరథ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు కొంతమంది దుర్మార్గులు కుట్రలు చేస్తున్నారు. వలసలు ఆపాలని నేను ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. జిల్లాలోని మన్యం కొండ, కురుమూర్తి దేవాలయాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామన్నారు.

# వలసలు ఆపాలని ప్రయత్నిస్తుంటే అడ్డుపడుతున్నారు

**విశ్వంభర, మహబూబ్ నగర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటించారు. కురుమూర్తి స్వామిని దర్శించుకొని కొండకు వెళ్లే ఘాట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా ఇంఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా కాంగ్రెస్ నేతలు కురుమూర్తి వెంకన్న స్వామి పూజల్లో పాల్గొన్నారు. పదేళ్లు ఏ అభివృద్ధి చేయకపోవడంతో ఇంకా వలసలు కొనసాగుతున్నాయన్నారు. మహబూబ్ నగర్ జిల్లా వలసలకు కేరాఫ్ అడ్రస్ అని వలసలు ఆపాలని ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు అడ్డుపడుతున్నారని ముఖ్యమంత్రి అన్నారు. జిల్లాని ఆనుకొని కృషానది వెళున్నా మహబూబ్ నగర్ కరువు తాండవిస్తుందన్నారు. పాలమూరు జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆయన అన్నారు. కురుమూర్తి, మన్నెంకొండ జాతరలను ఇంకా ఘనంగా నిర్వహింస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గతంలో మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు కేసీఆర్ కు ఓట్లు వేసి పార్లమెంట్ కు పంపిన కృతజ్ఞతను కేసీఆర్ మర్చిపోవద్దని ఆయన చెప్పుకొచ్చారు. పాలమూరు జిల్లా అండగా నిలబడితేనే కేసీఆర్ 2 సార్లు ముఖ్యమంత్రి అయ్యారని రేవంత్ రెడ్డి అన్నారు. అయినా పదేళు అధికారంలో ఉన్న కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు మహబూబ్ నగర్ జిల్లా ప్రాజెక్టులను పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సీఎంగా పాలమూరు బిడ్డకు అవకాశం వచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కురుమూర్తి స్వామి ఆశీర్వాదంతోనే ఆయన ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. కురుమూర్తి దేవాలయానికి రూ.110 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పామూరు జిల్లా ప్రజలకు కురుమూర్తి బ్రహ్మోత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి తిరుపతి వెళ్లలేని వాళ్లకు పేదల తిరుపతిగా కురుమూర్తి వెంకన్న స్వామి కరుణిస్తాడని, భక్తులకు నమ్ముతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాలమూరు జిల్లా ప్రజల చెమటతోనే ఎన్నోప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయి. ఈ జిల్లా ప్రజల ఆశీర్వాదంలోనే పార్లమెంట్ కు వెళ్లానని ఆయన గుర్తు చేసుకున్నారు. కృష్ణమ్మ జలాలతో పాలమూరును సస్యశ్యామలం చేస్తానని రేవంత్ రెడ్డి హామి ఇచ్చారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులిస్తుంటే కొందరు విమర్శలు చేస్తున్నారని అన్నారు సీఎం. ఇంకో రకంగా రాజకీయంగా విమర్శలు చేయండి, కానీ అభివృద్ధికి అడ్డు పడొద్దని రేవంత్ రెడ్డి సూచించారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు అడ్డుపడితే ఎవ్వర్ని క్షమించవద్దని సీఎం రేవంత్ రెడ్డి యువతకు సూచించారు.



# శ్రీ రేణుక ఎల్లమ్మ, పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

- రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఆలయాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- ఆలయాలను రక్షించుకోవలసిన బాధ్యత మనందరి పైన ఉంది - అందెల శ్రీరాములు

**విశ్వంభర, మహేశ్వరం:** బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 27వ డివిజన్ కృష్ణ హోమ్స్ కాలనీ లోని శ్రీ రేణుక ఎల్లమ్మ, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ హాజరై దేవి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్క హిందూ ఆలయాలలో పరిసర ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వరుసగా హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని అన్నారు. అలాగే కాలనీ వాసులందరికీ నూతన ఆలయాన్ని నిర్మించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ



కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, కాలనీ అధ్యక్షులు నరేందర్ ఉపాధ్యక్షులు వెంకటేష్, బీజేపీ, బీజెవైఎం నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఆసుపత్రిలో యువకుడు మృతి

- **డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే మృతి చెందాడని బంధువుల ఆరోపణ**
- **నష్టపరిహారం కోసం డిమాండ్**
- **భారీ ఎత్తున పోలీసుల రంగ ప్రవేశం**




**విశ్వంభర, జగిత్యాల:** జగిత్యాల జిల్లా భీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన జవాజి జలంధర్ (28) మూడు రోజుల నుండి జ్వరం రావడంతో మెట్ పల్లి ప్రైవేట్ హాస్పిటల్ కు కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. జ్వరంతో మూడు రోజుల నుండి ఆహారం తీసుకోకపోవడంతో నిరసించిన యువకునికి వైద్యం చేస్తున్న సమయంలో ఫిట్స్ రావడంతో పరిస్థితి విషమించి చనిపోయాడు.డాక్టర్ ఆలస్యంగా చికిత్స చేసినందుకు జలంధర్ చనిపోయారని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. నష్టపరిహారం కోరుతూ మృతదేహాన్ని ఆస్పత్రి వద్ద ఉంచి ధర్నా నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి జలంధర్ కుటుంబ సభ్యులకు, బంధువులకు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇది ఇలా ఉండగా కొంతమంది మధ్యవర్తులు సెటిల్మెంట్ కొరకు మృతుడి బంధువులతో భేరసారాలు కొనసాగిస్తూ నష్టపరిహారం కుటుంబ సభ్యులకు అందే విధంగా చూస్తామని బుజ్జగించి గొడవ జరగకుండా సెటిల్మెంట్ చేశారు. మృతుడికి భార్య ఇద్దరు చిన్న ఆడపిల్లలు ఉన్నారు. డాక్టర్ రష్యా లో ఎంబీబీఎస్ చేశారని ఆర్.ఎం.పి లు, పి ఎం పి లు, డాక్టర్ తో హాస్పిటల్ నిర్వహిస్తున్నారని సమాచారం.

# మంచినీటి బోర్లు ప్రారంభం



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ లోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి బోర్లను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు లక్ష్యమని తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వార్డు ప్రెసిడెంట్ సోమరాజు భార్యను పరామర్శించి ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ ఛైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు బూచ్చిరెడ్డి, సురేందర్ రెడ్డి, మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, వార్డు ప్రెసిడెంట్లు కామేశ్వరరావు సోమరాజు, నాయకులు భూషణ్ బాబి శ్యామ్, రాజు, జై కుమార్, శ్రీనివాసు, బాబు, లక్ష్మణ్, దిలీప్, లక్ష్మమ్మ, గోపాల్, ప్రభాకర్ రావు, లక్ష్మి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## సిడ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్




**విశ్వంభర, వికారాబాద్:** అక్టోబర్ 2న ప్రారంభమైన ప్లాటినం కప్, గోల్డ్ కప్, సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్లో 16 టీమ్ లు పాల్గొన్నాయని, ఆదివారం నాడు ఫైనల్ మ్యాచ్ లు నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు శ్రీధర్ వెల్లడించారు. ప్లాటినం కప్ విజేతలుగా నిలిచిన కేసారం కింగ్స్ టీమ్ కు ఛైర్ పర్సన్ చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకోగా, చేవెళ్ల ఇబ్రహీంపల్లి టీమ్ రన్నర్స్ గా నిలిచింది. గోల్డ్ కప్ నుండి వికారాబాద్ గోపాల్ 11 టీమ్ విజేతలుగా, రన్నర్ గా అన్ లిమిటెడ్ స్పోర్ట్స్ సంగారెడ్డి టీమ్ నిలిచింది. అలాగే సిల్వర్ కప్ విజేతలుగా మహావీర్ హాస్పిటల్ టీమ్ విజయం సాధించగా, ఎస్ ఏ పి క్లబ్ టీమ్ రన్నర్ గా నిలిచింది. ఫైనల్ లో గెలిచిన అన్ని టీమ్ లను ఛైర్ పర్సన్ మంజుల రమేష్ , అర్ధ. సుధాకర్ రెడ్డి లు అభినందించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ హఫీజ్, టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీధర్, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరు మండల్ సదర్ సమ్మేళనంలో పాల్గొన్న అందెల శ్రీరాములు



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండలంలోని అఖిల భారత యాదవ మహాసభ మండల యువజన విభాగం అధ్యక్షులు పర్వతాలు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ హాజరై దున్న రాజులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, మండల మాజీ యువజన సంఘం అధ్యక్షులు బాలరాజ్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు, యాదవ మహాసభ సంఘం నాయకులు, యాదవ సోదరులు, వివిధ గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండ ఎర్రజెండా సీపీఎం తంగళ్ళపల్లి మండల కార్యదర్శి కోడం రమణ



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల:** ఈరోజు తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని పవర్లూమ్ కార్మిక సంఘ భవనంలో సీపీఎం తంగళ్ళపల్లి మండల, గ్రామ శాఖా మహాసభ నిర్వహించారు. ఈ మహాసభల ప్రారంభ సూచికగా సీపీఎం తంగళ్ళపల్లి మండల సీనియర్ నాయకులు కుడిక్యాల కనకయ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం మహాసభ సందర్భంగా ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో మరణించిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరికి, ఇతర పార్టీ నాయకులు, సభ్యులందరికీ సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. గత మూడు సంవత్సరాల కాలంలో సీపీఎం ఆధ్వర్యంలో మండలంలో కార్మిక వర్గం, రైతాంగం, పేద ప్రజల కోసం నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని రాబోయే రోజుల్లో భవిష్యత్తు ఉద్యమ పోరాట కార్యాచరణను రూపొందించుకోవడం జరిగింది. ఈ మహాసభలలో సీపీఎం మండల నాయకులు శ్రీరాముల రమేష్ చంద్ర, గోవిందు లక్ష్మణ్, అన్నల్దాస్ గంగాధర్, మూశం శంకర్, కంసాని రవీందర్, నర్సయ్య, రవి, సదానందం, రాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## బైరి అమర్, స్రవంతిల కుటుంబాన్ని పరామర్శించిన కే కే మహేందర్ రెడ్డి



విశ్వంభర, రాజన్న సిరిసిల్ల: అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులు భరించలేక సిరిసిల్ల పట్టణంలోని 37వ వార్డు, వెంకంపేటకు చెందిన నేతన్న దంపతులు బైరి అమర్, స్రవంతి లు శనివారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సందర్భంగా ఈ రోజు 5 గంటలకు వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జీ కే కే మహేందర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు.

## మజీద్ మీద రాజకీయాలు మానుకోవాలి

- **పదవుల మీద నాకు ఆశ లేదు**
- **సేవ చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధం**
- **తంగల్లపల్లి మదీనా మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండీ హైదర్**



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల:** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఆదివారం తంగల్లపల్లి మదీనా మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండి హైదర్ (హాజీ) మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. 2013 వ సంవత్సరంలో నేను అధ్యక్షునిగా ముందుండి అన్ని నిర్మాణాలు చేపట్టానన్నారు. కొంతమంది స్వార్థ రాజకీయాల వల్ల 2014 సంవత్సరంలో రాజీనామా చేసి ఇతరులకు అప్పజెప్పడం జరిగింది. గతంలో తంగళ్ళపల్లి మండల కేంద్రంలో మజీద్ కమిటీ భవనాలను ముందు ఉండి ఆధునికరించినప్పుడు ఆ సమయం లో ఉన్న కమిటీ వారు ముఖ్యమైన పనులు పూర్తి అయ్యే వరకు గౌరవ అధ్యక్షులు గా ఉంచి ఆ తర్వాత కమిటి నుండి తొలగించారు. ఇప్పుడు 2024 వ సంవత్సరంలో నూతనంగా నిర్మాణం చేపట్టే మస్జిద్ కోసం నన్ను మళ్ళీ సంప్రదించారు. వారి సూచన మేరకే నేను మజీద్ కమిటీ అధ్యక్షునిగా కొనసాగుతున్నాను. కానీ ఇప్పుడు మళ్లీ స్వార్థ రాజకీయాలు చూపిస్తూ నేను 10 రోజులు అందుబాటులో లేకపోవడం, మస్జిద్ కి రావడం లేదని సాకుతో నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. దేవుని కోసం నిర్మించే మసీదులో నిస్వార్థంగా పనిచేస్తున్నాను. కొన్ని రోజున క్రితం కమిటీ సమావేశం నిర్వహించినప్పుడు అన్ని లెక్కలు నేను చూపిస్తానని వెల్లడించాను. 2013 నుండి 2023 వరకు అధ్యక్షునిగా కొనసాగిన వారు కూడా మొత్తం లెక్కలు చూపించాలని డిమాండ్ చేస్తున్నాను. ఎన్నికైన కమిటీ గడువు ముగియకముందే, నేను రాజీనామా చేయకుండానే, నూతన కమిటీని ఎలా ఎన్నుకుంటారని ప్రశ్నితున్నాను. ఈ కమిటీని నేను పూర్తిగా తిరస్కరిస్తున్నాను. పదవుల మీద నాకు ఎన్నడూ ఆశ లేదు, సేవ చేసేందుకు నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను. మజీద్ మీద రాజకీయాలు చేయడం మానుకోవాలని మదీనా మజీద్ కమిటి అధ్యక్షులు హాజీ ఎండి హైదర్ అన్నారు.

# బాలాసాహెబ్‌ను అవమానించిన వారి పక్షానే ఉద్ధవ్: అమిత్ షా





## మహారాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన బీజేపీ

**ముంబయి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ తన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా 'సంకల్ప్‌పత్ర'పేరుతో దీనిని విడుదల చేసి మాట్లా డారు. ఇది రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందన్నారు. యువకులు, పేదలు, రైతులు, మహిళల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు రూపొందించామని పేర్కొన్నారు. స్కిల్ సెన్సస్, స్టార్టప్‌ల అభివృద్ధి కోసం శివాజీ మహారాజ్ కేంద్రం, ఇంక్యుబేషన్ సెంటర్లు, వడ్డీ లేని రుణాలు అందిస్తామని తెలిపారు.ప్రతిపక్ష మహా వికాస్ అఘాడిపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష కూటమి వాగ్దానా ఇలను విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్ని ఎత్తులు వేసినప్పటికీ దేశంలో మత ఆధారిత రిజర్వేషన్లను భాజపా అనుమతించదని పునరుద్ఘాటించారు. మహారాష్ట్రలో సుస్థిరమైన, విశ్వసనీయమైన పరిపాలన ఉండాలంటే మహాయుతి ప్రభుత్వం అధికారంలో కొనసాగాలని స్పష్టం చేశారు. అన్ని కులాలు, వర్గాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చామని ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. రాష్ట్రాన్ని వికసిత్ మహారాష్ట్రగా మార్చేందుకు రోడ్ మ్యాప్‌ను రూపొందించామన్నారు.

మహా వికాస్ అఘాడీలో భాగమైన శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ)లపై ప్రజలకు నమ్మకం లేదని అమిత్ షా విమర్శించారు. "ప్రతిపక్షాలు బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చలేదు. బాలాసాహెబ్, సావర్కర్‌లను అవమానించిన కాంగ్రెస్ పక్షానే ఉద్ధవ్ ఠాక్రే నిలబడ్డారు" అంటూ విమర్శలు గుప్పించారు.

సావర్కర్ గురించి రెండు మంచి మాటలు మాట్లాడాలని రాహుల్ గాంధీని ఉద్ధవ్ ఠాక్రే కోరగలరాఅని అమిత్‌షా ప్రశ్నించారు. "అయోధ్య రామమందిరం, పౌరసత్వ చట్ట సవరణ, యూనిఫాం సివిల్ కోడ్ ఇలా ఎన్నో అంశాల్లో కాంగ్రెస్ నుంచి వ్యతిరేకత వచ్చింది. అలాంటి వారితో ప్రస్తుతం ఉద్ధవ్ ఉన్నారు. అబద్ధపు వాగ్దానాలతో లాభం లేదనే విషయాన్ని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్‌కు తెలియజేయాలను కుం టున్నారు. యూపీఏ హయాంలో కేంద్ర మంత్రిగాపనిచేసిన ఆయన.. మహారాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం చేసిన పనులేంటో చెప్పాలి" అని డిమాండ్ చేశారు.మహారాష్ట్రలో నవంబర్ 20న ఎన్నికలు జరగనున్నాయి. 23న ఫలితాలు వెల్లడిస్తారు. ఈ ఎన్నికల్లో మరోసారి అధికారం చేజిక్కించుకోవాలనే లక్ష్యంతో మహాయుతి కూటమి ప్రయత్నిస్తోంది. మరోవైపు.. ఈసారి అధికారంలోకి రావాలని ఎంవీఏ విశ్వప్రయత్నాలు చేస్తోంది.

### కీలక హామీలు ఇవే..

**ఉద్యోగకల్పన:** యువతకు 25లక్షల ఉద్యోగాలు

**నైపుణ్య గణన:** రాష్ట్రంలో మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టించే లక్ష్యంతో ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల డిమాండ్, సరఫరాను అంచనా వేయడానికి సమగ్ర నైపుణ్య గణన.

**లఖపతి దీదీ పథకం విస్తరణ:** ప్రస్తుతం 11 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూరుస్తున్న "లఖపతి దీదీ" పథకాన్ని 50 లక్షల మంది మహిళలకు విస్తరించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం.

**ఎరువుల జీఎస్టీ వాపసు:** రైతులు ఎరువులపై చెల్లించిన జీఎస్టీని తిరిగి చెల్లించి, వారి ఆర్థిక భారాన్ని తగ్గించడం.పరిశ్రమల వృద్ధికి వడ్డీ లేని రుణాలు: పారిశ్రామిక అభి ,వృద్ధిని పెంచేందుకు ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు.

వ్యవసాయ రుణాల మాఫీ: రైతులకు రుణమాఫీ చేసి,వారిపై రుణభారాన్ని తగ్గించడానికి చర్యలు

**సీనియర్ సిటిజన్లకు పెన్షన్ పెంపు:** వృద్ధులకు అందించే నెలవారీ పెన్షన్ రూ.1,500 నుంచి రూ.2,100కు పెంపు

**ధరల స్థిరీకరణ:** నిత్యావసర వస్తువుల ధరలను స్థిరంగా ఉంచేందుకు చర్యలు


288 మంది శాసనసభ స్థానాలు కలిగిన మహారాష్ట్రలో నవంబరు 20న ఒకేవిడతలో పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలను ప్రకటించనున్నారు. ప్రస్తుతం భాజపా, శివసేన, ఎన్సీపీలతో కూడిన మహాయుతి ప్రభుత్వం అధికారంలోఉంది. ఈఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించి అధికారంలోకి రావాలని కాం గ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ)ల ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి ప్రయత్నిస్తోంది.

# పరారీలో తమిళ నటి కస్తూరి.. ఫోన్ స్విచ్ఛాఫ్.. ఇంటికి తాళం..!



**చెన్నై:** తెలుగు వారిని కించపరిచే వ్యాఖ్యలు చేసిన తమిళ నటి కస్తూరి పరారీలో ఉన్నారు. ఆమె ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. ఇంటికి తాళం వేసింది. దాంతో ఈ కేసులో కస్తూరికి సమన్‌లు ఇవ్వడం పోలీసులకు కష్టంగా మారింది. కొద్ది రోజుల క్రితం నటి కస్తూరి తెలుగువారిపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఓ రాజకీయ సభలో ఆమె తెలుగు వారిని కించపరుస్తూ మాట్లాడారు. ఆమె వ్యాఖ్యలపై తెలుగు సంఘాలు మండిపడ్డాయి.దాంతో ఆమె తన తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేశారు. తాను తెలుగు వారిని కించపరిచే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని ప్రకటించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. మూడు రోజుల క్రితం కస్తూరిపై చెన్నైలో ఇదే విషయమై కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు ఆమెకు సమన్‌లు అందజేసేందుకు పోలీసులు ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో ఫోన్ చేశారు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వచ్చింది.దాంతో నటి కస్తూరి పారిపోయారన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆమె ఎక్కడుందనే విషయంలో స్పష్టమైన సమాచారం లేదు. అన్నమయ్య సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కస్తూరి ఆ తర్వాత పలు సినిమాల్లో నటించారు. ఓ తెలుగు సీరియల్‌లోనూ లీడ్ రోల్ పోషించి మంచి గుర్తింపు పొందారు. అందుకే తెలుగులో అవకాశాలు పొందుతూ తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడమేంటని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇటీవల నటి కస్తూరీ ఓ రాజకీయ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె.. 'తమిళనాడులో అంతఃపుర మహిళలకు సేవ చేసేందుకు తెలుగువారు వచ్చేవారు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి.

# న్యూయార్క్ నగరాన్ని కమ్ముతున్న కార్చిచ్చు పొగ..!



**న్యూయార్క్:** న్యూయార్క్ నగరాన్ని కార్చిచ్చు పొగ కమ్మేస్తోంది. ఇక్కడికి 80 మైళ్ల దూరంలోని అల్‌స్టర్, సుల్వాన్ కౌంటీల్లో ఇది మొదలైంది. అగ్నిమాపక సిబ్బంది దీనిని అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా.. ఫలితం కనిపించలేదు. ముఖ్యంగా నెల రోజుల నుంచి చుక్క వర్షం లేకపోవడం, మరోవైపు తీవ్రమైన పొడి వాతావరణం కారణంగా ఇది వేగంగా వ్యాపిస్తోంది. దాదాపు ఆరుచోట్ల కార్చిచ్చులు పుట్టుకొచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. వెస్ట్ మిల్‌ఫోర్డ్ వద్ద శనివారం సాయంత్రం జెన్నింగ్ క్రీక్ ఫైర్ పుట్టుకొచ్చింది. సుమారు 2,000 ఎకరాలను దహనం చేసింది. అల్‌స్టర్, సుల్వాన్ కౌంటీల్లో ది వైట్ హౌస్‌ఫైర్‌తో వేల ఎకరాల్లో అడవి దహనమైపోయింది. ఇక్కడి నుంచి శనివారం గాలులు న్యూయార్క్ దిశగా వీయడంతో భారీగా పొగ నగరంపై అలముకుంది. ప్రజలకు శ్వాస సంబంధ సమస్యలు తలెత్తొచ్చని, వీలైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని న్యూయార్క్ మేయర్ ఎరిక్ ఆడమ్స్ హెచ్చరించారు. మరోవైపు ఎయిర్ క్వాలిటీ హెల్త్ అడ్వైజరీ కూడా జారీ చేశారు. ఒక మోస్తరు వర్షం పడే వరకు ఈ పొగ అలానే ఉంటుందని న్యూజెర్సీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ పేర్కొంది. న్యూయార్క్ నగరంలో అక్టోబర్‌లో వర్షం పడకుండా ఉండటం కొన్నేళ్ల తర్వాత ఇదే తొలిసారి. పెన్సిల్వేనియా, న్యూజెర్సీల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఆదివారం సాయంత్రం న్యూయార్క్‌లో అర అంగుళం మేరకు వర్షం పడొచ్చని చెబుతున్నారు. దీంతో నగరంపై కమ్ముకొన్న పొగ నుంచి నగరవాసులకు కొంత ఉపశమనం లభించొచ్చు.

# ఆర్థిక సంక్షోభంలో ఉన్న డెమోక్రట్లకు విరాళాలివ్వండి: డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డెమోక్రట్ల విరాళాలపై ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. కమలా హారిస్‌కు వచ్చిన ప్రచార విరాళాలు అయిపోగా.. 20 మిలియన్ డాలర్లు అప్పు ఉన్నట్లు పలు వార్తాసంస్థల్లో కథనాలు వెలువడ్డాయి. '2020 అధ్యక్ష ఎన్నికల్లో రికార్డు స్థాయిలో విరాళాలు సేకరించి పోరాడిన డెమోక్రట్ల వద్ద డాలర్లు లేకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ఈ క్లిష్ట సమయంలో వారికి ఆర్థిక సాయం అందించాలని నా మద్దతుదారులను కోరుతున్నా" అంటూ ట్రంప్ వ్యంగ్యంగా స్పందించారు.అమెరికా అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ 1 బిలియన్ డాలర్లకు పైగా ప్రచార విరాళాలు సేకరించారు. ఈ క్రమంలో ఎన్నికలు ముగిసే సమయానికి 20 మిలియన్ డాలర్లు అప్పులో ఉన్నట్లు పలు కథనాలు వెలువడ్డాయి. విక్రేతలకు, సిబ్బందికి సంబంధించిన చెల్లింపుల్లో ఆమె ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తాజా వ్యాఖ్యలు చేశారు.

# బుల్డోజర్ న్యాయం ఆమోదయోగ్యం కాదు: జస్టిస్ డీవై చంద్రచూడ్



**దిల్లీ:** దేశవ్యాప్తంగా ఇటీవల 'బుల్డోజర్' చర్యలు హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇదివరకు నిర్మాణ రంగానికే పరిమితమైన ఈ సాధనం.. ఇప్పుడు రాజకీయాల్లోనూ కీలక ఆయుధంగా మారింది. బుల్డోజర్ న్యాయం పేరుతో పలు రాష్ట్రాలు ఈ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయి. కాగా ఈ విషయంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పందించారు. ఈ చ ర్యల ద్వారా పౌరుల గొంతు నొక్కడం సరైనది కాదని.. చట్టబద్ధమైన పాలన జరుగుతున్న సమాజంలో బుల్డోజర్ న్యాయం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు.ప్రజల నివాసాల రక్షణ, భద్రత వారి ప్రాథమిక హక్కుల కిందకు వస్తా ్తయని.. వాటిని కూల్చివేసే అధికారం ప్రభుత్వాలకు ఉండదని ఆయన పేర్కొన్నారు.దీనికి అనుమతిచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాల న్నారు. అయితే.. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ఇలాంటి చర్యలు చేపట్టడంలో తప్పు లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. వీటికి కూడా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించాలని సూచించారు.బుల్డో జర్ న్యాయం పేరుతో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారి ఇళ్లను కూ ల్చివేసే ప్రక్రియను పలు రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయి. యూపీలో తొలుత మొదలైన ఈ ధోరణి.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకూ పాకింది. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాలు విచారణలో ఉన్న నేరగాళ్ల ఇళ్లు,ప్రైవేటు ఆస్తుల పైకి బుల్డోజర్లను పంపించడాన్ని ఇప్పటికే పలు మార్లు సుప్రీం కోర్టు తప్పు బట్టింది. నిందితుల ఆస్తులపైకి బుల్డోజర్లను పంపించడం సరికాదని స్పష్టం చేస్తూ, అక్రమంగా ఒక్క కట్టడాన్ని ధ్వంసం చేసినా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లేనని హెచ్చరించింది. అయితే, రహదారులు, ఫుట్‌పాత్‌ల మీద, రైలు మార్గాలు, జలాశయాలు, ప్రభుత్వ స్థలాల పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలకు తమ ఆదేశాలు వర్తించవంటూ మినహాయింపునిచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ డి.వై చంద్రచూడ్ ఆదివారం పదవీ విరమణ చేస్తారు. 2022 నవంబర్‌లో భారత 50వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఎన్నో ముఖ్యమైన కేసుల్లో చరిత్రాత్మక తీర్పులు వెలువరించారు. సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా నవంబరు 11న ప్రమాణస్వీకారం చేయనున్న జస్టిస్ సంజీవ్‌ఖన్నా 2025 మే 13 వరకు ఆ పదవిలో కొనసాగుతారు.

# మా సరిహద్దుపై ఓ కన్నేసి ఉంచాం: ట్రూడో ప్రభుత్వం

**కెనడా:** అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో అమెరికాలోఉన్న వలసదారులుతమ దేశానికి పోటెత్తే అవకాశం ఉన్నట్లు కెనడా ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది.ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారని.. కెనడా, అమెరికా సరిహద్దును నిశితంగా పరిశీలి స్తున్న ట్లు సమాచారం. "మా అందరి కళ్లు సరిహద్దులపైనే ఉన్నాయి. అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఎందుకంటే ట్రంప్ అధికారంలోకి వస్తే మా దేశంలోకిఅక్రమ వలసలు పెరుగుతాయని మాకు తెలుసు"అనిరాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ ప్రతినిధి, సార్జెంట్‌చార్లెస్ పోయి యర్ పేర్కొన్నారు.




### ఇమ్మిగ్రేషన్‌పై గూగుల్ సెర్చ్‌లు పెరుగుతున్నాయి..

కెనడా 2017 నుంచి 2021 వరకు ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో పదివేల మంది వలసదారులు కెనడాను ఆశ్రయించినట్లుగా అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. అక్రమంగా కెనడాలోకి ఎలా ప్రవేశించాలి..? ఏ లొకేషన్ నుంచి వెళ్లాలి..? అని గూగుల్(%+శీశీస్త్రశ్రీవ%)లో పరిశోధనలు పదిరెట్లు పెరిగాయని అధికారులు తెలిపారు. అయినప్పటికీ కెనడాలోకి ప్రవేశించడం అంత సులభం కాదని.. సరిహద్దులో కెమెరాలు, సెన్సర్లు, డ్రోన్లను మోహరించామని చెప్పారు.దేశంలోకి అనుమతించే వలసదారుల సంఖ్యను భారీగా తగ్గించేందుకు కెనడా ప్రభుత్వం సిద్ధమైంది. ఈ కథనాల ప్రకారం.. 2024లో 4,85,000 మందిని శాశ్వత నివాసితులుగా కెనడా గుర్తించింది. 2025లో ఈ సంఖ్య 3,80,000లకు మాత్రమే పరిమితం చేసింది. 2027 నాటికి 3,65,000 మందికి మాత్రమే ప్రవేశం కల్పించాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఇటీవల ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'కెనడాలో తాత్కాలిక విదేశీ ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తున్నాం. కంపెనీలకు సంబంధించి కొన్ని కఠిన నిబంధనలు తీసుకురానున్నాం. నియామకాల విషయంలో కంపెనీలు స్థానికులకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేదో వెల్లడించాల్సి ఉంటుంది' అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారాల్లో భాగంగా ట్రంప్ మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే అక్రమంగా వలస వచ్చిన వారిని వెనక్కి పంపుతానని స్పష్టంగా ప్రకటించారు. మొత్తం వలస విధానాన్నే మారుస్తానని.. ప్రపంచంలోనే అత్యంత భారీ డీపోర్టేషన్ (స్వదేశాలకు పంపడం) చేపడతానని స్పష్టం చేశారు. శరణార్థి విధానాలనూ సమీక్షిస్తానని తెలిపారు. దీంతో ఇతర దేశాల నుంచి అమెరికాకు అక్రమంగా వచ్చిన వారిలో తీవ్ర ఆందోళన నెలకొంది.

# నిక్కీ హేలీ, మైక్ పాంపియోలకు ట్రంప్ 2.0 కార్యవర్గంలో స్థానం లేదు..!





**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తన కార్యవర్గంలో నిక్కీ హేలీ , మైక్ పాంపియోలకు స్థానం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ట్రూత్ సోషల్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. 'ఐక్యరాజ్యసమితి మాజీ రాయబారి నిక్కీ హేలీ, మాజీ విదేశాంగ కార్యదర్శి మైక్ పాంపియోను నూతన కార్యవర్గంలోకి ఆహ్వానించడం లేదు. ఇంతకు ముందు వారితో కలిసి పనిచేయడం నాకు చాలా ఆనందానిచ్చింది. దేశానికి చేసిన సేవకు వారికి ధన్యవాదాలు' అని ట్రంప్ రాసుకొచ్చారు.మరోవైపు ట్రంప్ ప్రకటనపై నిక్కీ హేలీ స్పందించారు. 'ఐరాసాలో అమెరికాను సమర్థించే అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి పని చేయడం నాకు ఎంతో గర్వంగాఉంది. రాబోయే నాలుగేళ్లలో అమెరికాను మరింత బలంగా, సురక్షితంగా ముందుకు తీసుకెళ్లడంలో విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని ఎక్స్‌లో తెలిపారు.నిక్కీ హేలీ భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నాయకురాలు. సౌత్ కరోలినా గవర్నర్‌గా పనిచేశారు. ఈ ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలోనే ఆయనకు పోటీగా బరిలోకి దిగారు. ఆ తర్వాత ఆయనకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.మరోవైపు మైక్ పాంపియో ట్రంప్ నకు అత్యంత సన్నిహితుల్లో ఒకరు. అధ్యక్షుడి కార్వర్గంలో వీరిద్దరికి అవకాశం లభిస్తుందని అక్కడి వార్తా సంస్థల్లో కథనాలు వెలువడ్డాయి. అందుకు భిన్నంగా ట్రంప్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు.

# నెతన్యాహు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌పై తీవ్ర ఆరోపణలు..!

జెరూసలెం: ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కార్యాలయ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జాచి బ్రేవర్మన్‌పై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. సైన్యంలో ఉన్నత స్థాయి అధికారిని కొన్ని వీడియోలు చూపి బెదిరించి యుద్ధ సమయంలో కీలక సమావేశాల మినిట్స్ మార్చేసినట్లు కేఎన్ఏ పత్రిక ఆరోపించింది. ఇందుకోసం బ్రేవర్మన్ సదరు ఐడీఎఫ్ అధికారికి సంబంధించిన సున్నితమైన దృశ్యాలను ప్రధాని కార్యాలయ సీసీటీవీ నుంచి సంపాదించినట్లు పేర్కొంది. ఒక ఐడీఎఫ్ అధికారికి ప్రధాని కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగినితో సంబంధం ఉంది. దీనికి సంబంధించిన వీడియోలను బ్రేవర్మన్ సంపాదించి.. సదరు అధికారిపై దర్యాప్తు చేయాలని ఐడీఎఫ్ చీఫ్ హలావీని కోరారు. దీనిపై సైన్యం దర్యాప్తు నిర్వహించి వారి సంబంధంలో అధికార దుర్వినియోగం ఏమీ లేదని తేల్చిచెప్పింది. మరోవైపు ప్రధాని కార్యాలయ సిబ్బంది సదరు మహిళా ఉద్యోగినిపై అనుమానం ఉందని చెప్పి.. ఆమె ఫోన్ తీసుకొని ఐడీఎఫ్ ఆఫీసర్‌తో సంభాషణలను వెలికి తీసినట్లు తేలింది. ఈ మొత్తం వ్యవహారంపై ఇజ్రాయెల్ పోలీసులు పీఎంవో సిబ్బందిని ఇప్పటికే ప్రశ్నించారు. దాదాపు వారం రోజుల క్రితం ప్రధాని కార్యాలయం నుంచి అత్యంత సున్నితమైన సమాచారం లీకైందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అదే సమయంలో బ్రేవర్మన్ పీఎంవో సీసీ టీవీ దృశ్యాలను యాక్సెస్ చేసినట్లు తాజాగా విమర్శలు మొదలయ్యాయి. గత వారం ఆర్మీ ఇంటెలిజెన్స్‌కు చెందిన కీలక పత్రాల్లోని సమాచారాన్ని విదేశీ పత్రికలకు లీక్ చేసిన ఆరోపణలపై నలుగురు ఐడీఎఫ్ సిబ్బంది, నెతన్యాహు ప్రతినిధిని అరెస్టు చేశారు. ఈ లీక్ కారణంగానే హమాస్‌తో బందీల విడుదల ఒప్పందం కుదరలేదన్న ఆరోపణలున్నాయి.



# మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు



**మాస్కో:** రష్యా- ఉక్రెయిన్ మధ్య సుదీర్ఘ యుద్ధం కొనసాగుతోంది. రష్యా రాజధాని మాస్కోను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ 17 డ్రోన్లను ప్రయోగించినట్లుగా రష్యా అధికారులు పేర్కొన్నారు. రామెన్‌స్కోయ్, కొలోమెన్స్కీ జిల్లాలతో పాటు మాస్కోకు నైరుతి దిశలో ఉన్న డొమోడెడోవో నగరం లో 12 డ్రోన్లను ధ్వంసం చేశామని మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. ఈ డ్రోన్ దాడుల కారణంగా మాస్కోలోని డొమోడెడోవో, జుకోవో విమానాశ్రయాలను తాత్కా లికంగా మూసివేయాల్సి వచ్చిందని పేర్కొ న్నారు. ఈ దాడుల కారణంగా ప్రాణ నష్టం జరగలేదని, క్షతగాత్రులను ఆసుపత్రికి తర లించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

# ఐపీఎస్‌లకు వార్నింగ్ ఇస్తే సుమోటోగా కేసులు: పవన్ కల్యాణ్



**విశ్వంభర, గుంటూరు:** తమది మంచి ప్రభుత్వమే కానీ.. మెతక ప్రభుత్వం కాదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు అధికారులకు వార్నింగ్ ఇస్తే సుమోటోగా కేసులు పెడతామని హెచ్చరించారు. గుంటూరులో నిర్వహించిన అటవీశాఖ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పవన్‌పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైకాపా అధ్యక్షుడు జగన్‌పై, ఆ పార్టీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల అడిగితే భద్రత కల్పిస్తామని చెప్పారు.ఇరవై ఏళ్లు అధికారంలో ఉంటామంటూ అధికారులను ఇష్టం వచ్చినట్లు ఉపయోగించుకున్నారని.. ఘోర మైన తప్పిదాలు చేయించారని జగన్‌ను ఉద్దేశించి పవన్ అన్నారు. “మాజీ సీఎం అయినా ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. మీకు బాధ్యత ఉండాలి. సప్త సముద్రాలు అవతల ఉన్నా పట్టుకొస్తామని తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడిని, రిటైర్ అయినా వదలబోమని డీజీపీని ఉద్దేశించి అన్నారు. అధికారులు తమ కర్తవ్యాలను నిర్వర్తిస్తున్నారు. మీరు బెదిరిస్తే ఎవరూ బెదిరిపోరు. అధికారులపై చిన్న గాటు పడినా చూస్తూ ఊరుకోం.. వారిపై చిన్న ఈగ వాలినా మీరే బాధ్యత వహించాలి. ప్రజాస్వామ్యాన్ని బలంగా తీసు కెళ్లాల్సిన నాయకులు.. ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఎలా?” అనినిలదీశారు.అటవీ శాఖకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని పవన్‌కల్యాణ్ తెలిపారు. అడవుల రక్షణకు అటవీ అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని చెప్పారు. “అటవీశాఖ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరిచిపోకూడదు. వివిధ వర్గాల నుంచి అటవీశాఖకు రూ.5కోట్ల విరాళం సేకరించి ఇస్తా. భవిష్యత్తులో అటవీ అమరులకు స్తూపాలు నిర్మించి నివాళులర్పిద్దాం. స్మగ్లర్ల నుంచి అడవుల రక్షణకు ఎలాంటి సహాయమైనా అందిస్తాం. అటవీశాఖలోసిబ్బంది కొరత తీవ్రంగా ఉంది.విధులు నిర్వహిస్తూ 23 మంది ప్రాణాలు కోల్పోయారు. అమరుల స్మరణకు ఫారెస్ట్ ఆఫీస్ బ్లాక్‌లకు వారి పేర్లు పెట్టాలి”అని పవన్ కల్యాణ్ అన్నారు. మహిళా భద్రత విషయంలో సమాజంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని పవన్ చెప్పారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలంటూ.. ఏపీ వ్యాప్తంగా 104 వాహన సిబ్బంది ధర్నా




**విశ్వంభర, విజయవాడ :** సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీలోని పలు జిల్లాల్లో 104 వాహన సిబ్బంది ధర్నా చేపట్టారు. అనంతపురం, విజయవాడ, గుంటూరు, అల్లూరి జిల్లా పాడేరులోని పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా వ్యాప్తంగా.. పాడేరు ఐటీడీఏ ఎదుట 104 వాహన సిబ్బంది ఆందోళన చేశారు. బకాయి వేతనాలు చెల్లించాలని, , థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేయాలని, పీహెచ్‌సీలను విలీనం చేయాలని, జీతాలు పెంచాలనే డిమాండ్లతో నిరసన తెలిపారు. నిరంతరాయంగా రోగులకు వైద్య సేవలు అందిస్తూ.. అరకొర జీతాలతో నెట్టుకొస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను పూర్తిస్థాయి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలంటూ అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద 104 ఉద్యోగులు ధర్నా చేపట్టారు. 15 ఏళ్లుగా 104లో విధులు నిర్వహిస్తున్నా వేతనాలు సకాలంలో చెల్లించటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ సంస్థలు కాకుండా ప్రభుత్వమే 104 ఉద్యోగుల నిర్వహణ చూడాలని కోరారు. బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ.. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం



**విశ్వంభర, తిరుమల :** ఆపద మొక్కుల వాడు కొలువుదీరిన తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వారాంతపు సెలవు దినాలు రావడంతో భక్తుల సంఖ్య పెరిగింది. దీంతో 25 కంపార్టుమెంట్లలో భక్తులు దర్శనానికి వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 73,558 మంది భక్తులు దర్శించుకోగా 32,675 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.79 ఆదాయం వచ్చిందన్నారు.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఇంట్లో ఐటీ తనిఖీలు.. నగదుతోపాటు విలువైన దస్త్రాలు స్వాధీనం



**విశ్వంభర, భీమవరం:**వైసీపీమాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇంట్లో ఆదాయ పన్ను అధికారులు చేపట్టిన తనిఖీలు ఆదివారం కూడా కొనసాగాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని శ్రీనివాస్ ఇంట్లో గత ఐదు రోజులుగా ఐటీ శాఖ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఇంటితోపాటు పట్టణంలోని పలువురు ప్రముఖుల ఇళ్లల్లోనూ చెన్నై నుంచి వచ్చిన అధికారులు సోదాలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే ఇంట్లో తనిఖీలు కొనసాగుతుండటంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ తనిఖీల్లో నగదుతోపాటు విలువైన ఫైల్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## తెనాలిలో వీధి కుక్కల స్వైర విహారం

**తెనాలి కొత్తపేట:** తెనాలి మండలంలో వీధికుక్కలు విజృంభిస్తున్నాయి. ఒకేరోజు ఎనిమిది మందిపై వీధి కుక్కలు దాడి చేశాయి. బాధితుల్లో ఇద్దరు మూడేళ్ల చిన్నారులు ఉన్నారు. తెనాలి పట్టణంలోని బాలాజీరావుపేట, యడ్ల లింగయ్య కాలనీ, గంగానమ్మపేట, కఠెవరం, వలివేరు ప్రాంతాల్లో పిచ్చయ్య (68), రామకృష్ణ (63) రాజశేఖర్ (49) పద్మావతి (25), శివమ్మ (50), సామ్రాజ్యం (50), షణ్ముఖ (3), టి ప్రేజీ( 3)పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ప్రస్తుతం వారంతా తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## భవన నిర్మాణ కార్మికులు ధర్నా

**ఎమ్మిగనూరు :** పట్టణంలోని సోమప్ప కూడలిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. అంతకుముందు పట్టణంలో భవన నిర్మాణ పనిముట్లతో ర్యాలీ నిర్వహించారు. భవన కార్మికుల సమస్యలు ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కోరారు. ధర్నాలో నాయకులు తిమ్మగురుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ‘అనకాపల్లి రైల్వే స్టేషన్’ను.. మోడల్ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దుతాం : ఎంపీ సీఎం రమేశ్



**విశ్వంభర, అనకాపల్లి:** ‘వికసిత్ భారత్’కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తామని ఎంపీ, రైల్వే స్టాండింగ్ బోర్డు ఛైర్మన్ సీఎం రమేశ్ తెలిపారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌ను ఆయన కూటమి నేతలతో కలిసి పరిశీలించారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న పనులను పరిశీలించారు. వేగవంతంగా పనులు చేపట్టాలని గుత్తేదారులను ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తామన్నారు. అనకాపల్లి రైల్వే స్టేషన్.. మోడల్ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. 2014-19లో లక్ష్మీదేవిపేట పైవంతెన పనుల కోసం రూ.7.50 కోట్లు విడుదల చేస్తే.. వైసీపీ హయాంలో జగన్ ఈ నిధులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. నిలిచిపోయిన ఆ పనులను పూర్తి చేస్తామన్నారు.

## వివాహేతర సంబంధంతో వివాదం యువకుడి దారుణ హత్య

**విశ్వంభర, పొన్నూరు:** మహిళతో అక్రమ సంబంధం నేపథ్యంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన గుంటూరు జిల్లా పొన్నూరు మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో జరిగింది. పొన్నూరురూరల్ ఎస్సై కిరణ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన నక్కల దేవరాజ్(34) విద్యుత్ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ములుకుదురు గ్రామానికి చెందిన ఓ మహిళతో ఆయన అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆ మహిళ అదే గ్రామానికి చెందిన మాధవ్ అనే వ్యక్తితోనూ సంబంధం పెట్టుకుంది. దీంతో ఆమె విషయంలో దేవరాజ్, మాధవ్ మధ్య కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి.ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున మాధవ్ కొంతమంది యువకులతో కలిసి దేవరాజ్‌పై ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని గ్రామశివారులోని ఓ మద్యం దుకాణం వద్ద పడేశారు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.ఈ ఘటనపై మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కిరణ్‌బాబు తెలిపారు. మరోవైపు తమకు న్యాయం చేయాలంటూ దేవరాజ్ కుటుంబసభ్యులు బాపట్ల-గుంటూరు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. మృతుడికి ఇప్పటికే వివాహమైనట్లు సమాచారం.

## ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాలకు ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు



విశ్వంభర, అమరావతి: వైద్య విభాగంలో కీలకమైన ఆవిష్కరణలు చేసిన ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావుకు సముచిత గౌరవం లభించింది. ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాలకు ఆయన పేరు పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏదైనా ప్రభుత్వ వైద్య కళాశాలకు ఎల్లాప్రగడ సుబ్బారావు పెట్టాలనే ప్రతిపాదనను పరిశీలించాలని వైద్య ఆరోగ్యశాఖను ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించిన విషయం తెలిసిందే.తాను చేసిన ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సీఎంకు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ‘ప్రపంచానికి పలు ఔషధాలు అందించిన శాస్త్రవేత్త సుబ్బారావు స్వస్థలం భీమవరం. ఆయన రాజమహేంద్రవరంలో చదువుకున్నారు. కాబట్టి కొత్తగా ఏర్పాటు చేసిన ఏలూరు, రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఒక దానికి ఆయన పేరు పెడితే సముచితంగా ఉంటుంది. తొలి టెట్రాసైక్లిన్ యాంటీ బయోటిక్ ‘అరియోమైసిన్’ను సుబ్బారావు కనుగొన్నారు. బోద, క్షయ వ్యాధుల కట్టడికి ఔషధాలు రూపొందించారు. క్యాన్సర్ చికిత్సలో కీమోథెరపీకి వాడే తొలితరం డ్రగ్‌ను అభివృద్ధి చేశారు’ అని పేర్కొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తులకు సత్కారం




**విజయనగరం :** విజయనగరం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ అతిథి గృహంలో జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తులకు కృతజ్ఞత సత్కార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్‌కు రూ.100 కోట్లతో నూతన భవనాలు మంజూరు చేయడంలో సహకరించిన పది మంది హైకోర్టు న్యాయమూర్తులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్‌లు తర్లాడ రాజశేఖర్ రావు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, నైనాల జయసూర్య, కె.సురేష్ రెడ్డి, బి.కృష్ణ మోహన్, కె.రామకృష్ణ ప్రసాద్, కె.మన్మథ రావు, చీమలపాటి రవి, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దోనాడి రమేష్, ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయికళ్యాణ్ చక్రవర్తి, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎస్.పి.వకుల్ జిందాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.హరీష్, ప్రముఖ న్యాయవాదులు హాజరయ్యారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కంచిలి: శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలంలో ఆదివారం సంత వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 5 గంటలకు గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఒడిస్సా, కుర్ధ జిల్లా, బిరిబంద్ గ్రామానికి చెందినవాడిగా తెలుస్తోంది. వ్యాపారం నిమిత్తం కంచిలికి వచ్చి ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాలువలో పడి వివాహిత మృతి

**మోపిదేవి:** స్థానిక కోడూరు గ్రామంలోని పంట కాలవలో పడి వివాహిత మృతి చెందిన విషాద సంఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమణ అనే మహిళ నిత్యం నిర్వహించుకునే పనులలో భాగంగా బట్టలు ఉతకడానికి కాలవలోకి దిగింది. ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో కాలవలో పడి మృతి చెందింది. కాలవలో చీర పైకి కనపడడంతో అటువైపు వెళ్తున్న తెదేపా నాయకుడు బడే వీరబాబు, స్థానికులు చూసి మృత దేహాన్ని గుర్తించి కాలవలో నుంచి బయటకు తీశారు. మృతురాలకి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

## సాగునీటితో అవస్థలు



**మక్కువ:** ఖరీఫ్ సీజన్‌లో పంట పొలాలకు చేరాల్సిన సాగునీటి జాడ కనిపించలేదు. పంట చేతికందే దశలో నీరు చేరడంతో రైతులతో పాటు, పగరజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మక్కువ మండలం లోని వెంగళరాయ సాగర్ జలాశయం పరిధిలో ఎల్‌బీసీ పరిధిలో 12ఎల్ కాలువలో సాగునీరు నిండుగా పారుతోంది. గతంలో ఈకలువలో చుక్క నీరు కనిపించకపోవడంతో రైతులు మో టార్లు, చెరువులు, వర్షాధారంతో పంటలు పండించారు. ఎగువ ప్రాంతాల్లో పంట పండిన తరువత దిగువ ప్రాంతానికి సాగునీరు మళ్లిస్తున్నారు. కోన, గోపాల పురం తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం వరి పంట కోతలు కోస్తున్నారు. ఈ సమయం లో పంట పొలాలకు సాగునీరు రావడం తో పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

### ఇళ్లల్లోకి చేరుతున్న సాగునీరు

మండలంలోని కోన గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున కాలువ గట్లుపై నుంచి నీరు పారుతోంది. దీంతో ఎస్టీ కాలనీలలో పలు ఇళ్లపైకి నీరు చేరి నీట మునిగాయి. అదే వీధిలో శ్రీకాంత్ అనే వ్యక్తి కర్రల మిషన్, మోటార్లు, కలప నీట ముని గిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ఇళ్లల్లోకి నీరు చేరడంతో నీటిలో విషస ర్పాలు వస్తున్నాయని ప్రజలు భయాందో ళనలకు గురవుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించటంలేదని వాపోతున్నారు.

## జగన్.. ఏపీ అసెంబ్లీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలి



**విశ్వంభర, విజయవాడ:** ఏపీ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ప్రభుత్వం తొలిరోజే పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో వైసీపీ అధినేత జగన్ ఏపీ అసెంబ్లీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టుల తరఫున ప్రతినిధులు ఎవరూ లేకపోవడంతో అధికార పార్టీని ప్రశ్నించే వారే లేరని తెలిపారు. టీడీపీ,బీజేపీ, జనసేన కూటమిగా అధికార పక్షంలో ఉన్నారని చెప్పారు. వైకాపా ప్రతిపక్ష హోదాలో అసెంబ్లీలో ప్రజల తరఫున సమావేశాలకు హాజరుకావాలని సూచించారు. దురదృష్టవశాత్తు రాష్ట్ర రాజకీయాల్లో వ్యక్తిగత, మహిళలపై విమర్శలు ఎక్కువైపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత విమర్శలు ఎవరు చేసినా.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార పార్టీ తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించాలంటే జగన్ తప్పనిసరిగా అసెంబ్లీకి రావాలన్నారు.

## సామాజిక మాధ్యమాలపై కేసుల్లో తొలి ముద్దాయిగా జగన్‌ను చేర్చాలి: జీవీ ఆంజనేయులు




**విశ్వంభర, అమరావతి:** ఏపీలో ఐదేళ్ల పాటు శాంతిభద్రతలను రౌడీ మూకల చేతుల్లో వైసీపీ అధినేత జగన్ పెట్టారని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. కేసుల నుంచి తప్పించుకోవడానికే జగన్ మేకపోతు గాంభీర్యాలు ప్రదర్శిస్తున్నారని ఎక్స్ వేదికగా విమర్శించారు. సోషల్ మీడియాలో విషం నింపి ఒకతరం భవిష్యత్‌ను నాశనం చేశారని మండిపడ్డారు. సొంత తల్లి, చెల్లిపై తప్పుడు పోస్టులు పెట్టించిన హీన మనస్తత్వం గల వ్యక్తి అని ఎద్దేవా చేశారు. సామాజిక మాధ్యమాలపై కేసుల్లో తొలి ముద్దాయిగా జగన్‌ను చేర్చాలన్నారు. ఆయన చేసిన విద్వేషపు వ్యాఖ్యలు, పోస్టులపై కేసులు పెట్టాలన్నారు. పేదల ఇళ్లు, జగనన్న కాలనీల పేరిట దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న అఘోరి.. లోక కల్యాణం కోసం కృషి అంటూ ప్రకటన..!



**శ్రీశైలం:** ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన అఘోరీ ఆదివారం ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో ప్రత్యక్ష మయ్యారు. కార్తీక మాసంలో ప్రముఖ శైవ క్షేత్రాలను వరుసగా సందర్శిస్తున్న అఘోరీ శ్రీశైలం శ్రీ మల్లిఖార్జున స్వామిని దర్శించుకున్నారు. అఘోరీ దిగంబరంగా స్వామివారిని దర్శించుకునే ప్రయత్నం చేయగా ఆలయ అధికారులు అడ్డుకున్నారు.వస్త్ర ధారణ లేకుండా దర్శనానికి అనుమతించేది లేదని ముఖద్వారం వద్ద అఘోరిని ఆలయ సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు నిలిపేశారు. దాంతో ఆమె వస్త్రధారణ చేసుకుని స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయంలోకి ప్రవేశించిన అఘోరీని భక్తులు ఆసక్తిగా తిలకించారు. చాలా మంది ఆమె ఆశీర్వాదం కోసం ప్రయత్నించారు. మహిళా పోలీసులు, ఆలయ సిబ్బంది ఆమెకు దగ్గరుండి స్వామివారి దర్శనం కల్పించారు.ఈ సందర్భంగా అఘోరీ మాట్లాడుతూ.. సనాతన ధర్మ పరిరక్షణకు గురువుల ఆదేశానుసారం దేశంలో పర్యటిస్తున్నానని చెప్పారు. మహిళలపైన, చిన్నారులపైన, హిందూ దేవాలయాలపైన దాడులు నివారించబడేందుకు, లోక కల్యాణం కోసం తాను కృషి చేస్తున్నానని అన్నారు. కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రాలను సందర్శిస్తున్నానని తెలిపారు.

# రద్దు దిశగా ఛాంపియన్స్ ట్రోఫీ?

## ఐసీసీ కీలక నిర్ణయం తీసుకోనుందా?

**ముంబయి:** వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. తాజాగా వస్తోన్న కథనాల ప్రకారం ఆ టోర్నీని ఐసీసీ రద్దు చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. భారత్ ఇప్పటికే అక్కడికి వెళ్లేది లేదని స్పష్టంగా చెప్పడంతో.. టీమ్ఇండియా మ్యాచుల షెడ్యూల్ క్లిష్టంగా మారింది. మరోవైపు ఛాంపియన్స్ ట్రోఫీని పాక్‌లోనే నిర్వహిస్తామని పీసీబీ పట్టుదలగా ఉంది. దీంతో షెడ్యూలింగ్‌లో ఇబ్బందులు వస్తుండటంతో ఈ టోర్నీనే రద్దు చేసేస్తే మంచిదనే అభిప్రాయం ఐసీసీ వర్గాల్లో నెలకొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వంద రోజుల కౌంట్‌డౌన్ ప్రారంభం కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో టోర్నీని రద్దు చేయడం లేదా వాయిదా వేయడంపై ఐసీసీ దృష్టిసారించినట్లు సమాచారం. పైకి షెడ్యూల్ కారణమని చెబుతున్నప్పటికీ.. హైబ్రిడ్ మోడల్‌కు పీసీబీ అంగీకరించకపోవడం, భారత జట్టును తాము పాకిస్థాన్‌కు పంపించబోమని బీసీసీఐ తేల్చి చెప్పడంతో ఐసీసీ ఈ నిర్ణయం తీసుకొనేందుకు మొగ్గు చూపిస్తోందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. ''ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. ఆతిథ్య దేశంతోపాటు పాల్గొనే జట్లతో సంప్రదింపులు జరుపుతున్నాం. షెడ్యూల్‌పై చర్చిస్తూనే ఉన్నాం. ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే దానిని అధికారికంగా ప్రకటిస్తాం. మరోవైపు షెడ్యూలింగ్ కుదరకపోతే టోర్నీని రద్దు చేయడం లేదా వాయిదా వేసే అవకాశాలూ లేకపోలేదు'' అని ఐసీసీ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 మధ్య ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణకు ముసాయిదా షెడ్యూల్‌ను ఇప్పటికే ఐసీసీకి పీసీబీ అందజేసింది. అయితే.. భారత మ్యాచ్‌ల కోసం హైబ్రిడ్ మోడల్‌ను తీసుకురావాలన్న ప్రతిపాదనలూ వచ్చాయి. వీటికీ పీసీబీ అంగీకరించలేదు. ఈ నేపథ్యంలోనే టోర్నీ నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతోంది.





## స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకున్న దక్షిణాఫ్రికా..

# పోరాడి ఓడిన భారత్

**గెబేహా:** భారత్‌తో జరుగుతున్న నాలుగు టీ20ల సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 3 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 124 పరుగులకు పరిమితమైంది. హార్దిక్ పాండ్య (39: 45 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్) రాణించాడు. స్వల్ప లక్ష్య ఛేదనలో సఫారీ జట్టు చెమటోడ్చి నెగ్గింది. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఆ జట్టు 19 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆ జట్టులో స్టబ్స్ (47*) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి అద్భుతంగా చెలరేగాడు. 4 ఓవర్లలో కేవలం 17 పరుగులే ఇచ్చి 5 వికెట్లు తీశాడు. అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్ చెరో వికెట్ పడగొట్టారు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ ఇండియా.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. తిలక్ వర్మ (20), అక్షర్ పటేల్ (27), హార్దిక్ పాండ్య (39*) మినహా మిగతా వారెవరూ రాణించలేదు. దక్షిణాఫ్రికా బౌలర్లలో జాన్‌సెన్, కొయెట్జీ, సైమ్‌లేన్, మార్‌క్రమ్, పీటర్ తలో వికెట్ తీశారు.తొలి మ్యాచ్‌లో చెలరేగిన బ్యాటర్లు ఈసారి పేలవ ప్రదర్శన చేశారు. 15 పరుగులకే టీమ్ ఇండియా కీలకమైన 3 వికెట్లను కోల్పోయింది. తొలి మ్యాచ్‌లో శతక్కొట్టిన సంజు శాంసన్.. ఈ మ్యాచ్‌లో పరుగులేమీ చేయకుండానే వెనుదిరిగాడు. జాన్‌సన్ వేసిన తొలి ఓవర్ మూడో బంతికే బౌల్డయ్యాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (4) కూడా విఫలమయ్యాడు. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (4) కూడా నిరాశపరిచాడు. దీంతో భారత్ జట్టు ఒక్కసారిగా కష్టాల్లోకి కూరుకుపోయింది. ఒక ఫోర్, సిక్సర్‌తో టీమ్ ఇండియాలో జోష్ పెంచిన తిలక్ వర్మ (20)ను మార్‌క్రమ్ పెవిలియన్‌కు చేర్చాడు.ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్ (27) నిలదొక్కుకుంటున్న తరుణంలో అనవసర పరుగుకు ప్రయత్నించి రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య (39*) కీలక ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ మోస్తరు స్కోరు చేయగలిగింది.

# విండీస్‌పై సెంచరీ.. టీ20 క్రికెట్‌లో ఫిల్ సాల్ట్ అరుదైన ఫీట్

**లండన్**



ఇంగ్లండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ అద్భుత శతకంతో వెస్టిండీస్‌పై మెరిశాడు. 53 బంతుల్లోనే సెంచరీ సాధించి ఇంగ్లండ్‌ను గెలిపించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ కేవలం రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి 16.5 ఓవర్లలో విజయం సాధించింది. ఓపెనర్ విల్ జాక్స్ (17)తో కలిసి తొలి వికెట్‌కు ఫిల్ సాల్ట్ (103*: 54 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) 73 పరుగులు జోడించాడు. అయితే, జాక్స్‌తోపాటు కెప్టెన్ జోస్ బట్లర్ (0) వెనువెంటనే ఔట్ చేయడం మినహా విండీస్‌కు మరే సంతోషం దక్కలేదు. జాకబ్ బెతెల్ (58*)తో కలిసి మూడో వికెట్‌కు 107 పరుగులు జోడించిన సాల్ట్ ఇంగ్లండ్‌ను విజయతీరాలకు చేర్చాడు. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇంగ్లండ్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

**కెరీర్‌లో మూడో శతకం..**

టీ20 కెరీర్‌లో ఫిల్ సాల్ట్ మూడో సెంచరీ బాదాడు. అయితే, ఈ మూడు సెంచరీలూ వెస్టిండీస్‌పైనే చేయడం విశేషం. ఇలా పొట్టి ఫార్మాట్‌లో అన్ని సెంచరీలను ఒకే జట్టుపై సాధించిన ఏకైక బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 34 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లే ఆడిన సాల్ట్ మూడు సెంచరీలు, మూడు హాఫ్ సెంచరీలు సాధించాడు. అతడి అత్యధిక వ్యక్తిగత స్కోరు 119 పరుగులు. వరుసగా రెండు మ్యాచుల్లోనూ సెంచరీలు సాధించిన బ్యాటర్ల జాబితాలోనూ ఉన్నాడు. విండీస్‌పై 2023 డిసెంబర్ 16, డిసెంబర్ 19న జరిగిన రెండు టీ20ల్లో సెంచరీలు చేశాడు. ఆస్ట్రేలియా ఆటగాడు గ్లెన్ మాక్స్‌వెల్ (భారత్‌పై), విండీస్ బ్యాటర్ ఇవిన్ లూయిస్ (భారత్‌పై), యూఏఈ ప్లేయర్ మహ్మద్ వసీమ్ (ఐర్లాండ్‌పై), సెర్బియా ఆటగాడు లెస్లీ దన్బార్ (బల్గేరియాపై) ఒకే జట్టుపై రెండేసి శతకాలు సాధించారు.

# కోహ్లితో బ్యాటింగ్ చేయాలనుంది

**నవీనుల్ హక్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**ముంబయి:** భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి, అఫ్గానిస్థాన్ బౌలర్ నవీనుల్ హక్ మధ్య జరిగిన వాగ్వాదం ఐపీఎల్‌లో అత్యంత వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ముంబయితో జరిగిన మ్యాచ్‌లో విరాట్ తక్కువ స్కోరుకే ఔటైనప్పుడు నవీనుల్ హక్ 'మ్యాంగో' పోస్టు పెట్టాడు. అది కూడా విరాట్ అభిమానుల్లో ఆగ్రహం తెప్పించింది. అయితే, గత వన్డే ప్రపంచ కప్ సమయంలో వారిద్దరూ కలిసి మాట్లాడుకుంటున్న వీడియోలు వైరల్‌గా మారాయి. తమ మధ్య జరిగిన ఘటనకు అక్కడితో ఫుల్‌స్టాప్ పెట్టినట్లైంది. ఇప్పుడు మరోసారి నవీనుల్ హక్ వార్తల్లో నిలిచాడు. లఖ్‌నవూ రిటైన్ జాబితాలో అతడికి చోటు దక్కలేదు. దీంతో మెగా వేలంలో తన పేరును నమోదు చేసుకున్నాడు. ఒకవేళ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తీసుకుంటే.. వెళ్తావా? లేదా? అనే ప్రశ్నలు నవీనుల్ హక్‌కు ఎదురయ్యాయి. కోహ్లితో బ్యాటింగ్ లేదా బౌలింగ్ చేయాలనుందా? అనే ప్రశ్నకూ సమాధానం ఇచ్చాడు. ''నేను కోహ్లికి బౌలింగ్ చేశా. ఇక అతడితో కలిసి బ్యాటింగ్ చేయడాన్ని ఎంచుకుంటా'' అని వెల్లడించాడు. దీంతో కోహ్లితో తనకెలాంటి సమస్యలు లేవని చెప్పకనే చెప్పాడు. మరి ఆర్సీబీ నవీనుల్ హక్‌ను వేలంలో తీసుకుంటుందో ? లేదో చూడాలి. నవంబర్ 24, 25 తేదీల్లో మెగా వేలం జరగనుంది. అఫ్గానిస్థాన్‌కు చెందిన 29 మంది ప్లేయర్లు మెగా వేలంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

## టెస్ట్ జట్టుకు కోచ్ మార్పు ప్రచారం

# నిజం కాకపోవచ్చు

**ఆకాశ్ చోప్రా**

**ముంబయి:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు విఫలమైతే బీసీసీఐ జట్టుకు ఫార్మాట్లను బట్టి కోచ్‌లను నియమిస్తుందనే ప్రచారం జోరందుకొంది. దీనిపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా స్పందించాడు. అతడు తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ '' బోర్డర్--గావస్కర్ ట్రోఫీలో భారత్ జట్టు విఫలమైతే కోచ్‌గా గౌతం గంభీర్ ను మార్చేస్తారని ప్రచారం జరుగుతోంది. అది పూర్తిగా పుకారే అని నేను అనుకొంటున్నాను. ఫార్మాట్ల ఆధారంగా కోచ్‌లను నియమిస్తారని చెప్పడం తొందరపాటే అవుతుంది. తప్పుడు ఉద్దేశాలతోనే ఇలాంటి ప్రచారాలు చేపడతారు. గంభీర్ హెడ్‌కోచ్‌గా ఇప్పుడే బాధ్యతలు చేపట్టాడు. అలాంటప్పుడు ఆటగాళ్లు బాగా ఆడకపోతే కోచ్ తొలగించడం అనే జరగదు. అది పద్ధతి కాదు. గంభీర్ అడిగినవి మొత్తం బీసీసీఐ సమకూర్చింది. గతంలో అతడే జట్టుకు భారతీయ కోచ్‌లు ఉండాలని చెప్పాడు. కానీ, తాను మాత్రం రేయాన్, మోర్కెల్‌ను అడిగాడు. యాజమాన్యం అంగీకరించింది. శ్రీలంక సిరీస్‌కు సీనియర్లను అడిగాడు.. బీసీసీఐ ఓకే అంది. పిచ్‌ల తయారీలో కూడా స్వేచ్ఛను ఇచ్చింది. ఇంత జరిగాక గంభీర్ కచ్చితంగా ఫలితాలకు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది'' అని పేర్కొన్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌ను భారత్ ఓడిపోయింది. దీంతో గౌతం గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. తాజా ఓ హిందీ పత్రిక బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భారత్ ఓటమి పాలైతే.. గంభీర్‌ను టెస్ట్ జట్టు కోచ్‌గా తొలగిస్తారని పేర్కొంది. ప్రస్తుత నేషనల్ క్రికెట్ అకాడమీ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌కు ఆ బాధ్యతలు అప్పగిస్తారని పేర్కొంది. ప్రస్తుతం అతడు దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న టీ20 జట్టుకు స్టాండ్ ఇన్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

# చౌడూరి నరసింహా రావుకు ప్రజాకవి కాళోజీ స్మారక జాతీయ ప్రతిభా పురస్కారం

**విశ్వంభర, హైదరాబాద్:** టెలివిజన్ రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో హైదరాబాద్ రవీంద్ర భారతి లో నిర్వహిం చిన ప్రజాకవి కాళోజీ స్మారక జాతీయ స్థాయి కవితల పోటీలు 2024 లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుండి 150 మంది కవులు, కవయిత్రులు పాల్గొన్నారు. ఈ పోటీలు రోజంతా ఎంతో ఉత్సాహంగానూ, ఉల్లాసంగానూ, ఉత్తేజం గానూ కొనసాగాయి. ఈ పోటీలలో ఆరుగురు కవులు బహుమతులు సాధించారు. వారిలో న్యూ నాగోల్ కు చెందిన ప్రముఖ కవి, రచయిత, విమర్శ కుడు, విశ్లేషకుడు వ్యక్తిత్వవికాస నిపుణుడు చౌడూరి నరసింహా రావు కు ప్రథమ బహుమతి రూ. 3116 ల నగదుతో బాటు ప్రజాకవి కాళోజీ స్మారక ప్రతిభా పురస్కారం కూడా లభించింది. ఈ కార్యక్రమానిక తెలుగు టెలివిజన్ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షు లు అనేక నంది పురస్కారాల ను పొందిన శ్రీ నాగబాల సురేష్ కుమార్ అధ్యక్షత వహించగా, ప్రముఖ కవి, సినీ గేయ రచయిత నంది అవార్డు గ్రహీత డాక్టర్ సాధనాల వేంకటస్వామి నాయుడు సమన్వయకర్తగా సమర్థవంతంగా వ్యవహరించగా, కవి, కర్రా నరేందర్ రెడ్డి, తెలుగు టి.వి. రచయితల సంఘం కార్యదర్శి, రచయిత శ్రీ దక్షిణామూర్తి, భారత్ కల్చరల్ అకాడమీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ దర్శక నిర్మాత ప్రభాకర జైనీ, కవి మౌనశ్రీ మల్లిక్, నంది అవార్డు గ్రహీత, టెలిఫిల్మ్ డైరెక్టర్ డాక్టర్



దీపక్ న్యాతి, ప్రముఖ కవి గుళ్ళా పల్లి రాజేంద్ర ప్రసాద్, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం గౌరవ సలహాదారు, ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ వెనిగండ్ల రాంబాబు, ప్రముఖ రచయిత్రులు శ్రీమతి శశి బాల, సుధ కొలచిన గారల సమ క్షంలో చౌడూరి నరసింహారావు ను శాలువా, కాళోజీ జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సభ్యులందరి కరతాళ ధ్వనుల మధ్య ఘనంగా సత్కరించారు. ప్రథమ బహుమతిని ప్రతి భాపురస్కారాన్ని అందుకున్న సందర్భంగా చౌడూరి నరసింహారావు మాట్లాడుతూ ఈ కాళోజీ స్మారక పురస్కారం తనకు రావడం, మహామహులెం దరో తలపడిన ఈ కవితల పోటీలో తన రచన" మనిషి వికసించాలి. మార్పు సాధించాలి అనే కవిత కు ప్రథమ బహుమతి లభించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని, ఈ బహుమతి పురస్కారం తనకు ఇంకా బాధ్యతను పెంచిందని, తనను సముచి తంగా సత్కరించిన నిర్వాహకులకు చౌడూరి తమ కృతజ్ఞతలు తెలిపారు. తన తోటి విజేతలకు అభినందన లు తెలియజేశారు. మా కాలనీ వాస్తవ్య లైన చౌడూరి నరసింహారావు కి ఇంత గొప్ప బహుమతి, పురస్కారం లభించడం మాకెంతో సంతోషాన్ని కలిగించిందని, భవిష్యత్తులో మా చౌడూరి మరిన్ని అవార్డులు, రికార్డులు సాధించాలని, న్యూ నాగోలుకు చెందిన సాహితీ మిత్రులు, శ్రేయోభిలాషులు, చౌడూరి కళా పీఠం కార్యవర్గ సభ్యులు తమ ఆకాంక్షను, హర్షాన్ని వ్యక్తం చేశారు.



# చక్కని అనుభూతుల మధ్య ముగిసిన సేవా ప్రదర్శిని

**విశ్వంభర, హైదరాబాద్:**



దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న సైనిక వీరుల సేవలు చిరస్మరణీయం అని పాట్నా హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి అభిప్రాయపడ్డారు. అటువంటి సైనిక వీరులకు వందనం చేస్తూ రూపొందించిన పరమవీర్ వందనం కార్యక్రమం చక్కటి చొరవ అని ఆయన ప్రశంసించారు. హిందూ సేవఆధ్యాత్మిక ఫౌండేషన్ (హెచ్ ఎస్ ఎస్ ఎఫ్) మరియు ఐ ఎం సి టి ఎఫ్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సేవా ప్రదర్శిని కార్యక్రమం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ముగిసింది. మూడు రోజుల కార్యక్రమంలో చివరి రోజున సైనిక వీరుల సేవలను గుర్తించుకుంటూ పరమవీర్ వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ విశిష్ట కార్యక్రమానికి జస్టిస్ నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు. సమరసత వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్ వక్తగా విచ్చేశారు. పరమవీర్ చక్ర అవార్డు గ్రహీత సుబేదార్ మేజర్ యోగేంద్ర సింగ్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమానికి శోభ కల్పించారు. ఈ తరం యువత, విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు,, విలువల పట్ల అవగాహన కల్పించేందుకు వివిధ అంశాల పట్ల వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భారతదేశ సంప్రదాయంలో కుటుంబ విలువలు, సామాజిక చింతన ముఖ్యం అని చాటి చెప్పేందుకు వీటిని ఉద్దేశించారు. ఇటువంటి వందనం కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువతకు ఆయా అంశాల పట్ల చక్కటి అవగాహన కల్పించేందుకు వీలవుతున్నది. ఆదివారం ఉదయం తల్లితండ్రుల గొప్పతనాన్ని చాటి చెప్పేలా మాత పితృ వందనం నిర్వహించారు. తల్లిదండ్రులను పూజించడం ద్వారా కుటుంబ విలువలను తెలుసుకునేందుకు వీలవుతుంది. మాతా అమృతానందమయి ట్రస్ట్ తెలంగాణ ఇన్ ఛార్జ్ స్వామిని సువిద్యామిత్ర ముఖ్యఅతిథిగా విచ్చేశారు. స్పిరిచువల్ సైంటిస్ట్ వి ఎస్ ఆర్ మూర్తి వక్త గా హాజరై చక్కటి విలువలు తెలిపేలా ప్రసంగించారు. సేవా ప్రదర్శిని కార్యక్రమంలో 180కు పైగా సేవా సంస్థలు స్టాల్స్ ను ఏర్పాటు చేశాయి. వివిధ రంగాలలో సమాజం కోసం అద్భుత సేవలు అందిస్తున్న సేవా సంస్థలు ఇక్కడ కొలువు తీరాయి. ఆయా సంస్థల సేవలు పట్ల అవగాహన కల్పించేలా ప్రదర్శనలు, కరపత్రాలు, సమాచారం అందించారు. తద్వారా కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థులు, యువత మరియు సందర్శకులకు సేవా కార్యక్రమాల పట్ల చక్కటి అవగాహన కలుగుతున్నది. ఆదివారం మధ్యాహ్నం లో సామాజిక సేవ చేస్తున్న వారికి మానవీయం పేరుతో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఆయా సంస్థలు, వ్యక్తులు చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ ఈ తరం యువతకు పరిచయం చేశారు. రాష్ట్రీయ సేవా భారతి ట్రస్టీ ఎక్కా చంద్రశేఖర్ ప్రసంగిస్తూ సేవా కార్యక్రమాల పట్ల యువతలో అభిరుచి ఏర్పడాలని అభిలషించారు. మూడు రోజులు పాటు జరిగిన సేవా ప్రదర్శిని కార్యక్రమానికి వేల సంఖ్యలో సందర్శకులు విచ్చేశారు. అనేక వందన కార్యక్రమాలు, సేవ స్టాల్స్ ని సందర్శించారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన హెచ్ ఎస్ ఎస్ ఎఫ్ మరియు ఐ ఎం సి టి ఎఫ్ నిర్వాహకుల్ని అభినందించారు.

# కెనడాలో యథావిధిగా సేవలు: ఎస్‌బీఐ చీఫ్

**ముంబయి:**

కెనడాలో హిందూ దేవాలయాలే లక్ష్యంగా దాడులు, ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణిస్తున్న నేపథ్యంలో భారతీయ స్టేట్ బ్యాంక్ తాజాగా ఓ ప్రకటన చేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ అక్కడ ఎస్‌బీఐ సేవలపై ఎటువంటి ప్రభావం చూపించలేదని, కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయని తెలిపింది. ''వినియోగదారులు, నియంత్రణ సంస్థల విధానంలో ఎటువంటి మార్పు కనపించలేదు. కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. మేం అక్కడ స్థానిక బ్యాంకులలో ఒకటిగా పరిగణిస్తున్నట్లు భావిస్తున్నా. మా వాణిజ్య కార్యకలాపాలు స్థానిక వాతావరణంలోనే ఉంటాయి'' అని ఎస్‌బీఐ ఛైర్మన్ సీఎస్ శెట్టి పేర్కొన్నారు. కెనడాలో 1982 నుంచి ఎస్‌బీఐ సేవలు అందిస్తోందని.. అందుకే లోకల్ బ్యాంక్‌గా పరిగణిస్తున్నారని చెప్పారు. కీలక సేవల ద్వారా ఆదాయ వనరులను పెంచుకోవడానికి అన్ని మార్గాల్లో ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. టొరంటో, బ్రాంప్టన్, వాంకోవర్‌లతో పాటు మొత్తంగా కెనడాలో ఎనిమిది బ్రాంచీల ద్వారా ఎస్‌బీఐ సేవలందిస్తోంది. ఇదిలాఉంటే, భారత్‌పై కెనడా చేసిన ఆరోపణలతో దాదాపు ఏడాది కాలంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు




దెబ్బతిన్నాయి. ఇటీవల దౌత్యవేత్తలపై బహిష్కరణ వేటు వేయడంతో ఇవి మరింత క్షీణించిన సంగతి తెలిసిందే.

# కిరణ్ అబ్బవరం "క" మూవీ టీమ్‌ను అభినందించిన మెగాస్టార్ చిరంజీవి



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం లెటెస్ట్ మూవీ "క" బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. దీపావళి విన్నర్ గా నిలిచిన ఈ సినిమాకు మెగాస్టార్ చిరంజీవి అభినందనలు అందించారు. క సినిమాను చూసిన మెగాస్టార్ మూవీ టీమ్ కు తన బ్లెస్సింగ్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా చిరంజీవి గారికి తమ కృతజ్ఞతలు తెలిపారు క సినిమా టీమ్. "క" సినిమాలో తన్వీరామ్, నయన్ సారిక హీరోయిన్స్ గా నటించారు. దర్శకద్వయం సుజీత్, సందీప్ ఈ సినిమాను రూపొందించారు. "క" సినిమాను శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మించారు. తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి రిలీజ్ చేశారు. ఆడియెన్స్ నుంచి సూపర్బ్ రెస్పాన్స్ తో "క" సినిమా దిగ్విజయంగా రెండో వారంలోకి అడుగుపెట్టింది.

**నటీనటులు:** కిరణ్ అబ్బవరం, నయన్ సారిక, తన్వీ రామ్, అచ్యుత్ కుమార్, రెడిన్ కింగ్స్ లే, బలగం జయరాం, తదితరులు, టెక్నికల్ టీమ్, ఎడిటర్ - శ్రీ వరప్రసాద్, డీవోపీస్ - విశ్వాస్ డానియేల్, సతీష్ రెడ్డి మాసం, మ్యూజిక్ - సామ్ సీఎస్, ప్రొడక్షన్ డిజైనర్ - సుధీర్ మాచర్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - చవాన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ - రితికేష్ గోరక్, లైన్ ప్రొడ్యూసర్ - కేఎల్ మదన్, సీయివో - రహస్య గోరక్ (కేఏ ప్రొడక్షన్స్), కాస్ట్యూమ్స్ - అనూష పుంజ్ల, మేకప్ - కొవ్వాడ రామకృష్ణ, ఫైట్స్ - రియల్ సతీష్, రామ్ కృష్ణన్, ఉయ్యాల శంకర్, కొరియోగ్రఫీ - పొలాకి విజయ్, వీఎఫ్ఎక్స్ ప్రొడ్యూసర్ -ఎంఎస్ కుమార్, వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ - ఫణిరాజా కస్తూరి, కో ప్రొడ్యూసర్స్ - చింతా వినీషా రెడ్డి, చింతా రాజశేఖర్ రెడ్డి, ప్రొడ్యూసర్ - చింతా గోపాలకృష్ణ రెడ్డి, పీఆర్ఓ - జీఎస్ కే మీడియా (సురేష్ - శ్రీనివాస్), రచన దర్శకత్వం - సుజీత్, సందీప్.



# సుమంత్ ప్రభాస్, సుభాష్ చంద్ర, రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ సినిమా పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభం

సుమంత్ ప్రభాస్, సుభాష్ చంద్ర, రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ సినిమా పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభం తన తొలి మూవీ 'మేం ఫేమస్'తో లీడ్ యాక్టర్, దర్శకుడిగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా తన రెండో మూవీని అనౌన్స్ చేశారు. ఈ కొత్త మూవీ రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ మేడిన్ వెంచర్. MR ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్‌లతో పాపులరైనా సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈరోజు రామానాయుడు స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు హీరో శ్రీవిష్ణు క్లాప్ కొట్టారు, సురేష్‌బాబు కెమెరా స్విచాన్ చేశారు. దర్శకులు శ్రీకాంత్ ఓదెల, శౌర్యువ్, మహేష్ బాబు పి తొలి షాట్‌కి దర్శకత్వం వహించారు. స్క్రిప్ట్‌ని అల్లు అరవింద్ మేకర్స్‌కి అందజేశారు. ఈ వేడుకకు సునీల్ నారంగ్ కూడా హాజరయ్యారు. యంగ్ టీం సక్సెస్ ఫుల్ గా ముందుకు సాగాలని అతిథులందరూ ఆశీర్వదించారు. మేం ఫేమస్ సక్సెస్ తర్వాత సుమంత్ ప్రభాస్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసం రకరకాల కథలు విన్నారు. అయితే, అందులో ఏదీ కనెక్టింగ్ గా అనిపించలేదు. ఒకానొక సమయంలో, తనే కథను రాసి దర్శకత్వం వహించాలని కూడా ఆలోచించారు. ఇలాంటి సమయంలో ఈ స్క్రిప్ట్‌తో సుభాష్‌చంద్ర అతనిని సంప్రదించినప్పుడు ఇది పర్ఫెక్ట్ స్క్రిప్ట్ అని భావించారు. ఈ ప్రాజెక్ట్‌కి ఆమోదం తెలిపే ముందు ఈ యంగ్ హీరో దాదాపు 86కి పైగా కథలు విన్నారు, తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను ఎంచుకోవడంలో అతను తీసుకునే కేర్ ని ఇది హైలైట్ చేస్తుంది. నిధి ప్రదీప్ హీరోయిన్ గా పరిచయం అవుతోంది. జగపతి బాబు మేజర్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, వైవా రాఘవ్, రీను & రోహిత్ కృష్ణ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీ యూత్‌ఫుల్ మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ, ఇది బిగ్ స్క్రీన్స్ కు సరికొత్త ఎక్స్ పీరియన్స్ తీసుకువస్తుంది. పశ్చిమగోదావరి ప్రాంతంలోని విజువల్ బ్యూటీని ప్రజెంట్ చేసే ఈ చిత్రాన్ని భీమవరం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించనున్నారు.

టీమ్ ఇప్పటికే కాస్టింగ్ కాల్‌ను అనౌన్స్ చేయగా, దీనికి ఔత్సాహిక నటీనటుల నుండి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రానికి సాయి సంతోష్ సినిమాటోగ్రఫీని, నాగ వంశీ కృష్ణ సంగీత అందిస్తున్నారు, ప్రొడక్షన్ డిజైనర్ ప్రవల్య, ఎడిటర్ అనిల్ కుమార్ పి. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. మూవీ లాంచింగ్ ఈవెంట్ లో హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ.. ఈ ఈవెంట్ వచ్చి మమ్మల్ని బ్లెస్ చేసిన గెస్ట్ లందరికీ చాలా థాంక్స్. నేను చేసిన ఫస్ట్ సినిమా 'మేం ఫేమస్' నీ అందరూ చాలా గొప్పగా ఆదరించారు. నెక్స్ట్ ఎలాంటి ప్రాజెక్ట్ చేయాలని ఏడాదిన్నరగా అలోచించాను. చాలా కథలు విన్నాను. కథలు ఎక్కడో మనసుకు నచ్చలేదు. అలాంటి సమయంలో ఈ సినిమా రైటర్, డైరెక్టర్ సుభాష్ చంద్ర వచ్చి ఈ కథ చెప్పారు. ప్యూర్ ఆంధ్ర, భీమవరం వైబ్ లో అద్భుతంగా వుంది. అభినవ్ అన్న చాలా పాషనెట్ ప్రొడ్యూసర్. చాలా మంచి కథ తీసుకోచ్చారు. ఈ సినిమాని అందరూ ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అందరికీ థాంక్ యూ సో మచ్' అన్నారు. హీరోయిన్ నిధి ప్రదీప్.. అందరికీ నమస్కారం. ఈ ప్రాజెక్ట్ లో పార్ట్ అవ్వడం చాలా ఆనందంగా ఉంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్, ప్రొడ్యూసర్ గారికి థాంక్యూ సో మచ్. చాలా మంచి స్క్రిప్ట్ ఇది. ఈ సినిమాతో హీరోయిన్ గా పరిచయం కావడం చాలా హ్యాపీగా ఉంది. మీ అందరికీ ఈ సినిమా నచ్చుతుంది' అన్నారు.

డైరెక్టర్ సుభాష్ చంద్ర మాట్లాడుతూ.. అతిథులందరికీ థాంక్యూ సో మచ్. ఇది అమ్మ ప్రేమ లాంటి ఒక చక్కటి ఊరు కథ. గోదారి గట్టున కూర్చొని ఫ్రెండ్స్ తో కబుర్లు చెప్పుకుంటే ఎలా ఉంటుందో ఈ సినిమా అంత హాయిగా ఉంటుంది. ఇందులో రెండు ప్రేమ కథలు ఉన్నాయి. సుమంత్, హీరోయిన్ ది ఒక లవ్ స్టోరీ అయితే, తండ్రి కూతుర్లది ఒక లవ్ స్టోరీ. నిర్మాత అభినవ్ గారికి థాంక్యూ సో మచ్. ఆయన దాదాపుగా వంద కథలు పైగా విన్నారు. ఈ కథ ఆయనకు నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో ఫాదర్ క్యారెక్టర్ జగపతి బాబు గారు చేస్తున్నారు. ఆయనకి మా ప్రత్యేక కృతజ్ఞతలు. ఇది అందరికీ నచ్చే సినిమా'అన్నారు.

**నటీనటులు:** సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు, రాజీవ్ కనకాల, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్ కుమార్ కసిరెడ్డి, వైవా రాఘవ్, రీను, రోహిత్ కృష్ణ తదితరులు, **సాంకేతిక సిబ్బంది:** దర్శకత్వం - సుభాష్ చంద్ర, బ్యానర్ - రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్, డీవోపీ - సాయి సంతోష్, సంగీతం - నాగ వంశీ కృష్ణ, ఎడిటర్ - అనిల్ కుమార్ పి, ప్రొడక్షన్ డిజైనర్ - ప్రవల్య, సౌండ్ డిజైనర్ - నాగార్జున తాళ్లపల్లి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - మధులిక సంచన లంక, పీఆర్వో - వంశీ-శేఖర్, మార్కెటింగ్ - ఫస్ట్ షో.

# కుబేర 'ఫస్ట్ గ్లింప్స్' నవంబర్ 15న రిలీజ్

### రష్మిక మందన్న బ్రాండ్ న్యూ పోస్టర్ విడుదల

**హైదరాబాద్:** సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, నేషనల్ అవార్డ్-విన్నింగ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల హైలీ యాంటిసిపేటెడ్ పాన్-ఇండియన్ మూవీ కుబేర. ఈ క్రేజీ ఎంటర్‌టైనర్‌లో రష్మిక మందన్న కూడా కీలక పాత్రలో నటిస్తోంది. మూడు పాత్రలు వేర్వేరు వీడియోలు, పోస్టర్ల ద్వారా పరిచయం చేశారు. ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న క్యారెక్టర్ బ్యాక్ డ్రాప్స్ ని క్రియేటివ్ గా ప్రజెంట్ చేసిన దీపావళి స్పెషల్ పోస్టర్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.శేఖర్ కమ్ముల 'కుబేర'లో రష్మిక సరికొత్త స్పార్క్‌ని చూడటానికి గెట్ రెడీ, ఈ కొత్త పోస్టర్ ముంబై మహాసముద్రం బ్యాక్ డ్రాప్ లో అందమైన చిరునవ్వుతో రష్మిక కనిపించారు. సింపుల్ అండ్ గ్రౌండెడ్ లైఫ్ గడుపుతుందని ఆమె లుక్ సూచిస్తుంది. ప్రతి పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ నెల 15 న ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ కానుంది. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్ పీ, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్ పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు హై బడ్జెట్, అత్యున్నత నిర్మాణ విలువలతో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.ఈ చిత్రంలో జిమ్ సర్భ్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మల్టీ లింగ్వెల్ ప్రాజెక్ట్ తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళంలో రూపొందిస్తున్నారు.





# అవకాశాల కోసం ఎదురుచూడ్డం కాదు మనమే అవకాశాలు సృష్టించుకోవాలి!

### రైజింగ్ స్టార్ రుషి కిరణ్



కొంతమంది సినిమా ప్రారంభానికి ముందే చేయబోయే సినిమా గురించి పబ్లిసిటీ చేయాలనుకుంటారు. కాని "రుషి కిరణ్" మాత్రం సినిమా షూటింగ్ కంప్లీట్ చేసిన తరువాత పబ్లిసిటీకి ముందడుగు వేసారు, ఇంతకి ఎవరీ రుషి కిరణ్ అనుకుంటున్నారా? గుంటూరుకు చెందిన "గుడిపల్లి కిరణ్ కుమారే" ఈ రుషి కిరణ్. నటుడిగా రాణించాలనే తపనతో ఇండస్ట్రీలో అడుగు పెట్టి... ఎన్నో ప్రయత్నాలు చేస్తూ... "సస్పెక్ట్" సినిమాతో హీరో అయ్యారు. "సస్పెక్ట్" పోస్ట్ ప్రొడక్షన్ లో ఉండగానీ.. "మోక్షం" సినిమాలో కూడా హీరోగా ఎంపికయ్యాడు. యాక్టింగ్ పరంగా కన్నడ శోభరాజ్, టార్జాన్, ఆనంద భారతి లాంటి సీనియర్ కళాకారులతో శభాష్ అనిపించుకున్న కిరణ్ కుమార్ సినిమాల కోసం "రుషి కిరణ్" గా మారాడు!! ఈరోజు (నవంబర్ 10) తన జన్మదినం సందర్భంగా తను నటించిన "సస్పెక్ట్" మరియు "మోక్షం" సినిమా పోస్టర్లను సోషియల్ మీడియాలో విడుదల చేశారు. సినిమా ఇండస్ట్రీలో ఎవ్వరూ ఎవ్వరినీ పిలిచి అవకాశాలు ఇవ్వరు. మనమే సృష్టించుకోవాలి. దానికోసం అహర్నిశలు కృషి చేయాలని ప్రకటించారు. తను చేసిన రెండు సినిమాల యాక్టింగ్ చూసి "పోలీస్ పటేల్, ఈ సినిమా కు క్లైమాక్స్ ఉండదు" అనే ఇంకో రెండు సినిమాల్లో అవకాశం వచ్చిందని రుషి కిరణ్ తెలిపారు!!

# "ధూం ధాం" సినిమాకు ప్రేక్షకుల నుంచి ఎక్స్ లెంట్ రెస్పాన్స్ వస్తోంది



### సక్సెస్ మీట్ లో హీరో చేతన్ కృష్ణ

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "ధూం ధాం". సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. "ధూం ధాం" సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చిన ఈ సినిమా సకుటుంబంగా ప్రేక్షకుల్ని ఎంటర్ టైన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గోపీ మోహన్ మాట్లాడుతూ - మా "ధూం ధాం" సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. యూఎస్ నుంచి కూడా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. మంచి సినిమా చేశామని ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సినిమాను మీడియా మిత్రులు మరింతగా ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నా. థియేటర్స్ కు వస్తే తప్పకుండా ప్రతి ఒక్కరూ ఎంటర్ టైన్ అవుతారు. అన్నారు.

దర్శకుడు సాయికిషోర్ మచ్చా మాట్లాడుతూ - "ధూం ధాం" సినిమా ఫ్యామిలీ ఎంటర్ టైనర్ అనే పేరు వస్తోంది. ఈ సినిమాకు పనిచేసే అవకాశం మా గోపీ మోహన్ గారి వల్ల వచ్చింది. "ధూం ధాం" సినిమా రిలీజైన ప్రతి సెంటర్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. నాకు కనీసం వంద ఫోన్ కాల్స్ వచ్చి ఉంటాయి. ఈ సినిమాలో వెన్నెల కిషోర్, బెనర్జీ, సాయి శ్రీనివాస్ వంటి వారి క్యారెక్టర్స్ చూస్తూ ప్రేక్షకులు బాగా నవ్వుతున్నారు. మా మూవీని మీడియా ఫ్రెండ్స్ మరింతగా ఆడియెన్స్ కు రీచ్ చేయాలి. అన్నారు.

నటుడు గిరిధర్ మాట్లాడుతూ - "ధూం ధాం" సినిమాలో నా క్యారెక్టర్ కు ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతున్నారు. ఇలాంటి మంచి అవకాశం ఇచ్చిన డైరెక్టర్ సాయికిషోర్ కు థ్యాంక్స్ చెబుతున్నా. అలాగే మా ప్రొడ్యూసర్ రామ్ కుమార్ గారు మాకు ఎంతో సపోర్ట్ గా నిలిచారు. నా క్యారెక్టర్ బాగుందంటూ ఎంతోమంది ఫోన్ చేసి చెబుతుండటం హ్యాపీగా ఉంది. అన్నారు.

నిర్మాత రామ్ కుమార్ మాట్లాడుతూ - పెద్ద సినిమాల పోటీలో "ధూం ధాం" లాంటి చిన్న సినిమా నిలదొక్కుకోవడమే గొప్ప విషయం. మేము ఇంకా పరుగు స్టార్ట్ చేయలేదు. నిలబడ్డాం అంతే. మా మూవీని ఆడియెన్స్ దాకా రీచ్ చేసిన క్రెడిట్ మీడియా మిత్రులదే. తర్వాత ఓటీటీలో చూద్దాంలే అని అనుకోకుండా "ధూం ధాం" సినిమాను థియేటర్ లో ఎక్స్పీరియన్స్ చేయండి. ఎందుకంటే ఇలాంటి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ సినిమాను 2, 3 వందల మంది ప్రేక్షకుల మధ్య కూర్చొని చూస్తే బాగా ఎంజాయ్ చేస్తారు. అన్నారు.

హీరో చేతన్ కృష్ణ మాట్లాడుతూ - మా "ధూం ధాం" సినిమాకు ప్రేక్షకుల దగ్గర నుంచి ఎక్సలెంట్ రెస్పాన్స్ వస్తోంది. మీడియా నుంచి కూడా చాలా మంచి రివ్యూస్ వచ్చాయి. నిన్న (ఫ్రైడే) మార్నింగ్ నుంచి రాత్రి వరకు ప్రతి షోకు థియేటర్స్ లో ఫుట్ ఫాల్స్ పెరిగాయి. సినిమా చాలా బాగుందంటే తప్ప ఆడియెన్స్ బయటకు రాని ఈ ట్రెండ్ లో మా మూవీకి 70, 80 పర్సెంట్ హౌస్ ఫుల్స్ కావడం సంతోషంగా ఉంది. సినిమాలో కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ ఉంటుందని మేము ముందునుంచీ చెబుతూ వస్తున్నాం. ఆ ఎంటర్ టైన్ మెంట్ కే ఆడియెన్స్ కనెక్ట్ అవుతున్నారు. సినిమా చూసి తమ రెస్పాన్స్ చెబుతున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. చూడని వాళ్లు థియేటర్స్ లో "ధూం ధాం" చూడమని రిక్వెస్ట్ చేస్తున్నా. అన్నారు. నటీనటులు - చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్, సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ, శివన్నారాయణ, బెనర్జీ, సాయి శ్రీనివాస్, ప్రవీణ్, నవీన్ నేని, గిరిధర్, భద్రమ్ తదితరులు

**టెక్నికల్ టీమ్**

డైలాగ్స్ - ప్రవీణ్ వర్మ, కొరియోగ్రఫీ - విజయ్ బిన్ని, భాను, లిరిక్స్ - సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి, ఫైట్స్ - రియల్ సతీష్, పబ్లిసిటీ డిజైనర్స్ - అనిల్, భాను, ఆర్ట్ డైరెక్టర్ - రఘు కులకర్ణి, ఎడిటింగ్ - అమర్ రెడ్డి కుడుముల, సినిమాటోగ్రఫీ - సిద్ధార్థ్ రామస్వామి, మ్యూజిక్ - గోపీ సుందర్, స్టోరీ స్క్రీన్ ప్లే - గోపీ మోహన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - శివ కుమార్, పీఆర్ ఓ- జీఎస్ కే మీడియా(సురేష్ - శ్రీనివాస్), ప్రొడ్యూసర్ - ఎంఎస్ రామ్ కుమార్, డైరెక్టర్ - సాయి కిషోర్ మచ్చా.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com